


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 284

గురువారం 27-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ఫైనల్' అడుగు ఎవరిదో!

నేడు దక్షిణాఫ్రికా–అఫ్గాన్.. భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య సెమీఫైనల్స్ - 12లో



ముగిసిన స్పెక్ట్రం వేలం

రూ. 11,340 కోట్ల బిడ్లు దాఖలు.. ఎయిర్‌టెల్ అత్యధిక కొనుగోలు - 13లో



అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు

మనీ లాండరింగ్ కేసులో అరెస్టు అయ్యి.. తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది.

వివరాలు 6లో ▸



రోడ్లు బాగాలేకపోతే..

రోడ్లు సరిగ్గా లేకపోతే టోల్ రుసుము వసూలు చేయొద్దని కేంద్ర మంత్రి గడ్కరీ రహదారుల నిర్వహణ సంస్థలను ఆదేశించారు.

వివరాలు 6లో ▸



అసాంజేకు విముక్తి

వికీలీక్స్ వ్యవస్థాపకుడు అసాంజేకు విముక్తి దొరికింది. తన నేరాలను అంగీకరించడంతో ఫెడరల్ కోర్టు అసాంజేను విడుదల చేసింది.

వివరాలు 6లో ▸



ముగ్గురు తీవ్రవాదుల కాల్చివేత

జమ్మూ కశ్మీర్‌లో భారత భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు తీవ్రవాదులు బుధవారం హతమయ్యారు.

వివరాలు 6లో ▸

సచివాలయాలతో సమున్నత సేవలు

పాలనలో వైఎస్ జగన్ వినూత్న ఒరవడిపై నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు సదస్సులో నిపుణుల ప్రశంసలు

2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన వ్యవస్థ ఓ అద్భుతం

- పాలనా వికేంద్రీకరణలో భాగంగా విప్లవాత్మక వ్యవస్థ ఏర్పాటు
- సంక్షేమ ప్రయోజనాలతోపాటు పౌరుల అవసరాలన్నీ తీర్చారు
- గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారం
- ప్రతి గ్రామంలోనూ పౌరులందరికీ చేరువైన వ్యవస్థ
- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అవిక్ సర్కార్ ప్రశంసలు
- గ్రామ, వార్డు సచివాలయాలతో ఎస్‌డీజీ లక్ష్యాల సాధన
- పథకాలు, కార్యక్రమాల అమలుకు యాప్‌లు, అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ
- బాలికల్లో రక్తహీనత నిర్మూలనకు డేటా సేకరణ, క్రోడీకరణ
- ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సభ్యురాలు భావనా వశిష్ఠ



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం పౌర సేవలు, ప్రభుత్వ పథకాల అమలు స్వరూపాన్నే మార్చేసింది. గ్రామ గ్రామాన సరికొత్త చిత్రం ఆవిష్కృతమైంది. పల్లె రూపురేఖలే మారిపోయాయి. విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు సాకారమయ్యాయి. ఎక్కడా లంచాలు, వివక్ష, పడిగాపులకు తావులేకుండా పారదర్శకంగా ప్రతి ఇంటికీ ప్రయోజనాలను అందచేసింది. గ్రామం నుంచి కదలాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ యంత్రాంగాన్నే పల్లె చెంతకు తీసుకొచ్చింది. దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో సాకారమైన విప్లవాత్మక మార్పులివి. నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు నిర్వహించిన సంయుక్త సదస్సు ఈ అంశాలను ప్రముఖంగా ప్రస్తావించడం గమనార్హం. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ అద్భుతమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అవిక్ సర్కార్ ప్రశంసించారు. ఇంటింటికీ

మిగతా 2వ పేజీలో ▶



స్పీకర్‌గా ఓం బిర్లా

విపక్ష అభ్యర్థి సురేశ్‌పై విజయం

మూజువాణి ఓటుతో ఎన్నిక

ప్రధాని నరేంద్ర మోదీ, రాహుల్ అభినందన

సీటు దాకా తోడ్కొని వెళ్లిన వైనం

విలువలకు పట్టం కడతా: బిర్లా

సభలో తొలి రోజే వాయిదా పర్వం

ఎమర్జెన్సీని ఖండిస్తూ బిర్లా తీర్మానం

తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు

పార్లమెంటు ఆవరణలో బీజేపీ నిరసన

6లో

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ నెల 18న రెండో సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ప్రకటించిన సంగతి తెలిసిందే.

వివరాలు 14లో ▸

హెల్మెట్ ధరించకపోతే ఉపేక్షించొద్దు



రాష్ట్రంలో ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ విషయంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించరాదని స్పష్టం చేసింది.

వివరాలు 5లో ▸

వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేతలపై యథాతథ స్థితి



రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేతకు ప్రభుత్వ పెద్దలు చేస్తున్న కుట్రలకు హైకోర్టు బ్రేకులు వేసింది. వైఎస్సార్‌సీపీ కార్యాలయాల విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో)ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

వివరాలు 2లో ▸

అనగాని ఇలాకాలో ఆగని విధ్వంసం



రాష్ట్ర మంత్రి అనగాని ఇలాకా రేపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారు. దొరికిన వారిని దొరికినట్లు విచక్షణా రహితంగా చితకబాదుతున్నారు. ఊళ్లు వదిలి వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారు.

వివరాలు 10లో ▸



పిన్నెల్లి అరెస్టు

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు
- వెంటనే ఆయన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలింపు
- నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు

10లో



క్వారీలపై కూటమి నేతల జులుం

రాష్ట్రవ్యాప్తంగా క్వారీల్లో స్తంభించిన తవ్వకాలు

తమ లెక్క తేల్చాకే క్వారీయింగ్ చేయాలని ఎమ్మెల్యేల హుకుం

దీంతో 15 రోజులుగా ప్రభుత్వానికి మైనింగ్ రాయల్టీ బంద్

తవ్వకాలు లేకపోవడంతో ఇబ్బందుల్లో రవాణా పరిశ్రమ

ముడి సరుకులు లేక పలు పరిశ్రమలకు ఆటంకాలు

మరోవైపు పలుచోట్ల యథేచ్ఛగా టీడీపీ అక్రమ మైనింగ్

లోకేశ్ దత్తత గ్రామంలోనే అనధికారికంగా మట్టి తవ్వకాలు

3లో



విపక్షంలో పెద్ద పార్టీకే ప్రధాన ప్రతిపక్ష హోదా

- కేంద్ర, రాష్ట్ర చట్టాలు చెబుతున్నది అదే
- 10 శాతం సీట్లు ఉంటేనే ఆ హోదా ఇవ్వాలనే నిబంధన ఏ చట్టంలోనూ లేదు
- లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి స్పష్టీకరణ
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 3 సీట్లే వచ్చినా ప్రధాన విపక్షంగానే గుర్తింపు

2లో

ఓటీటీకి యమక్రేజ్

- స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలకు విపరీతంగా పెరిగిన ఆదరణ
- ఖర్చు తక్కువ, సౌలభ్యం ఎక్కువ
- సరికొత్త సినిమాలు, కంటెంట్‌తో ఆకట్టుకుంటున్న వైనం
- కుటుంబంతో కలిసి టీవీలోనే హాయిగా వీక్షించే వెసులుబాటు
- అన్ని వర్గాలకూ అందుబాటులో ప్లాన్లు
- థియేటర్లకు వెళ్తున్న వారి సంఖ్య తగ్గుముఖం



రాజమహేంద్రవరం రూరల్: నెట్‌ఫ్లిక్స్.. డిస్నీ హాట్‌స్టార్.. అమెజాన్ ప్రైమ్.. ఆహా.. జీ5.. జియో.. సోనీ లివ్ ఏదైనా కానీ.. ఐదేళ్ల క్రితం వరకూ ఈ ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫాంల గురించి తెలిసింది కొద్దిమందికే. అన్ని రంగాలనూ కుదేలు చేసిన కరోనా మహమ్మారి.. ఓటీటీలకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. లాక్‌డౌన్‌తో ఇళ్లకే పరిమితమైన ప్రజలకు ఓటీటీలే ఏకైక వినోద సాధనమయ్యాయి. సరికొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు, సీరియళ్లు, వినూత్న కంటెంట్‌తో ఆకర్షించాయి. చౌకగా లభించే ప్లాన్లు, ఇంటిల్లిపాదీ చూసే వీలుండటంతో అతి కొద్ది కాలంలోనే వీటికి అమాంతం జనాదరణ పెరిగింది. భారీ బడ్జెట్ సినిమాలూ నేరుగా ఓటీటీలోకి వస్తున్నాయంటే వీటికి ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఓటీటీ మొదట అమెరికా వంటి దేశాల్లో మొదలై, క్రమంగా అన్ని దేశాలకూ విస్తరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 శాతం ప్రేక్షకులు ఓటీటీని వినియోగిస్తున్నారనేది ఒక అంచనా. ఇదే సమయంలో ప్రజలకు ప్రత్యామ్నాయ వినోద సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో ముఖ్యంగా ఓటీటీ వారిని అమితంగా ఆకర్షించింది. కుటుంబమంతా ఒకేసారి థియేటర్‌కు వెళ్తే రూ.1,200 వరకూ ఖర్చయ్యే పరిస్థితి నెలకొనగా.. అదే ఓటీటీకి వచ్చేసరికి కేవలం ఒక్కసారి ఖర్చుతో ఏడాది మొత్తం సినిమాలు చూసే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో థియేటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కొత్త సినిమాల విడుదల సమయంలో అది కూడా టాప్ హీరోల చిత్రాలకు ఒకటి రెండు రోజులు మాత్రమే సినిమా హాళ్ల వద్ద హడావుడి కనిపిస్తోంది. ఆ తరువాత షరా మామూలే. దీంతో థియేటర్ల యజమానులకు నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

స్మార్ట్ టీవీల్లో ఓటీటీ యాప్‌లు

కేబుల్ టీవీ, డీటీహెచ్ వంటి కనెక్షన్లు అవసరం లేకుండా కేవలం ఇంటర్‌నెట్‌తో వినోదం అందించే సాధనంగా ఓటీటీకి విశేష ఆదరణ లభిస్తోంది. దీనిని డిజిటల్ స్ట్రీమింగ్ మీడియా సర్వీస్‌గా కూడా పిలుస్తున్నారు. వీటిల్లో వెబ్ సిరీస్‌లు, టీవీ కార్యక్రమాలు, సెలబ్రిటీల ఇంటర్వ్యూలు, ఇతర షోలు, సినిమాలు ప్రసారం చేస్తున్నారు. ఇప్పుడొస్తున్న చాలా స్మార్ట్ టీవీల్లోనే ఇన్‌బిల్ట్‌గా ఓటీటీ యాప్‌లు ఉంటున్నాయి. తక్కువ రేటు, సులభ వాయిదాల్లో టీవీలు లభ్యమవుతూండటంతో అన్ని వర్గాల ప్రజల ఇళ్లల్లో స్మార్ట్ టీవీలే కనిపిస్తున్నాయి. ఏపీ ఫైబర్‌నెట్, ఇతర ప్రైవేటు ఆపరేటర్లు తక్కువ ప్లాన్లలోనే నెట్ సదుపాయం అందిస్తుండటం కూడా ఓటీటీకి వరంగా మారింది.

నేరుగా ఓటీటీలోనే..

చిన్న, పెద్ద హీరో, బడ్జెట్ అనే తారతమ్యం లేకుండా దాదాపు చాలా సినిమాలు ఇటీవల ఓటీటీల్లోనే విడుదలవుతున్నాయి. నేరుగా విడుదలయినా పది రోజుల్లోనే ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రతి శుక్రవారం కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లతో ఓటీటీలు ఆకట్టుకుంటున్నాయి. అంతే కాకుండా తెలుగు, తమిళం, మళయాళం, హిందీ, ఇంగ్లిషుతో పాటు, విదేశీ భాషల సినిమాలు, సిరీస్‌లను కూడా ఇవి అందిస్తున్నాయి. దీంతో ప్రేక్షకులకు ప్రధాన వినోద మార్గంగా ఓటీటీలు అవతరిస్తున్నాయి.

ఇదండీ సంగతి



ఎంపీగారి బస్సులా.. అయితే ఓకే!

నిబంధనలకు విరుద్ధంగా ఓ విద్యా సంస్థ బస్సుల రిజిస్ట్రేషన్లు

కేంద్ర చట్టం బేఖాతరు.. భద్రతా ప్రమాణాలు గాలికి...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇదీ చిత్రం

సాక్షి, అమరావతి: ఆయనో టీడీపీ ఎంపీ. ఉమ్మడి గుంటూరు జిల్లాలో విద్యా సంస్థల టైకూన్‌గా గుర్తింపు పొందారు. అంతకంటే అర్హత ఏముంటుందని రవాణా శాఖ అధికారులు భావించారు. అందుకే ఆయన విద్యా సంస్థకు చెందిన వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. విద్యా సంస్థల బస్సుల్లో భద్రతా ప్రమాణాల కోసం విద్యార్థుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో చేసిన మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలను ఏమాత్రం పాటించకపోయినా సరే నిరభ్యంతరంగా రిజిస్ట్రేషన్లు చేసేస్తూ స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారు. విద్యార్థుల భద్రతతో ముడిపడిన వ్యవహారం అయినప్పటికీ ఎంపీ ఒత్తిడికి తలొగ్గి

మిగతా 2వ పేజీలో ▶





ఎన్జీ రంగా వర్సిటీలో రాజకీయ బదిలీలు

- కేవలం రెండు వారాల్లో 102 మందికి పైగా స్థానచలనం
- వీరిలో 38 మంది ప్రొఫెసర్లు, 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- 16 మంది డీన్స్ కూడా బదిలీ
- కనీస నిబంధనలు పాటించకుండా బదిలీ ఉత్తర్వులు

14లో

క్లుప్తంగా...

వీసీగా జానకీరాం పునర్నియామకం చెల్లదు

- హైకోర్టు ధర్మాసనం తీర్పు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ హార్టీకల్చర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ (వీసీ)గా డాక్టర్ జానకీరాం తోలేటీ పునర్నియామకాన్ని హైకోర్టు కొట్టేసింది. ఆయన నియామకం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు అనుగుణంగా జరగలేదని తేల్చింది. వీసీగా జానకీరాం నియామకం, అటు తరువాత ఆయన పునర్నియామకం రెండూ కూడా చట్ట విరుద్ధమేనని స్పష్టం చేసింది. సెర్చ్ కమిటీ సిఫారసుల ఆధారంగా జానకీరాంను వీసీగా నియమించారని, వాస్తవానికి ఆ సెర్చ్ కమిటీ నియామకమే చట్ట నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని తెలిపింది. కమిటీలో యూజీసీ చైర్మన్ నామినీ ఉండి తీరాలని, అయితే జానకీరాంను వీసీగా నియమించిన సెర్చ్ కమిటీలో యూజీసీ చైర్మన్ నామినీ ఎవరూ లేరని పేర్కొంది. అందువల్ల మొదటి నియామకమే చట్ట విరుద్ధమైనప్పుడు, ఆయన పునర్నియామకం కూడా చట్ట విరుద్ధమే అవుతుందని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చింది. హార్టీకల్చర్ విశ్వవిద్యాలయం వీసీగా జానకీరాం నియామకాన్ని సవాలు చేస్తూ ఏపీ ఎస్‌టీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.దారూ నాయక్, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ జి.రవిశంకర్‌రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు.

సభకు సహకరిస్తాం

- వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : లోక్‌సభ సమావేశాలు సజావుగా సాగడానికి సహకరిస్తామని వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్షనేత మిథున్‌రెడ్డి తెలిపారు. బుధవారం సభాపతిగా ఓం బిర్లా ఎన్నికైన అనంతరం వైఎస్సార్‌సీపీ తరఫున మిథున్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గత సభలో సభాపతిగా ఓం బిర్లా ఎంతో హుందాగా వ్యవహరించారని, అంకితభావంతో ప్రజాస్వామ్య విలువలు పెంచారని అన్నారు. గత సభలో కొత్త సభ్యుల్ని ప్రోత్సహించిన విధంగానే ఇప్పుడు కూడా ప్రోత్సహించాలని కోరిన మిథున్‌రెడ్డి సభాపతికి 'ఆల్ ద బెస్ట్' తెలిపారు.

మెయిన్స్‌ను వాయిదా వేయండి

- ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్

సాక్షి, అమరావతి: ఏపీలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని గ్రూప్–2 మెయిన్స్ పరీక్షను మరో రెండు నెలలు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గ్రూప్–2 మెయిన్స్ రాసే అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఎన్నికల విధుల్లో పాల్గొనడంతో సన్నద్ధమయ్యేందుకు సమయం కోల్పోయారని తెలిపారు. ఈ క్రమంలో వారికి పరీక్ష కోసం తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు గ్రూప్–1లో 1–100 నిష్పత్తి, డెప్యూటీ డీఈవో 1–100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని కోరారు.

నీట్ అక్రమాలు తేల్చండి..

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. నీట్ పరీక్ష ప్రశ్నపత్రంలో తప్పులు, గ్రేస్ మార్కుల కేటాయింపులు సరిగా లేకపోవడం, పేపర్ లీకేజీ వంటి తీవ్రమైన ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం బదులిచ్చి విద్యార్థులు, తల్లిదండ్రులకు ధైర్యం కల్పించాలని కోరారు.

'కల్కి'కి మొదటి రోజు ఆరో షోకు అనుమతి

సాక్షి, అమరావతి: ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమా మొదటి రోజున ఆరో షో ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. సినిమాను విడుదల చేస్తున్న గురువారం తెల్లవారు జామున 4.30గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య ఈ షో వేసేందుకు అనుమతించింది. ఈ మేరకు హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విడుదల నుంచి తొలి రెండు వారాలపాటు రోజుకు ఐదు షోలు ప్రదర్శించేందుకు, టికెట్ ధరలను సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.75, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.125 చొప్పున పెంచుకునేందుకు హోంశాఖ కొన్ని రోజుల క్రితమే అనుమతించిన విషయం తెలిసిందే.

డయేరియాతో రెండేళ్ల చిన్నారి మృతి

- కాట్రపల్లి దళితవాడలో ఘటన

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): డయేరియాతో రెండేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం, కాట్రపల్లి దళితవాడలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కామాక్షి, దశ్వంత్ దంపతుల కుమార్తె దర్శిని (2) బుధవారం వేకువజామున నుంచి వాంతులు, విరేచనాలకు గురై డయేరియా బారిన పడింది. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేపడుతుండగా గంటల వ్యవధిలోనే మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కళ్లెదుటే తమ కుమార్తె మృతి చెందడంపై చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అదే దంపతులకు చెందిన 9 నెలల పసికందు కూడా వాంతులు, విరేచనాలకు గురై చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ గ్రామంలో పలువురు డయేరియా బారినపడ్డారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేతలపై

యథాతథస్థితి..

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దన్న ప్రభుత్వ వినతి తిరస్కృతి
- పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశం
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల కూల్చివేతకు ప్రభుత్వ పెద్దలు చేస్తున్న కుట్రలకు హైకోర్టు బ్రేకులు వేసింది. వైఎస్సార్ సీపీ కార్యాలయాల విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో)ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. వైఎస్సార్‌సీపీ కార్యాలయాల భవనాల కూల్చివేతలపై పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తాము చట్టానికి అనుగుణంగా వ్యవహరిస్తామని, కోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ అడ్వొకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు పదే పదే చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయం విషయంలో కూడా చట్టాన్ని అనుసరిస్తామంటూ కోర్టుకు స్పష్టమైన హామీ ఇచ్చి తెల్లారేసరికి పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు, చట్ట ప్రకారం నడుచుకుంటామన్న ప్రభుత్వ న్యాయవాదుల వాదనను విశ్వసించలేదు. యథాతథస్థితిని కొనసాగించాలన్న తన ఉత్తర్వులకే కట్టుబడింది.

నోటీసులపై అత్యవసరంగా పిటిషన్లు..

వివిధ జిల్లాల్లో తమ పార్టీ కార్యాలయాలను కూల్చివేసేందుకు అధికారులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. అధికారుల నోటీసులను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయా జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వేర్వేరుగా హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా 9 పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది పాపెల్లుగారి వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. అధికారుల చర్యలు ఏకపక్షంగా ఉన్నాయన్నారు. 2016లో నాటి టీడీపీ సర్కారు ఇచ్చిన జీవో ప్రకారమే వైఎస్సార్ సీపీ కార్యాలయ నిర్మాణం కోసం భూముల కేటాయింపు జరిగిందన్నారు. ఆ జీవో ప్రకారం భూమి స్వాధీనం చేసిన ఏడాది లోపు ఆ స్థలంలో పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేయడం తప్పనిసరన్నారు. లేనిపక్షంలో కేటాయించిన భూమిని తిరిగి వెనక్కి తీసుకోవచ్చన్నారు. పార్టీ కార్యాలయాల నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నామని, అయితే అధికారులు నిర్దేశిత వ్యవధిలోపు అనుమతులు ఇవ్వలేదన్నారు. దీంతో ఇలా నిర్దేశిత వ్యవధిలోపు అనుమతులు ఇవ్వకుంటే, అనుమతులు ఇచ్చినట్లే భావించి పార్టీ కార్యాలయాల నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నాం..

అనుమతులు తీసుకోలేదన్న కారణంతో పార్టీ కార్యాలయాలను ఎందుకు కూల్చివేయరాదో వివరణ ఇవ్వాలంటూ అధికారులు నోటీసులు ఇచ్చారని వీరారెడ్డి తెలిపారు. దానికి తాము సవివరంగా వివరణ ఇచ్చినా మరో అధికారి నోటీసులు ఇచ్చారన్నారు. దీన్నిబట్టి కూల్చివేతకు అధికారులు ఎంత తొందరపడుతున్నారో అర్థమవుతోందన్నారు. ఒకవేళ తమ నిర్మాణాలు అక్రమమే అనుకున్నప్పటికీ, వాటిని క్రమబద్ధీకరించే అధికారం చట్ట ప్రకారం మునిసిపల్ కమిషనర్‌కు ఉందని నివేదించారు. ఇవన్నీ చేయకుండా, ప్రక్రియను అనుసరించకుండా నేరుగా కూల్చివేతలకు పాల్పడరాదన్నారు. తాము క్రమబద్ధీకరణకు సైతం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కూల్చివేతలు సమస్యకు పరిష్కారం కాదని, అది కేవలం చివరి అంకం మాత్రమేనన్నారు. ఈ మధ్యలో చట్టం పలు ప్రత్యామ్నాయాలను చూపిందని నివేదించారు. తుది ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిషనర్ మెదడు ఉపయోగించాల్సి ఉంటుందని, యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదన్నారు. తాము ఇచ్చిన వివరణను పరిగణలోకి తీసుకోకుండా కూల్చివేతల విషయంలో ముందుకెళ్లడానికి వీల్లేదన్నారు.

చట్ట ప్రకారం నడుచుకుంటాం.. ఇచ్చింది షోకాజ్ నోటీసులే

వాదనలు విన్న అనంతరం అధికారులు ఇతర ప్రొసీడింగ్స్‌ను కొనసాగించుకోవచ్చని, అయితే కూల్చివేతల విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అయితే కేవలం ఆందోళనతోనే ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారని, వీటికి విచారణార్హతే లేదని అడ్వొకేట్ జనరల్ కార్యాలయం తరఫున హాజరైన న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కూల్చివేస్తామనేందుకు ఎలాంటి ఆధారాలను చూపలేదన్నారు. కూల్చివేతల విషయంలో తాము చట్ట ప్రకారం నడుచుకుంటామన్నారు. కోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరంలేదన్నారు. తాము ఇచ్చింది కేవలం షోకాజ్ నోటీసులు మాత్రమేనన్నారు. ఈ సమయంలో వీరారెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇలాగే చట్ట ప్రకారం నడుచుకుంటామంటూ వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయ భవనాన్ని తెల్లవారేసరికి కూల్చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ తరఫు మరో న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి జోక్యం చేసుకుంటూ, కూల్చివేతల విషయంలో ఏమీ చేయబోమంటూ కృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని కోర్టుకి ఇచ్చిన హామీగా నమోదు చేయాలన్నారు. దీన్ని కృష్ణారెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. తాను ఎలాంటి హామీ ఇవ్వడం లేదన్నారు. దీంతో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ యథాతథస్థితి ఉత్తర్వులు ఇస్తానని పునరుద్ఘాటించారు.

సచివాలయాలతో

సమున్నత సేవలు

▶ మొదటి పేజీ తరువాయి

పౌర సేవలు, అర్హులకు సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ అద్భుతంగా పని చేస్తోందని, ప్రధానంగా నీతి ఆయోగ్ నిర్దేశించిన ఎస్‌డీజీ (సుస్థిరాభివృద్ధి) లక్ష్యాల సాధనకు సచివాలయాలతో క్షేత్రస్థాయి నుంచి కృషి చేశారని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సభ్యురాలు భావనా వశిష్ఠ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ఆవిష్కరణ డేటా ఆధారిత పాలన, ప్రణాళికల కోసం డేటా సేకరణపై ఇటీవల లక్నోలో నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు సంయుక్త సదస్సు నిర్వహించాయి. డేటాను నాలెడ్జ్‌గా మార్చడం, 2047 భారత్ విజన్ లక్ష్యాలను సాధించడం, డేటాను పరిపాలనలో వినియోగించడం తదితర అంశాలపై వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలపై చర్చాగోష్టి నిర్వహించారు. సదస్సులో నీతి ఆయోగ్, ప్రపంచబ్యాంకుతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని ఆయా రాష్ట్రాల్లోని ఆవిష్కరణలపై ప్రముఖంగా చర్చించారు.

ప్రతి పౌరుడికీ అందుబాటులో సేవలు..

సమగ్ర డేటా సేకరణ ద్వారా పాలనను మెరుగుపరిచే లక్ష్యంతో 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను ప్రారంభించిందని, పాలన వికేంద్రీకరణలో భాగంగా తెచ్చిన ఈ వ్యవస్థ అద్భుతమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అవిక్ సర్కార్ ప్రశంసించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనను వికేంద్రీకరించడంతోపాటు విధాన రూపకర్తలకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు గ్రామాలు, వార్డులలో ఆధునిక పరిజ్ఞానంతో సౌకర్యాలు కల్పించారన్నారు. ఏపీలోని ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడికీ ఈ వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్లు, నెలవారీ కేటాయింపులు లాంటి సంక్షేమ ప్రయోజనాలను అందజేయడంతోపాటు పౌరుల అవసరాలను గుర్తించి తీర్చుతున్నట్లు తెలిపారు. పరిపాలనాపరమైన ఫిర్యాదులను సింగిల్ విండో వ్యవస్థ ద్వారా పరిష్కరిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం వివిధ టెక్ పోర్టల్‌లను ఏర్పాటు చేయడం వల్ల పైస్థాయి నుంచి కింద స్థాయి వరకు పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేసే వెసులుబాటు కలిగిందన్నారు. విప్లవాత్మక పాలనలో భాగంగా డేటా సేకరణ, క్రోడీకరణ, మార్పిడి ద్వారా సచివాలయాల వ్యవస్థతో ఎన్నో విజయవంతమైన కార్యక్రమాలను అమలు చేశారన్నారు. నీతి ఆయోగ్ రూపొందించిన 116 సూచికల ఆధారంగా 16 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సచివాలయాల వ్యవస్థ దోహదం చేసిందని అభినందించారు. అన్ని పోర్టల్‌లలో డేటాను సేకరించడంతో పాటు విశ్లేషించి మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. పాఠశాలలకు వెళ్లే బాలికల్లో రక్తహీనత నిర్మూలన లాంటి సామాజిక లక్ష్యాలతో పాటు బడికి దూరమైన పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్చడం లాంటి వాటిని సచివాలయాల వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా అమలు చేసిందని ప్రస్తావించారు.



ఎస్‌డీజీ లక్ష్యాల సాధన..

నీతి ఆయోగ్ నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో పటిష్ట వ్యవస్థను తెచ్చిందని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సభ్యురాలు భావనా వశిష్ఠ పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అవసరమైన డేటా సేకరణ, విశ్లేషణ గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచే జరుగుతోందన్నారు. పథకాలు, కార్యక్రమాల అమలుకు యాప్‌లు తీసుకొచ్చి అన్ని స్థాయిల్లో పకడ్బందీగా పర్యవేక్షించారన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి పౌరుల అవసరాలను తీర్చడం, గ్రామంలోనే సేవలు అందించడం లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రారంభించిందన్నారు. అవి సింగిల్ విండో విధానం ద్వారా పంచాయతీలు, స్థానిక సంస్థలకు సహాయ విభాగంగా పనిచేయడంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. సచివాలయాల స్థాయిలోనే పౌరుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనకు సచివాలయాల వ్యవస్థ టెక్ పోర్టల్‌తో బలమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉందన్నారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనలో భాగంగా ఆరోగ్యం, విద్య సంబంధిత కార్యక్రమాలను గ్రామ, వార్డు సచివాలయాలతో అనుసంధానించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాల పర్యవేక్షణకు ఇంటిగ్రేటెడ్ డాష్ బోర్డ్ ఏర్పాటైందని, వీటన్నింటినీ ప్రతిబింబించేలా రాష్ట్ర స్థాయి డేటా రూపొందించడం కార్యక్రమాలు విజయవంతంగా అమలుకు దోహదం చేసిందన్నారు. అన్ని స్థాయిల్లో అధికారులు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. బాలికలలో రక్తహీనత నిర్మూలనకు విద్యాసంస్థల్లో డేటాను సేకరించి సంబంధిత విభాగాల ద్వారా క్రోడీకరించారని తెలిపారు. వలంటీర్ల ద్వారా భారీ సర్వేతో బడికి దూరమైన పిల్లల డేటాను సేకరించడంతోపాటు తిరిగి స్కూళ్లకు వెళ్లేలా ప్రోత్సహిస్తూ విద్యార్థి సమాచార పోర్టల్‌ను నిర్వహిస్తున్నారన్నారు. నవశకం ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులను పారదర్శకంగా గుర్తించి క్రోడీకరించిన లబ్ధిదారుల డేటాతో పోర్టల్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఒక్కో ఉద్యోగికి 50మంది పింఛనుదారులు

- సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీకి మార్గదర్శకాలు విడుదల
- ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 6గంటలకే పంపిణీ ప్రారంభించాలి
- అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగుల సేవలు

సాక్షి, అమరావతి: సామాజిక పింఛన్లను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం... తాజాగా ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఒక్కో ఉద్యోగికి తాము పని చేస్తున్న సచివాలయం పరిధిలో గరిష్టంగా 50మంది పింఛనుదారులను కేటాయిస్తారు. సచివాలయ ఉద్యోగులు సరిపడా లేకపోతే స్థానికంగా పనిచేసే ఇతర ప్రభుత్వ ఉద్యోగుల సేవలను పింఛన్ల పంపిణీ కోసం వినియోగించుకుంటారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు చేపట్టాలని పింఛన్ల పంపిణీకి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం జారీచేసిన నూతన మార్గదర్శకాలలో పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరుగంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలి. అదేరోజు అత్యధిక మందికి పంపిణీ చేయాలి. ఒకటో తేదీ మిగిలినవారికి రెండో తేదీకల్లా పింఛన్లు అందేలా కలెక్టర్లు చూడాలి. లబ్ధిదారులకు ఆధార్ బయోమెట్రిక్, ముఖ గుర్తింపు, ఐఆర్ఐఎస్ తదితర విధానాల్లో పింఛన్లు పంపిణీ చేయాలి. ఎయిడ్స్ రోగులతోపాటు దివ్యాంగుల కేటగిరీలో పింఛను పొందుతూ వివిధ ప్రాంతాల్లో చదువుకునే వారికి డీబీటీ విధానంలో బ్యాంకు ఖాతాల్లో పింఛను డబ్బులు జమచేస్తారు. ప్రస్తుతం ప్రతి నెలా రూ.3,000లు చొప్పున 11 కేటగిరీల లబ్ధిదారులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. గత మూడు నెలల నుంచి పింఛన్ల పెంపు వర్తిస్తుంది. అందువల్ల జూలై పింఛనుతో బకాయిలు కలిపి రూ.7వేలు చొప్పున పంపిణీ చేస్తారు. దివ్యాంగులు, కుష్టువ్యాధిగ్రస్తుల పింఛన్ రూ.6వేలకు పెంచి పంపిణీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం వద్దు

- సచివాలయ ఉద్యోగులంతా పంపిణీలో పాల్గొనాలి
- ఒకటి రెండు రోజుల్లోనే పూర్తవ్వాలి
- గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులతో మంత్రి డోలా

సాక్షి, అమరావతి: జూలై 1న పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగడానికి వీల్లేదని సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లోనే పింఛన్‌ల పంపిణీ పూర్తవ్వాలని అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల ఉద్యోగులంతా పింఛన్ల పంపిణీలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 1.9 లక్షల మంది వలంటీర్లు రాజీనామా చేశారని.. వారిలో సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేయని వారి సంగతేంటని ప్రశ్నించారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. చాలాచోట్ల గ్రామ, వార్డు సచివాలయ భవనాలు ఊరికి దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయన్నారు. అలాంటి వాటిపై వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులకు సెలవుల మంజూరుపై ఒక కచ్చితమైన విధానాన్ని రూపొందించాలన్నారు. సచివాలయాలు జారీ చేసే సర్టిఫికెట్లు, ఇతర సర్వీసుల పత్రాలపై పాత లోగోలు లేకుండా జాగ్రత్తపడాలని, ఈ విషయంలో ఎక్కడైనా అలసత్వం వహించినట్టు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సచివాలయాల భవనాల మీద గత ప్రభుత్వ లోగోలు, ఫొటోలు తొలగించి వాటి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో చాలాచోట్ల గ్రామ సచివాలయాలకు, పంచాయతీలకు మధ్య సమన్వయం లేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి మండల స్థాయిలో ఒక అధికారికి బాధ్యతలు అప్పజెప్పే దిశగా ఆలోచించాలన్నారు. రక్తహీనత, పోషకాహార లోపం, బడి బయటి పిల్లలు, పాఠశాలల్లో మౌలిక వసతులు వంటి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి పెట్టి పురోగతి సాధించాలని సూచించారు. ఈ సమీక్షలో గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ పాల్గొన్నారు.

ఎంపీగారి బస్సులా..

అయితే ఓకే!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన చెప్పినట్లు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్ర మోటారు వాహనాల చట్టం ఏం చెబుతోందంటే..

విద్యా సంస్థల బస్సుల్లో భద్రతా ప్రమాణాలను నిర్దేశిస్తూ కేంద్ర ప్రభుత్వం 2023లో ప్రత్యేక చట్టం రూపొందించింది. ప్రధానంగా అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు.. పొరపాటున అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టేందుకు స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. ఫైర్ డిటెక్షన్, అలార్మ్ సిస్టం, ఫైర్ సప్రెషన్ సిస్టం, ఫైర్ ప్రొటెక్షన్ సిస్టంలకు సంబంధించిన పరికరాలు, ఉపకరణాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది.


రూల్స్, గీల్స్ ఏమీలేవు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదేళ్లుగా ప్రజాప్రతినిధిగా ఉన్న ఆయన కుటుంబం దశాబ్దాలుగా ఉన్నత విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఆ విద్యా సంస్థ కోసం ఇటీవల కొత్తగా 50 బస్సులను కొనుగోలు చేశారు. అందుకోసం చెన్నై నుంచి వాహనాల ఛాసీస్‌లను కొనుగోలు చేసి బస్సుల బాడీ బిల్డింగ్ పనులు చేయించారు. కానీ కేంద్ర ప్రభుత్వం చేసిన మోటారు వాహనాల చట్టాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. అగ్నిమాపక పరికరాలు, ఉపకరణాలు ఏర్పాటు చేయలేదు. కానీ తమ విద్యా సంస్థల ట్రస్ట్ తరఫున కొనుగోలు చేసిన ఆ బస్సులను రిజిస్ట్రేషన్ చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక పరికరాలు పొందుపరచలేదని కొందరు అధికారులు చెప్పినా సరే ఆ ప్రజాప్రతినిధి పట్టించుకోలేదు. 'మా బస్సులను రిజిస్ట్రేషన్ చేయండి.. మిగిలిన విషయాలు ఎత్తొద్దు.. 40 ఏళ్లుగా ఈ వ్యాపారంలో ఉన్నాం.. మాకు కొత్తగా రూల్స్ చెప్పొద్దు' అని ఆయన గదమాయించారు. దాంతో రవాణా శాఖ అధికారులు గప్‌చుప్‌గా ఆ విద్యా సంస్థ బస్సులకు రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో 17 బస్సులకు రిజిస్ట్రేషన్లు చేసినట్టు సమాచారం. మిగిలిన బస్సులకు కూడా త్వరగా రిజిస్ట్రేషన్లు చేసేయడానికి అధికారులు దస్త్రాలు వేగంగా కదుపుతున్నారని తెలిసింది.

విపక్షంలో పెద్ద పార్టీకే ప్రధాన ప్రతిపక్ష హోదా

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 3 సీట్లే వచ్చినా ప్రధాన విపక్షంగానే గుర్తింపు
- జగన్ లేఖపై స్పీకర్ కంటే ముందే పయ్యావుల స్పందించడంపై రాజ్యాంగ నిపుణుల విస్మయం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమానించిందే జరుగుతోంది! శాసనసభలో ప్రజల గొంతుకను వినిపించనివ్వకుండా, రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలన్న ప్రభుత్వ కుట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యలతో బయటపడింది. పది శాతం సీట్లు వస్తేనే ప్రతిపక్ష నేత హోదా దక్కుతుందని మంత్రి పయ్యావుల బుధవారం వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా దక్కే అవకాశమే లేదని, ఆయన వైఎస్సార్‌సీపీ శాసనసభా పక్ష నేతగా ఉంటారని పేర్కొన్నారు. మంత్రి పయ్యావుల వ్యాఖ్యలను రాజ్యాంగ నిపుణులు తప్పుబడుతున్నారు. పది శాతం సీట్లు ఉంటేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలన్న నిబంధన దేశంలో ఏ చట్టంలోనూ లేదని పేర్కొంటున్నారు. లోక్‌సభకు 1984లో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకోగా సభలో 10 శాతం సీట్లు సాధించనప్పటికీ నాడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించటాన్ని ఉదహరిస్తున్నారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగానూ కాంగ్రెస్ 26 మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు దక్కనప్పటికీ పి.జనార్దనరెడ్డిని నాడు ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ బీజేపీ కేవలం 3 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పించారు.



ప్రతిపక్షనేతకు సంబంధించి 1977 చట్టంలో ప్రస్తావన

కేంద్ర, రాష్ట్ర చట్టాలు ఏం చెబుతున్నాయంటే..

విపక్షంలో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు ఉంటే ఆ పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించి.. ఆ పార్టీకి చెందిన లోక్‌సభ / రాజ్యసభ / శాసనసభ / శాసనమండలి పక్ష నేతను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించాలని శాలరీ అండ్ అలవెన్సెస్ ఆఫ్ లీడర్స్ ఆఫ్ అపోజిషన్ ఇన్ పార్లమెంట్ యాక్ట్–1977లో సెక్షన్–1 స్పష్టంగా చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్, డిస్‌క్వాలిఫికేషన్ యాక్ట్–1953 సెక్షన్–12బీ కూడా అదే అంశాన్ని స్పష్టం చేస్తోంది. రాజ్యాంగంలోని 208వ అధికరణ కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో ఫలానా సంఖ్యలో సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే నిబంధనను ఎక్కడా పొందుపరచలేదు. ఏ పార్టీకైనా పది శాతం సీట్లు వస్తేనే ప్రతిపక్షంగా గుర్తించాలనే నిబంధన దేశంలో ఏ చట్టంలోనూ లేదని లోక్‌సభ సెక్రటరీ జనరల్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించిన పీడీటీ ఆచారి తేల్చి చెబుతున్నారు. రాష్ట్ర శాసనసభలో ఉన్న ఒకే ఒక విపక్షం వైఎస్సార్‌సీపీ మాత్రమే. ఈ నేపథ్యంలోచట్ట ప్రకారం ఆ పార్టీ పక్ష నేత వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా కల్పించాలని రాజ్యాంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

సభాపతి స్పందించక ముందే..

''శాసనసభలో ఈనెల 21న జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణం కార్యక్రమాన్ని చూస్తే ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా నాకు ఇవ్వరనే అభిప్రాయం కలిగింది. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతోంది. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు సాధించి ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు. పార్లమెంటులోగానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదు. అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నా పట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. నన్ను ఉద్దేశించి.. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి నేపథ్యంలో అసెంబ్లీలో మేం గొంతు విప్పే పరిస్థితులు కనిపించడం లేదు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షపార్టీగా గుర్తింపుతోనే ప్రజాసమస్యలను బలంగా వినిపించే అవకాశం ఉంటుంది. తగినంత సమయం లభిస్తుంది. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి' అని కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్ మంగళవారం లేఖ రాయడం తెలిసిందే. ఈ లేఖపై స్పీకర్ ఇంకా స్పందించలేదు. స్పీకర్ పరిధిలోని ఈ అంశంపై శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల తక్షణమే స్పందించడం.. జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా దక్కే అవకాశమే లేదంటూ తేల్చేయడాన్ని రాజ్యాంగ నిపుణులు తప్పుబడుతున్నారు.

క్వారీలపై కూటమి నేతల జులుం

రాష్ట్రవ్యాప్తంగా క్వారీల్లో స్తంభించిన తవ్వకాలు.. తమ లెక్క తేల్చాకే క్వారీయింగ్ చేయాలని ఎమ్మెల్యేల హుకుం

- దీంతో 15 రోజులుగా ప్రభుత్వానికి మైనింగ్ రాయల్టీ బంద్
- తవ్వకాలు లేకపోవడంతో ఇబ్బందుల్లో రవాణా పరిశ్రమ



సాక్షి, అమరావతి: అధికార టీడీపీ కూటమి నేతల దౌర్జన్యపూరిత విధానాలతో రెండు వారాలుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో క్వారీల్లో మైనింగ్ నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయం నిల్చిపోవడంతో పాటు పలు పరిశ్రమలు, రవాణా రంగం ఇబ్బందుల్లో పడ్డాయి. ఇంకోపక్క టీడీపీ నేతలు పలు క్వారీల్లో అక్రమంగా మైనింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మైనింగ్ కార్యకలాపాలను పర్యవేక్షించే డైరెక్టరేట్ కార్యాలయాన్నే 14 రోజులుగా మూసివేశారు. ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని సైతం తెరవకుండా సీజ్ చేశారు. ఏదో జరిగిపోయిందనే అనుమానంతో మైనింగ్ జరుగుతున్న క్వారీలను స్తంభింపజేయడంతోపాటు మైనింగ్ కార్యాలయాలను సైతం మూసివేసి అక్కడి అధికారులు, సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నేతలు చెప్పినట్లు వినాలని అన్ని జిల్లాల మైనింగ్ డీడీలు, ఏడీలకు ఉన్నత స్థాయి నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఇంకో పక్క కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు రకరకాల కారణాలతో క్వారీలపై విరుచుకుపడ్డారు. వారు క్వారీల వద్దకు వెళ్లి తవ్వకాలు నిలిపివేశారు. తాము చెప్పే వరకు క్వారీయింగ్ చేయకూడదని, క్వారీలు పని చేయాలంటే ముందుగా తమ సంగతి తేల్చాలని స్పష్టం చేశారు. దీంతో పక్కాగా అనుమతులు ఉన్న క్వారీల్లోనూ మైనింగ్ నిలిచిపోయింది. గ్రానైట్, రోడ్ మెటల్, క్వార్ట్జ్, సున్నపురాయి వంటి అనేక క్వారీల్లో తవ్వకాలు నిలిచిపోయాయి.

శ్రీకాకుళం జిల్లాలో గ్రానైట్‌పై దెబ్బ

శ్రీకాకుళం జిల్లా కీలక మంత్రి ఆదేశంతో గ్రానైట్ మైనింగ్ ఆగిపోయింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచే అక్కడ పరిస్థితి మారిపోయింది. ఆ జిల్లాలో వందకు పైగా ఉన్న గ్రానైట్ క్వారీలను అప్పటికప్పుడే స్తంభింపజేశారు. మైనింగ్ ఏడీ ద్వారానే తమ లెక్క తేలే వరకూ వాటిలో మైనింగ్ జరగక్కూడదని స్పష్టం చేసినట్లు సమాచారం. గ్రానైట్ తవ్వకాలు నిలిచిపోవడంతో పాలిషింగ్ యూనిట్లకు ముడి సరుకు దొరక్క, అవి కూడా మూతపడుతున్నాయి. ఫలితంగా దాని ద్వారా ప్రభుత్వానికి వచ్చే కోట్ల రూపాయల రాయల్టీ కూడా ఆగిపోయింది. క్వారీలకు అనుబంధంగా పనిచేసే ట్రక్కులు, లారీలు, లాజిస్టిక్ వ్యాపారాలన్నీ ఇబ్బందుల్లో పడ్డాయి. రవాణా వ్యవస్థ దాదాపు స్తంభించింది. వాటిల్లో పనిచేసే వేలాది మందికి కొద్ది రోజులుగా పని లేకుండాపోయింది. విశాఖ పోర్టు నుండి రోజుకు వంద నుండి రెండు వందల లారీల్లో గ్రానైట్ బ్లాక్స్, పాలిషింగ్ పలకలు ఎగుమతయ్యేవి. అవన్నీ ఇప్పుడు నిలిచిపోయాయి. అన్ని జిల్లాల్లోనూ స్థానికంగా ఉన్న క్వారీల యజమానులను టీడీపీ నేతలు బెదిరింపులకు గురి చేస్తున్నారు. స్థానిక నేతలు, ఎమ్మెల్యేల వద్దకు వచ్చి మాట్లాడుకోవాలని చెబుతున్నారు. తమ వాటాల సంగతి తేలిన తర్వాతే క్వారీయింగ్ జరగనిస్తామని చెప్పడంతో భయపడిన క్వారీల యజమానులు పనులు ఆపేశారు. మైనింగ్ అధికారులు కూడా తాము ఏం చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఎక్కడైనా అధికారులు జోక్యం చేసుకుంటే వారిని కూడా బెదిరిస్తున్నారు. అనుమతి ఉన్న క్వారీల్లో తవ్వకాలు నిలిపివేయడం సరికాదని చెబుతున్నా వినడంలేదు.

నిమ్మకూరులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల వచ్చిన మరుసటి రోజు నుంచే ఎక్కడెక్కడ మైనింగ్‌కు అవకాశం ఉందో చూసి వెంటనే తవ్వకాలు మొదలుపెట్టేశారు. కృష్ణా జిల్లా నిమ్మకూరులో వారం రోజులుగా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఇది మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ దత్తత గ్రామం. నిమ్మకూరులో కొందరు రైతుల నుంచి ముగ్గురు టీడీపీ నేతలు 10 ఎకరాలను కొనుగోలు చేసి తవ్వకాలు జరుపుతున్నారు. ఎన్‌వోసీ, మైనింగ్ అనుమతి వంటివి ఏవీ లేకుండానే పగలు, రాత్రి మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు సుమారు 500 లారీల్లో మట్టిని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. 20 టన్నుల లారీలో 30 నుంచి 35 టన్నుల మట్టిని నింపి ఏకంగా జాతీయ రహదారిపైనే తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలపై చర్చ

అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



సాక్షి, అమరావతి: గడచిన ఐదేళ్లల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. బుధవారం మంగళగిరిలోని తన నివాసంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌తో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో జీతాలకు సరిపడా రూ.7 కోట్ల నిధులు మాత్రమే మిగిలాయనీ, 2020–21లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఖాతాలో రూ.2092.65 కోట్ల నిధులు ఉంటే ప్రస్తుతం కేవలం రూ.7 కోట్లు మాత్రమే మిగిల్చారా అంటూ పవన్ కళ్యాణ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే.. కరోనా అనంతరం గత ప్రభుత్వం 2021 నుంచి క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించి... పట్టణాల్లో మాదిరి గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరణ కార్యక్రమాలు అమలు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైబడి గ్రామ పంచాయతీలో దాదాపు 35 వేలకు పైబడి క్లాప్ మిత్రలకు నెలవారీ గౌరవ వేతనాల చెల్లింపుతో పాటు ఇళ్ల నుంచి చెత్త సేకరణ, అనంతరం సేకరించిన చెత్తను ఇతర రూపాల్లోకి మార్చడం కోసం అన్ని గ్రామ పంచాయతీలకు వివిధ రకాల ఆధునిక పనిముట్లు సరఫరా చేసిన విషయం తెలిసిందే. కాగా, ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన గ్రూప్–1 అధికారులు డిప్యూటీ సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు.

క్లుప్తంగా...

కుప్పం ఆర్టీసీ డిపో ఆధునికీకరణ

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

శాంతిపురం: చిత్తూరు జిల్లాలోని కుప్పం ఆర్టీసీ డిపోను, బస్టాండ్‌ను ఆధునికీకరిస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. 5 కొత్త బస్సులను ప్రారంభించిన సందర్భంగా కుప్పంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో వీలైనన్ని విద్యుత్ బస్సులను తీసుకువచ్చి కుప్పం నుంచి అన్ని ప్రాంతాలకు నడుపుతామన్నారు. రాజకీయ సభలకు ఆర్టీసీ బస్సులను ఉచితంగా వాడుకునేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీని వంద శాతం ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీతో సహా ఏ శాఖనూ వదలకుండా నాశనం చేసిందని ఆరోపించారు.

ప్రజాకాంక్ష మేరకు పనిచేస్తాం

మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



సాక్షి, అమరావతి: ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంశాల్లో ప్రజలు ఆశించిన మేరకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని సాంఘిక సంక్షేమ, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ, గ్రామ సచివాలయాల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. మంత్రిగా బుధవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండలో అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024–25 కొత్తగా పలు ఇంటర్ కోర్సులకు అదనపు సీట్లు మంజూరు ఫైలుతో పాటు పైలట్ ప్రాజెక్ట్ కింద బాపట్ల జిల్లా నాగులపాలెం బాలికల గురుకుల విద్యాలయంలో కోల్డ్ స్టోరేజ్ యూనిట్ మంజూరు, విద్యార్థులకు వేడి నీటిని అందించేందుకు సోలార్ వాటర్ హీటర్ సౌకర్యం కల్పిస్తూ 3 ఫైల్స్‌పై మంత్రి సంతకాలు చేశారు. వలంటీర్లను తీసేస్తామని ప్రభుత్వం ఏమి చెప్పలేదని 1న పింఛన్ల పంపిణీ సచివాలయాల ఉద్యోగులతో ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామన్నారు.

9,080 కి.మీ. మేర రహదారులకు మరమ్మతులు


ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 9,080 కి.మీ. మేర రోడ్లకు మరమ్మతు పనులు చేపడతామని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ మంత్రిగా సచివాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించి మీడియాతో మాట్లాడారు. రూ.2,153 కోట్లతో 5,731 రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపడతామని చెప్పారు. రూ.284 కోట్లతో గుంతలు పూడ్చేందుకు రూపొందించిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రాష్ట్రంలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్

మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



సాక్షి, అమరావతి: రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అందుకు తగ్గట్లుగా రెవిన్యూ శాఖలోని మంచి అనుభవం గల అధికారుల నుంచి తగు సూచనలు, సలహాలు తీసుకుంటామని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం రెవెన్యూ, సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు ముందుగానే గుర్తించి వాటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలవుతోన్న డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం తదితర కార్యక్రమాల విధి విధానాల గురించి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి సాయిప్రసాద్, సర్వే, సెటిల్మెంట్ శాఖ కమిషనర్ సిద్దార్థ జైన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు.

పాలనలో నా మార్కు కనిపించాలి

- పేదరిక నిర్మూలన కుప్పం నుండే శ్రీకారం
- ముగిసిన బాబు కుప్పం రెండు రోజుల పర్యటన



సాక్షి, చిత్తూరు: పాలనలో తన మార్కు, మార్పు కనిపించాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు చెప్పారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం కుప్పం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఓ చిన్నారికి నామకరణం చేశారు. మధ్యాహ్నం తర్వాత డిగ్రీ కళాశాలలో చిత్తూరు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన ప్రాధాన్యతలను అధికారులకు వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కుప్పం నుంచే శ్రీకారం చుడతామన్నారు. సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ తన విధానమన్నారు. కుప్పం అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ప్రతి ఇంటికీ నీరివ్వాలని, హంద్రీ నీవా పనుల పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. వ్యవసాయంలో మెరుగైన విధానాలు తేవాలన్నారు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా చేస్తామన్నారు. రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు కనిపించకూడదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన రౌడీషీట్లను ఎత్తివేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నేతల పైశాచికత్వానికి కొందరు అధికారులు సహకరించారని, తన సొంత నియోజకవర్గానికి తాను రాలేని పరిస్థితిని కల్పించారన్నారు. 2019 వరకూ ఒక్క కేసు కూడాలేని తనపై హత్యాయత్నం సహా అనేక అక్రమ కేసులు పెట్టారన్నారు.

90 వేల మెజారిటీ నాకెందుకు రాలేదు?

ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మెజారిటీ 90 వేలు దాటితే కుప్పంలో తనకు మాత్రమే ఎందుకు తగ్గిందని చంద్రబాబు పార్టీ శ్రేణులపై అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆయన బుధవారం పీఈఎస్ మెడికల్ కాలేజీలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. తనకు 47 వేల ఓట్ల పైచిలుకు మాత్రమే మెజారిటీ రావటంపట్ల అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి. ఈ సమావేశం తర్వాత చంద్రబాబు హెలికాప్టర్‌లో బెంగళూరు వెళ్లారు.

పదోవంతు సభ్యులుంటేనే ప్రతిపక్ష హోదా: పయ్యావుల కేశవ్



సాక్షి, అమరావతి: పదో వంతు సభ్యులున్న పార్టీకే ప్రతిపక్ష హోదా లభిస్తుందని రాష్ట్ర ఆర్థిక, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. శాసన సభలో వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశం లేదన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రూల్స్ చదువుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్‌గా మాత్రమే ఆయన కొనసాగుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న బీజేపీ, జనసేన పార్టీలకు ఫ్లోర్ లీడర్లు ఉన్నారని చెప్పారు. జగన్ ప్రజలు ఇచ్చిన తీర్పు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ బుక్స్ చూడాలని, సభలో పదో వంతు సభ్యులున్నవాళ్లకు మాత్రమే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని మొదటి స్పీకర్ మావళంకర్ రాశారని తెలిపారు. కేంద్రంలో ప్రతిపక్ష హోదా పొందడానికి కాంగ్రెస్ పార్టీకి పదేళ్లు పట్టిందన్నారు. జగన్‌కు కూడా ప్రతిపక్ష హోదా పొందడానికి పదేళ్లు పడుతుందన్నారు. 2029లోనూ వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా రాదని చెప్పారు.

జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం

టీడీపీ మాజీ ఎంపీ చిమటా సాంబు

చీరాల: అసెంబ్లీలో వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష నాయకుడిగా హోదా ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట సభలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను టీడీపీ ప్రభుత్వం కాలరాస్తోందని టీడీపీ మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేత చిమటా సాంబు బుధవారం అన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ఎమ్మెల్యేల సంఖ్యా బలంతో సంబంధం లేదని, రాజ్యాంగంలో ఉన్నా జగన్ విషయంలో ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. గవర్నర్ జోక్యం చేసుకుని జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా ప్రభుత్వానికి సూచనలు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీకి 40% ఓట్లు వేసి ప్రతిపక్షనాయకుని కంటే పెద్ద హోదాను ప్రజలే ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో వైఎస్సార్‌సీపీని విలీనం చేస్తారని బీజేపీ ఎమ్మెల్యే నల్లిమిల్లి అసంబద్ధంగా మాట్లాడారన్నారు.

టీచర్ల బదిలీల్లో రాజకీయ జోక్యం వద్దు

మంత్రి నారా లోకేశ్

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): టీచర్ల బదిలీలు పారదర్శకంగా జరగాలని రాష్ట్ర విద్య, మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో మార్పులు, ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన బుధవారం సచివాలయంలో సమీక్షించారు. టీచర్ల బదిలీల్లో రాజకీయ జోక్యం లేకుండా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. బోధనేతర పనులు, అనవసరమైన యాప్‌ల భారాన్ని తగ్గించి, వారు పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూసివేసిన పాఠశాలలపై వచ్చే సమీక్షలో పూర్తి వివరాలివ్వాలని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. దేశంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు ఎక్కడ అమలవుతున్నాయో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రియాతో పాటు పలు దేశాల విద్యా వ్యవస్థలను మంత్రి ప్రస్తావించారు. రాయలసీమలో పాఠశాలల కొరత, కొత్త స్కూళ్ల ప్రారంభించడంపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్



వినతిపత్రం అందజేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయులు

సమగ్ర శిక్ష విభాగంలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్‌గా పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేయాలని ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయుల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శివకుమారి కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సకాలంలో వేతనాలు అందించాలని కోరామనీ, తమ వినతిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో కృష్ణాజిల్లా అధ్యక్షురాలు విజయశ్రీ పాల్గొన్నారు.


సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్

కొరిటిపాడు(గుంటూరు): సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధిలో భాగంగా పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)లు ఆర్థికంగా బలోపేతమవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నాయని ఎన్‌సీసీటి కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎల్.ఎన్.టీ.శ్రీనివాస్ తెలిపారు. కామన్ సర్వీసెస్ సెంటర్(సీఎస్‌సీ) పోర్టల్ ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. గుంటూరు చంద్రమౌళినగర్‌లోని జీవీఆర్ అండ్ ఎస్ కళాశాలలో పీఏసీఎస్ సభ్యులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి వీరాచారి, జీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీ

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ మార్చ్‌లో హోంమంత్రి అనిత



విశాఖలో ప్రతిజ్ఞ చేయిస్తున్న హోం మంత్రి అనిత

బీచ్ రోడ్డు(విశాఖ తూర్పు)/భవానీపురం(విజయవాడ పశ్చిమ): మాదక ద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు పోలీసులు మార్చ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనిత తొలుత మార్చ్‌లో పాల్గొన్న వెయ్యి మందితో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విశాఖను డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు యువత సహకారం అవసరమని చెప్పారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర డ్రగ్స్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

మాదకద్రవ్యాల వినియోగంతో యువశక్తి నిర్వీర్యం

దేశాభివృద్ధిలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తుందని, అయితే మాదకద్రవ్యాల వినియోగం వలన ఆ యువశక్తిలో కొంత నిర్వీర్యం కావడం బాధాకరమని రాష్ట్ర డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వాడకం విద్యార్థులకు ఒక ఫ్యాషన్‌గా మారుతుందని, అది వారి జీవితాన్ని కబళించి వేస్తుందని గ్రహించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ విక్రయాలు, వాడకాన్ని నిర్మూలించేందుకు వంద రోజుల ప్రణాళిక రెడీ అవుతుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో డ్రగ్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. అడిషనల్ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ప్రసంగించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పచ్చదనం పరిఢవిల్లేలా..

చెట్లు మానవాళికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఒక్క ప్రాణవాయువే కాదు.. అనేక లాభాలు చెట్ల ద్వారా మానవులకు ఒనగూరుతాయి. జీవ వైవిధ్య పరిరక్షణలో చెట్ల పాత్ర అత్యంత కీలకం. అయితే, తగినంత విస్తీర్ణంలో చెట్లు ఉంటేనే ఇదంతా సాధ్యపడుతుంది. ఏ ప్రాంతంలోనైనా సాధారణంగా 33 శాతం పచ్చదనం ఉండాలి. కానీ, జిల్లా విస్తీర్ణంలో ఆ మేర పచ్చదనం లేదు. దీన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని నిర్ణయించింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో టెక్నాలజీని ఇందులో భాగం చేస్తోంది. ప్రజలూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తోంది.

హరిత 'అనంత' సాధన దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు

- జిల్లావ్యాప్తంగా లక్ష మొక్కలు నాటేలా ప్రణాళిక
- అటవీశాఖ నర్సరీలో 10 లక్షల మొక్కలు సిద్ధం
- రాయదుర్గం నర్సరీలో 50 వేల మొక్కలు అందుబాటులో..



అటవీ శాఖ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

అనంతపురం అర్బన్: జిల్లాను హరిత 'అనంత'గా మార్చే కార్యక్రమానికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శ్రీకారం చుట్టారు. అధికార యంత్రాంగానికి ఇప్పటికే దీనిపై ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 7.5 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేలా లక్ష్యం విధించారు. జిల్లావ్యాప్తంగా ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే అటవీశాఖ నర్సరీలో 10 లక్షలు, రాయదుర్గం సమీపంలోని నర్సరీలో 50 వేల మొక్కలు సిద్ధం చేశారు.

మొక్కలు ఎక్కడెక్కడ నాటుతారంటే..

గ్రామాలు, పట్టణాల్లో అవెన్యూ (రోడ్లకు ఇరువైపులా) ప్లాంటేషన్ 100 కిలోమీటర్ల మేర చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ భూములు, వృథాగా ఉండే స్థలాలు, దేవదాయ భూములు, గుట్టలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణాల్లో మొక్కలు నాటుతారు. అదే విధంగా ప్రజలు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నారు.

చెట్టుతో అనుబంధం పెంచేలా...

చెట్టుతో మనిషికి అనుబంధం పెంచేలా కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటాక దాన్ని సంరక్షించే బాధ్యత కూడా తీసుకునేలా చేస్తారు. ముందుగా మొక్క నాటిన వ్యక్తులతో సంరక్షిస్తామని ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఒక మొబైల్ యాప్ రూపొందిస్తున్నారు. మొక్క నాటినప్పుడు సెల్ఫీ తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయడం, సంరక్షణలో భాగంగా మొక్కకు రోజూ నీరు పోస్తున్నప్పుడు సెల్ఫీ తీసుకుని అందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమం విజయవంతం చేయనున్నారు.



ఎస్ఎస్‌పి కార్యాలయంలో మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి (ఫైల్)

మొత్తం 42 జాతుల మొక్కలు..

నేరేడు, జామ, సపోటా, బాదాం, సీతాఫలం, మామిడి, చింత, వేప, కానుగ, అశోక, నిమ్మ, టేకు, కరివేపాకు, ఉసిరి, నీలగిరి, ఎర్ర చందనం, రావి, మునగ, మారేడు, మేడి, రోజ్‌వుడ్ తదితర 42 జాతుల మొక్కలు నాటాలని నిర్ణయించారు. సామాజిక అటవీశాఖ పరిధిలోని నర్సరీలో 42 జాతులకు సంబంధించి 10,08,771 మొక్కలు, రాయదుర్గం నర్సరీ (ఎస్‌ఆర్‌ఈజీపి)లో 50 వేల మొక్కలు సిద్ధంగా ఉంచారు.

యజ్ఞంలా మొక్కల పెంపకం



జిల్లాలో పచ్చదనం పెంపొందించి హరిత అనంతగా మార్చే లక్ష్యంగా మొక్కల పెంపకాన్ని యజ్ఞంలా చేపట్టనున్నాం. ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలు నాటుతాం. నాతో మొదలు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దత్తత తీసుకుని సంరక్షించాలి. అధికార యంత్రాంగం చేపడుతున్న ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

సానుకూల శక్తితో కూడిన రిజర్వాయర్‌నే ఆత్మ అనొచ్చు. అది ఇసుమంత ఉండి కంటికి కనబడదు. ఆత్మ ఆధ్యాత్మిక శక్తితో మిణుకుమంటుంది. ఆత్మ సహజంగానే ప్రేమతో కూడినది. శాంతియుతమైనది. అదే జ్ఞాపకాలను ఉంచుకుంటుంది. అది అద్వితీయం.

– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 27 జూన్ 2024

ఎన్నాళ్లీ తీస్తా వివాదం!

నదీజలాల విషయంలో ఆచితూచి అడుగేయకపోతే ఆ నీళ్లల్లోనే నిప్పులు పుట్టుకొస్తాయి. అంతర్గతంగా ప్రాంతాల మధ్యనే తరచు చిచ్చు రేపే నదీజలాలు... పొరుగునున్న దేశంతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు సమస్యగా మారటంలో వింతేమీ లేదు. ఈమధ్యే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా మన దేశాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో రెండు దేశాలమధ్యా పలు ద్వైపాక్షిక ఒప్పందాలు కుదరటంతోపాటు తీస్తా నదీజలాల పంపకంపై చర్చలు జరపాలనీ, ఫరక్కా జలాలపై తాజా ఒప్పందం కుదుర్చుకోవాలనీ ఇరు దేశాధినేతలూ నిర్ణయించారు. సరిగ్గా ఇదే ఇప్పుడు వివాదాన్ని రగిల్చింది. నదీజలాల విషయంలో ఉభయులకూ అంగీకారయోగ్యమైన పరిష్కారం కోసం కృషిచేయాలని భారత్, బంగ్లాదేశ్‌లు నిర్ణయించుకున్నాయని మంగళవారం ఢాకాలో హసీనా ప్రకటించిన వెంటనే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చురుగ్గా స్పందించారు. ఈ అంశంలో తమను ఎందుకు సంప్రదించలేదంటూ కేంద్రంపై భగ్గుమన్నారు. ఇది సరికాదని అభ్యంతరం చెబుతూ ఆమె మోదీకి లేఖ రాశారు. మమత ఇలా స్పందించటం ఇది మొదటిసారేమీ కాదు. ప్రజానీకానికి గుక్కెడు నీళ్లందించాలన్నా, పచ్చటి పైర్లతో పొలాలు కళకళలాడాలన్నా బంగ్లాదేశ్‌కు ఈ నదీజలాలపై భారత్‌తో ఒప్పందం కుదరటం, ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావటం ఎంతో అవసరం. 2011లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు తీస్తాపై ఒప్పందం దాదాపు ఖరారైంది. కానీ ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తృణమూల్ అధినేత మమత అలకబూనటంతో అది ఆఖరు నిమిషంలో ఆగిపోయింది. రాజకీయంగా యూపీఏకు ఉన్న పరిమితులేమిటో, మమత స్వభావమేమిటో తెలిసిన హసీనా దానిపై పట్టుబట్టకుండా ఉండిపోయారు. ఈ నేపథ్యం తెలిసినందువల్లే ప్రధాని నరేంద్ర మోదీ 2015లో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లినప్పుడు తన ప్రతినిధి బృందంలో ఆమెను కూడా చేర్చారు. ఒప్పందం కుదరకపోవటం వల్ల తమ దేశానికి ఎదురవుతున్న సమస్యలను హసీనా ఆమెకు వివరించగా, రాష్ట్రంలో తనకెదురయ్యే ప్రతిబంధకాలను మమత తెలిపారని కథనాలు వచ్చాయి. ఆ తర్వాత కాలంలో తీస్తా ప్రాజెక్టు గురించి బంగ్లాదేశ్ ప్రస్తావించకపోలేదు. కానీ బెంగాల్ అభ్యంతరాలు ఎప్పటిలాగే ఉండటం ఈ సమస్యకు శాపంగా మారింది.

నిజానికి చారిత్రకంగా, సాంస్కృతికంగా పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ ఎంతో సన్నిహితమైనవి. దేశంలో జాతీయవాదం అంతకంతకు విస్తరించటానికి ఈ ప్రాంతమే కారణమని భావించిన బ్రిటిష్ వలసపాలకులు 1905లో బెంగాల్ విభజన చట్టం తీసుకొచ్చినప్పుడు నిరసనలు పెల్లుబికాయి. చివరకు 1911లో దాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. అయితే ఆ ప్రయత్నం హిందూ ముస్లింల మధ్య పొరపొచ్చాలను పెంచింది. స్వాతంత్ర్యానంతరం దేశ విభజన జరిగినప్పుడు అది పాకిస్తాన్‌లో భాగంగా మారింది. పాకిస్తాన్ చెరలో తమ అస్తిత్వాన్ని కోల్పోతున్న తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించటానికి 1971లో మన దేశం అందించిన తోడ్పాటును బంగ్లా ప్రజలు ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటారు. కానీ బంగ్లాదేశ్ తన సమస్యలను వాయిదా వేస్తూ పోలేదు. తమ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా బంగ్లా చిరకాల ఆకాంక్ష నెరవేర్చటం ఎలాగో మమతా బెనర్జీ ఆలోచించాలి. అవసరమైతే ఒక మెట్టు దిగేందుకు కూడా సిద్ధపడాలి. గంగానదిపై బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బరాజ్ నుంచి బంగ్లాకు నదీజలాలు అందించటంపై 1996లో 30 ఏళ్లకు ఒప్పందం కుదిరింది.అది మరో రెండేళ్లలో పూర్తికావాల్సి వుంది. కనుక దానిపై కొత్తగా ఒప్పందం అవసరం. 1996లో తమకిచ్చిన హామీలను నెరవేర్చని కేంద్రం ఇప్పుడు మరోసారి తీస్తా, గంగా జలాలపై బంగ్లాతో చర్చించిందని మమత ఆరోపణ. అయితే అప్పుడూ ఇప్పుడూ కూడా బెంగాల్‌తో చర్చిస్తూనే ఉన్నామన్నది కేంద్రం జవాబు. 1996లో ఆ రాష్ట్ర ప్రతినిధిగా ఉన్న నీటిపారుదల శాఖ ప్రతినిధితో మాట్లాడారనీ, నిరుడు జూలై 24న కూడా ఫరక్కా జలాల అంశంపై ఏర్పడిన కమిటీలో బెంగాల్ నీటిపారుదల రంగం నిపుణుడు పాల్గొన్నారనీ కేంద్రం చెబుతోంది. మొన్న 14న ఆ కమిటీ నివేదిక కూడా సమర్పించిందని వివరించింది. అయితే ఇదంతా కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చేసిందే తప్ప విధానపరమైన చర్చలు కాదని మమత సర్కారు జవాబు. తమ అధికారులు కేవలం కేంద్రం అడిగిన సాంకేతిక వివరాలు మాత్రమే అందించారని తెలిపింది.

దక్షిణాసియాపైనా, మరీ ముఖ్యంగా ఈ ప్రాంత దేశాలతో భారత్‌కున్న సంబంధాలపైనా చైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇలాంటి సమయంలో పట్టుదలకు పోయి నదీజలాలపై వివాదం రాజేయటం మంచిది కాదు. తీస్తా ప్రాజెక్టుపై అటు చైనా, ఇటు భారత్ ప్రతిపాదనలిచ్చాయనీ, ఎవరి ప్రతిపాదన బాగుందో చూసి నిర్ణయిస్తామనీ మంగళవారం హసీనా తెలిపారు. ఇది ఒక రకంగా భారత్ ముందుకు రాకపోతే చైనావైపు చూస్తామని చెప్పటమే. ఎగుమతుల ద్వారా బంగ్లా సమకూర్చుకుంటున్న ఆదాయంలో 80 శాతం వాటావున్న దుస్తుల తయారీ ముడిసరుకంతా చైనాయే సరఫరా చేస్తోంది. పైగా బంగ్లా వాణిజ్యంలో చైనా అతి పెద్ద భాగస్వామి. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బెంగాల్ వ్యవహరించాలి. విదేశాంగ విధాన నిర్ణయాలపై రాష్ట్రాల ప్రమేయం ఉండటం మంచిదికాదు. అదే సమయంలో బెంగాల్ ప్రయోజనాలు కాపాడటం కేంద్రం బాధ్యత. గత హామీలు నెరవేర్చలేకపోతే కారణాలేమిటో తెలుసుకుని వాటిని సరిదిద్దాలి. చిరకాల సమస్య అయిన తీస్తా వివాదంపై బెంగాల్‌ను ఒప్పించి బంగ్లా ఆకాంక్ష నెరవేర్చటం ఎలాగో కేంద్రం ఆలోచించాలి.

వాస్తవ చరిత్రతోనే మెరుగైన భవిత

దేశంలో కోట్లాది మంది విద్యార్థులు అభ్యసించే ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో మతవాద భావజాలాన్ని చొప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మతవాద భావాలు లౌకికవాద భావజాలానికి విఘాతం కలిగిస్తాయని అంబేడ్కర్ ఏనాడో అన్నారు. లౌకికవాద రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించే విధానం చరిత్రకు నష్టం కలిగిస్తుంది. విద్యార్థి సమూహానికి దేశంలోని భౌగోళిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, చరిత్ర... వాస్తవంగా, ఉన్నది ఉన్నట్టుగా అర్థం కావలసి ఉంది. మతవాదాన్నే జాతీయ వాదంగా ప్రచారం చేసే ప్రయత్నాలు మంచివి కావు. భారతదేశంలో చదువుకుంటున్న విద్యార్థులు దేశ చరిత్రను శాస్త్రీయ భావాలతో, సరైన పద్ధతుల్లో అర్థం చేసుకోకపోతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలరా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ప్రస్తుతం భారతదేశ వ్యాప్తంగా ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను అభ్యసిస్తున్న విద్యార్థులు సుమారు నాలుగు కోట్ల మంది ఉన్నారు. మొదట సిలబస్ రూపకల్పనలో భారత దేశ రాజ్యాంగ స్ఫూర్తి కలిగిన, జాతీయ భావాలు కలిగిన, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో పరిశోధకులు అయిన మేధావులు ఉన్నారు. అయితే వాజ్‌పేయి కాలం నుంచి ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను మార్చి మతవాద పూరితమైన భావజాలాన్ని చూపించాలనే ప్రయత్నాన్ని బీజేపీ ప్రభుత్వాలు చేస్తూ వస్తున్నాయి. భారతదేశంలో చదువుకుంటున్న విద్యార్థులు దేశ చరిత్రను శాస్త్రీయ భావాలతో, సరైన పద్ధతుల్లో అర్థం చేసుకోకపోతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలరా?

విద్యార్థి సమూహానికి దేశంలోని భౌగోళిక పరిస్థితులు, సామాజిక, లౌకికవాదాల పరిస్థితులు, చరిత్ర... వాస్తవంగా, ఉన్నది ఉన్నట్టుగా అర్థం కావలసి ఉంది. అయితే బీజేపీ ప్రభుత్వం మతవాదాన్నే జాతీయవాదంగా ప్రచారం చేసే ప్రయత్నాలు చేస్తోంది. పాఠ్య గ్రంథాలు రూపొందించినవారి అనుమతి లేకుండా తమకు అనుకూలంగా పాఠ్య గ్రంథాలను మార్చేశారు. అందుకే తమ అనుమతి లేకుండా పాఠ్య గ్రంథాలను మార్చేసి, సలహాదారుల్లో తమ పేరు ఉంచి ప్రచురిస్తే కోర్టులో కేసులు దాఖలు చేస్తామని ప్రొఫెసర్లు యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్శీకర్ హెచ్చరించే దాకా పరిస్థితి వచ్చింది. ఈ మేరకు వారు ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీకి లేఖ రాశారు. చరిత్రలో వాస్తవ ఘట్టాలను తొలగించి, కల్పిత కథలను చేర్చి, వాస్తవ ఆధునిక రాజకీయ చరిత్రను విద్యార్థులకు అందకుండా చేసే నైతిక హక్కు మీకు లేదని వారు వాదించారు. ముఖ్యంగా భారతదేశ ఆధునిక చరిత్రలో అద్వానీ చేసిన రథయాత్రను, హిందూ మత వాదాన్ని రాజకీయాల్లో చొప్పించి భారతదేశంలో హిందువులు, హిందూయేతరులు అనే భావజాలాన్ని తీసుకొచ్చారు.

అద్వానీ రథ యాత్ర దేశ రాజకీయాల్లో హిందూ భావజాలాన్ని పెంపొందించింది. అంతకు మునుపే హిందూ, ముస్లిం రాజకీయ విభేదాలను పెంచే మతవాద చరిత్రలు కొందరి చేత రాయబడి ఈ వైషమ్యాలను బాగా పెంచాయి. స్వాతంత్రోద్యమానికి ముందు నుంచి కూడా ఈ వైషమ్యాలను పెంచే భావజాల చరిత్ర రాయబడుతూ వచ్చింది. 19వ శతాబ్దంలో భారతీయ రాజకీయాల్లో మతవాదం చోటు చేసుకొనే సరికి మతాన్ని అన్వయించి రాయడం మొదలయింది. మధ్యయుగ భారత చరిత్రను మతవాదులు సుదీర్ఘమయిన హిందూ, ముస్లిం సంఘర్షణగా చూస్తూ, అనివార్యంగా అదే దృష్టిని 19, 20 శతాబ్దాలకు అన్వయిస్తూ, జాతి వివక్ష సిద్ధాంతానికి, రాజకీయాలకు ఈ ఆధునిక యుగంలో 'న్యాయం' చేయగలిగామనుకొంటున్నారు. మత వివక్షతా చరిత్రకారులు మధ్యయుగాల్లోని ముస్లిం పాలకుల పాలనను విదేశీయుల పాలనగా చిత్రీకరిస్తూ, భారత సమాజానికి ముస్లింలు శాశ్వతంగా విదేశీయులని చెప్పగలుగుతున్నారు. ఈ దారుణమైన భావం హిందూ, ముస్లింల వైషమ్యాలను పెంచడానికి మరింతగా తోడ్పడింది. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడమనే ప్రక్రియ భారతదేశ చీలికకు దారితీసింది.



ఈ విషయంగా మొదటి నుండి బి.ఆర్.అంబేడ్కర్ ఆందోళన చెందారు. భారతదేశంలో మతవాద భావాలు లౌకికవాద భావజాలానికి విఘాతం కలిగిస్తాయనీ, రాజ్యాంగంలో పేర్కొన్న సౌభ్రాతృత్వం, సామాజిక సమతుల్యత భావాలు దెబ్బతింటాయనీ అన్నారు. ఇప్పుడు చరిత్రలో వీరు తొలగించిన పాఠ్యాంశాల్లో ఎంతో రాజకీయ చరిత్ర దాగి వుంది. 'బాబ్రీ మసీదు' కూల్చివేత చిన్న విషయం కాదు. ఆ కూల్చివేత వెనుక 'హిందూ రాజ్య' నిర్మాణ భావన ఉంది. లౌకికవాద భావజాలానికి ఆ చర్య గొడ్డలి పెట్టు. బాబ్రీ మసీదు కూల్చివేత ముస్లింలకు అభద్రత తీసుకొచ్చింది. నిజానికి చరిత్ర అనేది వాస్తవ ఘటనల సముచ్ఛయంగా ఉండాలి. కొత్తగా సిద్ధం చేసిన పాఠ్యపుస్తకాలలో బాబ్రీ మసీదు విధ్వంసానికి ముందు జరిగిన అద్వానీ రథ యాత్ర, ఆ తరువాత జరిగిన పరిణామాలను తొలగించేశారు. వివాదాస్పద స్థలంలో రామ మందిరం నిర్మించడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గురించి మాత్రం విస్తారంగా ప్రస్తావించారు. అయోధ్య గురించి మునుపటి పుస్తకాలలో నాలుగు పేజీలు ఉంటే ఇప్పుడు రెండు పేజీలకు కుదించారు. వాస్తవ ఘటనలను తొలగిస్తే, 'బాబ్రీ మసీదు' కూల్చివేతను గురించిన మూలాలు, 'రామ మందిరం' నిర్మాణం దృక్పథం తెలియకుండా పోతాయి.

పాఠ్యపుస్తకాలను కాషాయీకరించాలన్న ప్రస్తుత పాలకుల ధోరణికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేయడాన్ని లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు, సామ్యవాదులు, చరిత్ర రచనా ప్రవీణులు నిరసిస్తున్నారు. దేశంలో అంబేడ్కర్ కృషి వలన లౌకికభావ స్ఫూర్తి బలంగా ఉంది. దేశ చరిత్ర ఎప్పుడూ కూడా మతవాదంతో సాగదు. అది ఉత్పత్తి శక్తుల వల్లే ముందుకు సాగుతుంది. ఈనాటి పాఠ్య ప్రణాళిక భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే ముందుకు నడవవలసి ఉంది. భారత దేశ సంస్కృతిలో, ప్రజల్లో మొదటి నుండి కూడా పోరాట పటిమ ఉంది. ఇంగ్లీషువాళ్ళు అనేక రూపాల్లో మన సంపదను దోచుకుని, సుఖాలు పొందుతున్న విషయాలను ప్రజలు అర్థం చేసుకున్నారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు, పేద ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో పన్నుల చేత వేధించబడ్డారు. అందుకే భారతదేశంలో అన్ని వర్గాల ప్రజల్లో పోరాట పటిమ పెరిగింది. 'రూపాయి సమస్య' అనే గ్రంథంలో బ్రిటిష్ వాళ్ళ ఆర్థిక దోపిడీని గురించి అంబేడ్కర్ స్పష్టంగా నివేదించారు.

ఇకపోతే రాబోయే చరిత్రలో మోదీ పాలనలోని ఎన్నో దాడులు, అణచివేతలు చరిత్రకు సాక్ష్యాలు. ఒకసారి మనం అవలోకిస్తే ఎన్నో దారుణమైన ఘట్టాలు మనముందు వచ్చి నిలబడతాయి. ప్రజల జీవనోపాధిపై దాడి, నోట్ల రద్దు వల్ల ఏర్పడిన సంక్షోభం, గో రక్షణ పేరుతో జరిగిన దాడులు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో పాటు వాటి విక్రయాలు... ఇలా ఎన్నో. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సుదీర్ఘ కాలంగా ఉనికిలో ఉండటమేగాక, ఆయా సంఘాలు దశాబ్దాలుగా నయా ఉదారవాద విధానాలను ఎదుర్కోవడంలో ప్రధానపాత్ర పోషించాయి. వారి అనుభవం కూడా రైతు ఉద్యమానికి లాభించింది. 2018 మార్చిలో నాసిక్ నుండి ముంబై వరకు సుదీర్ఘంగా సాగిన కిసాన్ లాంగ్ మార్చ్ రైతుల డిమాండ్లను నొక్కిచెప్పింది. ఈ లాంగ్ మార్చ్ బీజేపీని ఓడించటం సాధ్యమేనని... బీజేపీ అజేయశక్తి అనే అభిప్రాయం కేవలం కార్పొరేట్ మీడియా ప్రచార సృష్టి మాత్రమేనని స్పష్టమైన సందేశాన్ని పంపింది. 2019 సంవత్సరంలో జరిగిన పుల్వామా ఘటన, ప్రతిగా జరిగిన బాలాకోట్ వైమానిక దాడి, ఆ తరువాత తీవ్ర జాతీయవాద ప్రచార నేపథ్యంలో బీజేపీ విజయం సాధించినప్పటికీ... 2024 కల్లా 240 సీట్లకు ఎందుకు పడిపోయిందో ప్రజలకు, విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉంది.

దేశంలో లౌకికవాదం, రాజ్యాంగ స్ఫూర్తి పెరుగుతున్నాయి. ఈ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించే విధానం చరిత్రకు నష్టం కలిగిస్తుంది. రాబోయే తరాలు లౌకికవాదానికీ, మతవాదానికీ జరిగిన సమరాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు భారతీయులే అనేది ముందు గుర్తించాలి. భారతీయులందరికీ వాస్తవమైన చరిత్రను అందించినప్పుడే భారతదేశ పరిణామం త్వరితం అవుతుంది. డీడీ కోశాంబీ, రొమిల్లా థాపర్, బిపిన్ చంద్ర, అంబేడ్కర్ రచనలు భారతదేశ చరిత్ర నిర్మాణానికి దిశా నిర్దేశం చేస్తున్నాయి. ఆ వైపు నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

భిన్నమైన సభ



లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా తిరిగి ఎన్నికయ్యారు. కానీ 17వ లోక్‌సభ కంటే 18వ లోక్‌సభ భిన్నమైనదని ఆయన గుర్తించాలి. 2024లో ప్రజలు బలమైన ప్రతిపక్షానికి ఓటు వేశారు. జనాల తీర్పును తప్పని సరిగా దృష్టిలో ఉంచుకోవాలి.

– సాగరికా ఘోష్, రాజ్యసభ ఎంపీ (తృణమూల్)

ఇప్పుడెందుకు?



ఎందుకు వాళ్లు ఉన్నట్టుండి జిగ్గరగా 49 ఏళ్ల నాటి ఎమర్జెన్సీ అంశాన్ని 'ఇప్పుడు' లేవనెత్తుతున్నారు? అదీ మధ్య కాలంలో ఉన్న అన్ని సంక్షోభాలను వదిలేసి? ఏంటి గేమ్‌ప్లాన్?

– సిమి గరేవాల్, నటి, టీవీ హోస్ట్

మద్దతు లేదా?



లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అంశంలో కాంగ్రెస్ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోయివుండొచ్చా? ఆ కారణం వల్లే రాహుల్ గాంధీ నంబర్ గేమ్ ఆడలేదా?

– తుషార్ గుప్తా, జర్నలిస్ట్

భూమికి నష్టం



మంచి వ్యవసాయ భూముల్లో భారీ సంఖ్యలో ఏర్పాటుచేసే సోలార్ ప్యానెల్స్ (సౌర పలకలు) చివరకు చెడ్డ వాతావరణం వల్ల పాడవడమో, విషపూరిత రసాయనాలను నేలలోకి వదలడమో, 25 ఏళ్ల తర్వాత భూమిలో గుట్టలుగా పోగుపడటమో జరుగుతుంది. ఇది పర్యావరణ వాదానికి వ్యతిరేకం. కార్పొరేట్లు భూమిని లాక్కోవడం వల్ల జరిగే నేల విధ్వంసం.

– జేమ్స్ మెల్‌విల్, వ్యాఖ్యాత

ఇక్కడొద్దా?



పాకిస్తానీల్లారా! మీరు ఎప్పుడూ యూరప్, యూఎస్‌ఏ, ఇండియా లాంటి చోట్ల లౌకికవాదాన్ని ప్రేమిస్తారు? కానీ ఎప్పుడూ ఎందుకు పాకిస్తాన్‌లో దాన్ని అసహ్యించుకుంటారు? దయచేసి దీన్ని అర్థం చేసుకోవడంలో సాయపడండి.

– మునీబ్ ఖాదిర్, పాక్ న్యాయవాది

ఇన్ బాక్స్

లోకం పచ్చగా ఉండాలంటే...

సమాజం ఎంత ఆధునికంగా మారితే ప్రకృతి అంత తీవ్రంగా ధ్వంసం మవుతున్నదనేది చరిత్ర చెబుతున్న పాఠం. అడవులను విచక్షణారహితంగా నరకడం, తిరిగి చెట్లను నాటాలనే బాధ్యతను విస్మరించడం, అవసరానికి మించి ప్లాస్టిక్‌ను వాడటం, కర్బన ఉద్గారాలను తగ్గించలేకపోవటం వంటి వివిధ కారణాల వల్ల పర్యావరణం కలుషితమయ్యి నేడు సమస్త మానవాళిపై కన్నెర్ర చేస్తోంది. దీంతో మానవ మనుగడే ప్రశ్నార్థకమయ్యింది.

నేడు త్రాగడానికి మంచినీరు, శ్వాసించడానికి ఆక్సిజన్ దొరకని ఆందోళనకర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుంది మనం గర్వంగా చెప్పుకునే 5జీ ప్రపంచం. మనమంతా ఈ అవనిపై అతిథులం అనే సత్యాన్ని చాలా మంది గ్రహించలేపోతున్నారు. భవిష్యత్ తరాలకు బతుకునీయాలంటే, బతుకు ఉండాలంటే ప్రపంచ దేశాలు సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రకృతితో స్నేహం చేయాలి. పచ్చదనాన్ని పరిమళించేలా చేయాలి. మనం నాటే చెట్ల ఎదుగుదలే మానవ నాగరికత ప్రగతిగా భావించాలి. చెట్లను నాటినట్లు నటించడం మానేయాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని బాగా తగ్గించాలి. జల వనరులను సంరక్షించాలి. అడవులను కాపాడుకోవాలి. సౌర విద్యుత్ వినియోగం పెంచాలి. వాయు కాలుష్యం తగ్గించాలి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలి. ఓజోన్ పొరను కాపాడాలి.

సాంకేతికంగా ఎదుగుతూనే పర్యావరణ పరిరక్షణపై ప్రపంచదేశాలు కలిసి పనిచేయాలి. భావి పౌరులైన విద్యార్థులకు మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి. ప్రకృతి ప్రాణంతో ఉంటేనే మనమంతా జీవంతో ఉంటాము. లేదంటే ప్రకృతి ప్రదర్శించే విధ్వంసాన్ని ఆపడం అసాధ్యం. 'ప్రకృతి మన అవసరాలను మాత్రమే తీరుస్తుంది, మన అంతులేని కోరికలను కాద'ని ఏనాడో గాంధీజీ అన్నారు. కాబట్టి మనిషి ప్రకృతిని దురాశతో కొల్లగొట్టి ధ్వంసం చేయకుండా అవసరం మేరకే దానిపై ఆధారపడాలి. అప్పుడు లోకం పచ్చగా ఉంటుంది.

– ఫిజిక్స్ అరుణ్ కుమార్, నాగర్ కర్నూల్

మధ్యేమార్గ సంస్కరణలతోనే సుపరిపాలన

విశ్లేషణ



జాన్ సన్ చోరగుడి

వరి పంటలో పొడుగు రకం అక్కుళ్ళు స్థానంలోకి పొట్టి రకం–స్వర్ణ 'హైబ్రీడ్' వచ్చినప్పుడు పాత–కొత్తల మధ్య అప్పట్లో జరిగిన ఆ మార్పు ఏమంత సాఫీగా అవలేదు. ఆ బియ్యంతో వాతం కలిగి కీళ్ళ నొప్పులు వస్తాయనీ, ఆ గడ్డి తిన్న పశువులు పాలు ఇవ్వవు అనీ అపోహలు ఊళ్ళల్లో ఉండేవి. ఇప్పుడు అదంతా చరిత్ర. అదే 'పొట్టి' వరి రకాలపై వందలకొద్దీ పరిశోధనలు జరిగిన తర్వాత, వస్తున్న పలు రకాల 'రిఫైండ్' బియ్యం అన్నం ఇప్పుడు మనం తింటున్నాం. ఒక అన్నం అనే కాదు, అది ఏ రంగమైనా కొత్తదనాన్ని అంత తేలిగ్గా అంగీకరించడానికి మనం సిద్ధంగా ఉండం. పైకి అది నిజమని ఒప్పుకోవడానికి మనం పెద్దగా ఇష్టపడం. కానీ, జీవితం ఏవో కొన్ని చట్రాల మధ్య స్తబ్దుగా అలా సాగిపోవడంలో కూడా వొక నులివెచ్చని సౌఖ్యం ఉంటుంది. దాన్ని తప్పు పడుతూనే ప్రతి కాలంలోనూ కవులు, రచయితలు సమాజాన్ని జాగృతం చేసేది.

అది ఏ చట్రం అయినా కానీ, ఈ నులివెచ్చని సౌఖ్యం మనకు ఎలా ఉండాలి అంటే– కష్టం వస్తే చెప్పుకోవడానికి సమీపాన ఒక పెద్దమనిషి ఉండాలి. అతడు మనకంటే కొంచెం ఎత్తులో కూర్చుని అవసరమైతే మనల్ని గదమాయిస్తూ సలహా వంటిది చెప్పే వాడై ఉండాలి. అతడు చెప్పాలి మనం వినాలి. వెళ్ళిన పని అయ్యా కానట్టుగా పాక్షికంగా జరగాలి. ఎందుకంటే, మన కష్టానికి కారణమైన వారికీ ఇదే పెద్దమనిషి పూచీ. ఇదీ ఇన్నాళ్ళూ మనకు తెలిసిన లెక్క. మరి ఇప్పుడు అదేమీ కాదని ఆ స్థానంలోకి ఒక 'వలంటీర్' వచ్చాక, ఆ వెనుక ఒక సచివాలయం అనే ఆఫీసు... అక్కడిచ్చిన ఫిర్యాదు పైకి వెళ్లి కిందికి పరిష్కారం రావడం అంటే, మరీ కాళ్ళకు చక్రాలు కట్టుకున్నట్టు ఏమిటి ఇదంతా?! అదే పని అయినా... మరీ ఇంత వేగిరం ('ఎస్ ఆర్ నో') తెమిలిపోతే ఎలా? ఆ తర్వాత ఏమిటి చేయడం? 2019–24 మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అదే పెద్ద సమస్య అయింది. ఒకే ఒక్క 'బటన్ నొక్కడం' అనేది పైన చెప్పిన వైనం మొత్తానికి చోటు లేకుండా చేసింది. ఇంకా చెప్పాలంటే, సామాన్యుల జీవనంలో ఎంతో విస్తరించుకుని ఉండే ఇంత పెద్ద 'మెలోడ్రామా' బొత్తిగా మాయమయింది.

సంప్రదాయ రాజకీయ సమాజంలో ఆధిపత్య కులాల పెద్దలకు 'రికార్డు'లో వారికి ఎటువంటి హోదా లేకున్నా కేవలం 'బై నేమ్' వారు ఫోన్ చేసి రెవెన్యూ, పోలీస్ ఆఫీసుల్లో 'పవర్' చెలాయిస్తూ పనులు చేయించడం చాలా పాత విషయం. చట్టసభల్లో ఉండే నాయకులు ఇటువంటి 'సెమీ వర్టికల్స్' వలయాలు తమచుట్టూ ఏర్పడాలని, అటువంటివి వీలైనంత ఎక్కువగా ఉండేట్టుగానే వారు కూడా కోరుకుంటారు. ఎందుకంటే, ఎన్నికలప్పుడు ఓటర్లతో 'లైవ్ నెట్ వర్క్' ఉండే 'ఛానెల్' వాళ్లకు ఇదే! కుదిరితే ఏవో నామినేటెడ్ చైర్మన్ పదవులు లేదా 'కాంట్రాక్టులు' వీళ్ళకు ఎటూ ఉంటాయి. కౌన్సిలింగ్ పద్ధతి లేని రోజుల్లో చిన్న ఉద్యోగుల బదిలీలు వీళ్ళు అవలీలగా చేయించేవారు. వీరు కేంద్రంగా జరిగే లావాదేవీలు పార్టీల్లో చిన్నకులాల కార్యకర్తలకు అదొక మధ్యస్థాయి అదనపు వ్యాపారంగా సాగేది.



అయితే, దశాబ్దాలుగా ఇంత చిక్కటి వలయాలుగా అల్లబడిన అధికార చట్రం కూసాలను, ఐదేళ్ళ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం–గ్రామ సచివాలయాలు, వార్డు వాలంటీర్ల వ్యవస్థతోఎక్కడికక్కడ వదులు చేసేసింది. దాంతో 'డెలివరీ సిస్టం'లో ఉండే 'లీకేజీ'ల వద్ద ప్రయోజనం పొందే 'కేడర్' నష్టపోయి అసంతృప్తులు అయ్యారు. 'పవర్ పాలిటిక్స్'లో జరిగే ఇటువంటి మార్పును నిజానికి 'న్యూట్రల్ ఓటర్' హర్షించాలి. అది జరగలేదు సరికదా– 'మాది తీసి వాళ్లకు పెడుతున్నారు...' అనే ఫిర్యాదు వద్దే వాళ్ళు ఆగిపోయారు. అలా 'ఇంక్లూజివ్ గ్రోత్' అవసరాన్ని గడచిన పదేళ్ళలో అందరూ మర్చిపోయారు. ఇంతకీ జరిగింది ఏమిటి, మునుపున్న 'సెమీ–వర్టికల్స్' జాగాను గ్రామ సచివాలయాలలోని బహుజన యువతతో 'హారిజాంటల్'గా జగన్ మార్చారు.

అయితే, సంప్రదాయ అధికార నిర్మాణ చట్రం ఎప్పుడూ భద్రత కోరుకుంటుంది. ఏ కారణం చేత అది బీటలకు గురైనా పార్టీలతో పనిలేకుండా మొత్తం రాజకీయ చిత్రంపై దాని పర్యవసానాలు ఉంటాయి. జగన్ పాలనలో ఏపీలో సుపరిపాలన లక్ష్యంగా పరిపాలనా సంస్కరణలు మొదలైనట్టు తెలుస్తూనే ఉంది. కానీ జరిగింది ఏమిటి? సంప్రదాయ 'పవర్ పాలిటిక్స్' బహుళ అంచెలు (హైరార్కీ) కొంతమేర నిర్వీర్యం కావడం నిజమే. కానీ, ఈ స్వల్ప వ్యవధిలో ఆ స్థానంలోకి వచ్చిన 'ఫంక్షనల్ పాలిటిక్స్' ఆ పార్టీకి పాక్షికంగానే ఉపకరించాయి. ఆ కారణంగా, ఒక హక్కుగా 'రాజ్యం' ఇచ్చే సంక్షేమ ప్రయోజనాలు తీసుకుంటూనే, ఏ ఒక్క రాజకీయ పార్టీకి విశ్వాసంగా ఉండనక్కర లేదనే స్వేచ్ఛాశ్రేణులు ఏర్పడే కొత్త పరిస్థితికి అది దారితీసింది.

ఈ పార్టీ తీసుకున్న ఈ కొత్త వైఖరి వల్ల, అది తన ఓటర్లకు– 'మీ మెడమీద ఇకముందు ఏ కాడి ఉండదు' అని భరోసా ఇచ్చింది. గెలిచారా, ఓడారా అనేది అటుంచితే... రూపాంతర ప్రజాస్వామ్యం ('ట్రాన్స్‌ఫార్మింగ్ డెమోక్రసీ') దృష్టి నుంచి చూసినప్పుడు ఇది ఆహ్వానించదగిన పరిణామం. ఇన్నాళ్ళూ కనిపించని చట్రాల మధ్య బంధించబడిన పక్షుల్ని ఇక స్వేచ్ఛగా బతకమని పంజరంలో నుంచి వాటిని బయటకు వదలడం వంటిది. ఇంత చేసి– 'మా పార్టీ వల్ల మీకు మేలు జరిగిందని నమ్మితేనే మాకు ఓటు వేయండి' అని జగన్ 'ఆప్షన్' ఇవ్వడం– 'లిబరల్ డెమోక్రసీ' వైఖరికి పరాకాష్ఠ. జనానికి అది అర్థం కాకపోతే, రాజకీయ పార్టీగా దానికి నష్టం అయితే కావొచ్చు. కానీ, దేశ రాజకీయాల్లో 2024 ఆంధ్రప్రదేశ్ ప్రయోగం ఒక 'కేస్ స్టడీ' కానుంది. ఇప్పటికే నెదర్లాండ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏసియా రీసెర్చ్ ఫెలో విగ్నేష్ కార్తీక్, జేఎన్‌యూ పరిశోధకుడు వి. చంద్రశేఖర్ ఈ ఎన్నికల్లో రెండు పక్షాల వైఖరిలోని వైవిధ్యాన్ని ఇటీవల ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక వ్యాసంలో వెలికి తీశారు.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

భగవత్ప్రసాదం

ఈ విశ్వంలో ఆలోచనలు, భావనలను మనిషి మాత్రమే మాటల ద్వారా తెలుపగలడు. ఏ ఇతర జీవికీ మాట్లాడే శక్తి లేదు. మాట్లాడటం అనేది భగవంతుడు మానవునికి అనుగ్రహించిన వరప్రసాదం. మానవుడు తన జీవితాన్ని సంతోషమయం లేక దుఃఖమయం కావించుకోవడం అనేది దేవుడు ఇచ్చిన వరప్రసాదాన్ని ఉపయోగించుకొనే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. మాటను సరిగా, విచక్షణతో ఉపయోగించుకొన్న మానవుడు... తాను ఆనందంగా ఉండడమే కాక ఇతరులను కూడా సంతోషపరచగలడు. దీనికి భిన్నంగా విచక్షణారహితమైన, అస్తవ్యస్తమైన మాటలు మాట్లాడుట వల్ల సమస్యలు వస్తాయి. ఫలితంగా మనిషి జీవితం దుఃఖమయం అవుతుంది. ఈ కారణం వల్లనే 'మాట్లాడడానికి ముందు ఆలోచించు' అని పెద్దలు చెప్పారు. మనం సర్వకాల, సర్వావస్థల యందు తియ్యగా, ఇంపుగా మాట్లాడటానికి ప్రయత్నించాలి. మనం మాట్లాడే పద్ధతి ఇతరులను కోపోద్రిక్తులను చేయకుండా జాగ్రత్త పడాలి. ఎల్లప్పుడూ సత్యాన్నే పలకాలి. నియమాలను ఉల్లంఘించకుండా ఉండడమే వినయం. ఈ పద్ధతి భగవద్గీతలో 'వాఙ్మయ తపస్సు'అని తెలుపబడినది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మనం చేయు భౌతికపరమైన పనులన్నీ ఆలోచనల పైననే ఆధారపడి ఉంటాయి. ఆలోచించడం, మంచి–చెడులను తెలుసుకొనడం బుద్ధికి సంబంధించిన పని. బుద్ధిబలాన్ని ఉపయోగించి 'ఏది ఉచితం, ఏది ఉచితం కాదు' అని మనం తెలుసుకో గలుగుతున్నాం. మనం చేసే పనిని బట్టి మన ఆలోచన వ్యక్తమవుతుంది. ఉదాహరణకు ఒక వక్త ముందు మైక్ ఏర్పాటు చేసినా... ఆ వక్త ఆలోచన మాటల రూపంలో బయటికి రానంత వరకూ మైక్ మనకు వినిపింప చేయలేదు. అలాగే క్రియ అనేది దానంతట అది మంచి కాదు లేక చెడు కాదు. దీని (చర్య) మంచి, చెడులు దీనికి మూలాధారమైన ఆలోచనలోనే ఉంటాయి. అందువల్లనే మనం చేసే పని మంచిగానూ, గౌరవప్రదంగానూ ఉండాలి. మంచి ఆలోచనలకే తావునిచ్చి, వాటిని వృద్ధి చేసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.36 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** శతభిషం ప.2.05 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.8.03 నుండి 9.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.52 నుండి 10.44 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.23 నుండి 8.54 వరకు, తిరిగి తె.5.02 నుండి 6.29 వరకు(తెల్లవారితే శుక్రవారం) ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ

రెండు కిడ్నీలు, కాలేయం దానం


కరుణప్రసాద్ (ఫైల్)

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడి కుటుంబ సభ్యులు బుధవారం అవయవ దానం చేయడంతో ముగ్గురు వ్యక్తులకు పునర్జన్మనిచ్చినట్లయింది. పోరంకిలోని ఓ ఆస్పత్రి వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడు మండలం ప్రొద్దుటూరుకు చెందిన జోగి కరుణప్రసాద్ బైక్‌ను మంగళవారం పోరంకిలో ఓ ఆటో ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్చారు. కరుణప్రసాద్‌కు బలమైన గాయాలు తగలడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యులకు వైద్యులు కౌన్సెలింగ్ చేయడంతో కరుణప్రసాద్ అవయవాలు దానం చేయడానికి అంగీకరించారు. జీవన్‌దాన్ అనుమతులు పొందిన తరువాత ఒక కిడ్నీ, కాలేయాన్ని తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రికి గ్రీన్ కారిడార్ ద్వారా తరలించారు. మరో కిడ్నీని క్యాపిటల్ ఆస్పత్రిలో రోగికి అమర్చారు. అవయవ దానం వలన చాలా మంది ప్రాణాలు కాపాడు గలుగుతున్నామని, ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించాలని వైద్యులు తెలిపారు. అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

చిలకలపూడి(మచిలీపట్నం): లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కృష్ణాజిల్లా మచిలీపట్నం తొమ్మిదవ అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి ఎస్.సుజాత బుధవారం తీర్పు చెప్పారు. కృత్తివెన్ను మండలం సంగమూడి గ్రామానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన అర్జా సురేష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకున్నాడు. మహిళ వివాహం చేసుకోమని ఒత్తిడి చేస్తే నిరాకరించాడు. దీంతో ఆ మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన అనంతరం న్యాయమూర్తి నిందితుడు అర్జా సురేష్‌కు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా, నమ్మించి మోసం చేసినందుకు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా శ్రీసిటీ అభివృద్ధి

ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం ప్రశంస


ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర

శ్రీసిటీ (వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): శ్రీసిటీ పారిశ్రామికవాడ ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిగిందని ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం ప్రశంసించారు. ఏపీ దర్శన్ స్టడీ టూర్‌లో 2023 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. వారికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. వారితో చర్చల సందర్భంగా పారిశ్రామికవృద్ధి, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, సామాజిక బాధ్యతను సమన్వయం చేయడం ద్వారా ప్రపంచస్థాయి వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీ మారిందని తెలిపారు. స్థానిక ప్రజల ప్రమేయంతో ఈ ప్రాంత వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను పారిశ్రామిక శక్తి కేంద్రంగా శ్రీసిటీ ఎలా విజయవంతంగా మార్చిందో వారికి వివరించారు. మెగా పారిశ్రామికవాడ అభివృద్ధి పయనం, ఎదుర్కొన్న సవాళ్లతో పాటు శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలపై ప్రదర్శన ఇచ్చారు. ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటనపై సంతోషం వ్యక్తం చేసిన ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, వీరే కాకుండా దేశ, విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహాకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే ఉపేక్షించొద్దు



2022లో 3,042 మంది మృతి

వాహన చట్ట నిబంధనల్ని కచ్చితంగా అమలు చేయాల్సిందే

ట్రాఫిక్ పోలీసులు బాడీఓర్న్ కెమెరాలు ధరించాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు ధర్మాసనం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ విషయంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించరాదని స్పష్టం చేసింది. హెల్మెట్ ధరించకపోవడం వల్ల సంభవిస్తున్న మరణాలను దృష్టిలో పెట్టుకుని ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను ఆదేశించింది. ఈ విషయంలో చట్ట నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర మోటారు వాహన సవరణ చట్ట నిబంధనలను అమలు చేసేందుకు ఏం చర్యలు తీసుకున్నారో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంది. తదుపరి విచారణను ఆగస్టు 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అవగాహన కల్పించండి

హెల్మెట్ ధరించాల్సిన అవసరం, ధరించకుండా సంభవించే దుష్ప్రభావాలపై వాహన చోదకులలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులను, న్యాయ సేవాధికార సంస్థను ధర్మాసనం ఆదేశించింది. చట్ట నిబంధనల గురించి ప్రాంతీయ, జాతీయ భాషా పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలంది. రోడ్లపై విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు తప్పనిసరిగా బాడీఓర్న్ కెమెరాలు ధరించాల్సిన అవసరం ఉందంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలంది. తద్వారా చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన వారికి వ్యతిరేకంగా సాక్ష్యాలను కోర్టు ముందుంచి వారికి శిక్ష పడేలా చేయొచ్చని తెలిపింది. అలాగే మోటారు వాహన చట్టంలో నిర్దేశించిన ఇతర నిబంధనలను కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారం విస్తృత ప్రజా ప్రయోజనాలకు సంబంధించిందని, దీనిని సీరియస్‌గా తీసుకోవాలని ప్రభుత్వానికి, పోలీసులకు స్పష్టం చేసింది. అందువల్ల సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన వారికి విధించిన చలాన్ల వివరాలను, వాహన తనిఖీల వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. మంచి వ్యాజ్యం దాఖలు చేశారంటూ పిటిషనర్ తాండవ యోగేష్‌ను ధర్మాసనం ఈ సందర్భంగా అభినందించింది.

కేంద్ర మోటారు వాహన సవరణ చట్ట నిబంధనలను అమలు చేయడం లేదని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించడం లేదని, దీంతో పెద్ద సంఖ్యలో వాహన ప్రమాదాలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయని న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ట్రాఫిక్‌తో సహా మోటారు వాహన చట్ట నిబంధనల కింద ఇతర విధులు నిర్వర్తించే పోలీసులు, ఇతర అధికారులు బాడీఓర్న్ కెమెరాలను ధరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. యోగేష్ వాదనలు వినిపిస్తూ.. 2022లో రోడ్డు ప్రమాదాల కారణంగా 3,703 మరణాలు సంభవించాయని, ఇందులో 3,042 మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే సంభవించాయని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. విజయవాడలో హెల్మెట్ లేకుండా వాహన చోదకులు తిరుగుతుండటాన్ని తాము కూడా గమనించామంది. చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సి ఉందని, ఈ దిశగా తగిన ఆదేశాలు జారీ చేస్తామంది. దీనికి ముందు చట్ట నిబంధనల అమలుకు ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సంగీత, సాహితీవేత్త 'రేకపల్లి' కన్నుమూత


శ్రీనివాసమూర్తి (ఫైల్)

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ప్రముఖ సంగీత, సాహితీవేత్త రేకపల్లి శ్రీనివాసమూర్తి(81) వృద్ధాప్యం కారణంగా స్థానిక ఎస్వీ నాయుడు కాలనీలోని తన స్వగృహంలో బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆయన సంగీత, సాహితీ రంగాలకు దాదాపు నాలుగున్నర దశాబ్దాలపాటు విశేష సేవలు అందించారు. తాను స్థాపించిన భారతీ గానసభ ద్వారా సంగీత కళాకారులను, సాహితీ మిత్రమండలి ద్వారా ఔత్సాహిక కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించారు. స్వయంగా శ్రీనివాసమూర్తి 70కి పైగా సాహితీ పుస్తకాలు, భక్తి సంపుటిలు రచించారు. శ్రీనివాసమూర్తికి భార్య మహాలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భారతీ గానసభ సారథ్యంలో ఏటా అమలాపురంలో గానసభలను ఏర్పాటుచేసి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఎందరో సంగీత కళాకారులతో సంగీత కచేరీలను నిర్వహించారు. వాగ్గేయకారుడు దివంగత మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సంగీత విద్వాంసుడు, వీణ వైణికుడు దివంగత చల్లపల్లి చిట్టిబాబు వంటి వారు భారతీ గానసభ వేదికపై గానం చేశారు. సాహితీ మిత్రమండలి సంస్థ ద్వారా సాహితీవేత్తలు యర్రాప్రగడ రామకృష్ణ, పోచినపెద్ది కామ సత్యనారాయణ వంటి ఎందరో సాహితీవేత్తలను సత్కరించారు. సంస్కార భారతి పట్టణ అధ్యక్షుడిగా, న్యాయవాదిగా, ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్‌గా, కాంగ్రెస్ పార్టీ నేతగా ఆయన పలు పదవులను నిర్వహించారు. శ్రీనివాసమూర్తి భౌతికకాయం వద్ద పట్టణానికి చెందిన న్యాయవాదులు, సాహితీవేత్తలు, సంగీత కళాకారులు, రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్, ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్, పట్టణ మాజీ అధ్యక్షుడు పేరి లక్ష్మీనరసింహం సంతాపం తెలిపారు.

ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అని నోటిఫికేషన్ వద్దు

- ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం
- అనర్హత వేటుపై హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్సీ రఘురాజు
- తదుపరి విచారణ జూలై 10కి వాయిదా

సాక్షి, అమరావతి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నానంటూ తనపై శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 4న మండలి చైర్మన్ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేసి, తనను శాసనమండలి సభ్యుడిగా కొనసాగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ మేరకు రఘురాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్సీగా మండలి సమావేశాలకు హాజరయ్యేలా కూడా ఆదేశాలు ఇవ్వాలన్నారు. మండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని విన్నవించారు. అంతేకాకుండా స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్లు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రవిశంకర్ జంధ్యాల వాదనలు వినిపిస్తూ.. రఘురాజు సతీమణి టీడీపీలో చేరారన్న కారణంతో ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసిందన్నారు. భార్య చర్యలతో పిటిషనర్‌కు సంబంధం లేదని, అందుకు ఆయనను బాధ్యుడిని చేయడం తగదని తెలిపారు. వేరే పార్టీలో చేరాలన్నది ఆమె స్వీయ నిర్ణయమన్నారు. ఆమె వేరే పార్టీలో చేరడం పిటిషనర్ స్వచ్ఛంధంగా తన సభ్యత్వాన్ని వదులుకున్నట్లుగా పరిగణించడానికి వీల్లేదన్నారు. రఘురాజు వైఎస్సార్‌సీపీ గురించి ఎన్నడూ ఎలాంటి వ్యతిరేక ప్రకటనలు చేయలేదని చెప్పారు. ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసిన విక్రాంత్‌కు అసలు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునే అధికారమే లేదన్నారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రఘురాజుపై ఫిర్యాదు చేశారని తెలిపారు. ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకపోయినా ఆయనపై అనర్హత వేటు వేశారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రవి పిటిషనర్‌పై అనర్హత వేటు నేపథ్యంలో స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంటూ నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, విప్ విక్రాంత్‌లను ఆదేశించారు. తదుపరి విచారణను జూలై 10కి వాయిదా వేశారు.

ట్రిపుల్ ఐటీలకు 53,863 దరఖాస్తులు

- ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువు
- 1 నుంచి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం
- 11న ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటన



నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లకుగాను ఈనెల 25తో దరఖాస్తు స్వీకరణకు గడువు ముగిసింది. నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2024–25 అడ్మిషన్లకు సంబంధించి మొత్తం 53,863 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు బుధవారం తెలిపారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి 4 వేల సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కింద మరో 400 సీట్లు కలిపి మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి రిజర్వేషన్‌ను అనుసరించి ట్రిపుల్ ఐటీల సీట్లను భర్తీ చేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ప్రభుత్వ పాఠశాల నుంచి 34,154 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 19,671 మంది ఉన్నారు. అలాగే బాలురు 23,006 మంది, బాలికలు 30,857 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో స్పెషల్ కేటగిరిలైన క్యాప్ నుంచి 3,495 మంది, ఎన్‌సీసీ నుంచి 2,129 మంది, దివ్యాంగులు 381 మంది, క్రీడా కోటాలో 1,389 మంది, స్కౌట్స్ అండ్ గైడ్ నుంచి 327 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 28,573 మంది, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 21,559 మంది, తెలంగాణ నుంచి 3,693 మంది, రెండు తెలుగు రాష్ట్రాలను మినహాయించి ఇతర రాష్ట్రాలకు చెందిన 38 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

1 నుంచి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

దరఖాస్తు చేసుకున్న ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను జూలై 1 నుంచి నిర్వహించనున్నారు. సైనికోద్యోగుల పిల్లలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జూలై 1 నుంచి 3వ తేదీ వరకు, క్రీడా కోటా జూలై 3 నుంచి 6 వరకు, దివ్యాంగుల కోటా జూలై 3న, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా జూలై 2, 3 తేదీల్లో, ఎన్‌సీసీ కోటా జూలై 3 నుంచి 5 వరకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు ట్రిపుల్‌ఐటీ అధికార వర్గాలు తెలిపాయి. అలాగే జూలై 11న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. జూలై 22, 23 తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీల్లో, 24, 25 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో, 26, 27 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేసి అడ్మిషన్లను కల్పించనున్నారు.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల ప్రక్రియ కన్వీనర్‌గా అమరేంద్ర



వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ఆయా ట్రిపుల్ ఐటీల్లో 2024–25 జరిగే అడ్మిషన్ల ప్రక్రియకు కన్వీనర్‌గా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న అధ్యాపకుడు డాక్టర్ అమరేంద్ర కుమార్ సండ్రాను ఆర్జీయూకేటీ అధికారులు నియమించారు. గతంలో ఆయన ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా, ఎగ్జామ్స్ కంట్రోలర్‌గా, ఏఓగా పనిచేశారు. అడ్మిషన్ల ప్రక్రియను సమర్థంగా చేపడతానని అమరేంద్ర తెలిపారు. ఈయన నియామకంపై ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

మాల్స్‌లో పార్కింగ్ ఫీజుపై స్పందించిన హైకోర్టు

- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం
- తదుపరి విచారణ ఆగస్టు 7కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్‌లో వినియోగదారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 7కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్‌లో వినియోగదారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయడం చట్ట, రాజ్యాంగ విరుద్ధమంటూ విజయవాడకు చెందిన చందన మోహనరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మల్టీప్లెక్స్‌లలో పార్కింగ్ చార్జీల వసూలుకు ఆస్కారం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 35ను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపించారు. మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్‌లో వినియోగదారుల నుంచి విచక్షణారహితంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. ఎలాంటి పార్కింగ్ ఫీజులు వసూలు చేయరాదని హైకోర్టు గతంలో స్పష్టమైన తీర్పునిచ్చిందని తెలిపారు. ఈ తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం జీవో 35 జారీ చేసిందన్నారు. ఈ సమయంలో అడ్వొకేట్ జనరల్ (ఏజీ) తరఫున హాజరవుతున్న న్యాయవాది సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ.. జీవో 35 స్థానంలో జీవో 13 తీసుకురావడం జరిగిందన్నారు. ఆ జీవోను కోర్టు ముందుంచారు. దానిని పరిశీలించిన ధర్మాసనం.. జీవో 13 సినిమా టికెట్లకు సంబంధించిందని, అందులో పార్కింగ్ ఫీజుల ప్రస్తావన లేదని తెలిపింది.

మహానందిలో మరోసారి చిరుత కలకలం

సీసీ కెమెరాల్లో కనిపించిన సంచారం • భయాందోళనలో జనం


మహానందిలోని గోశాల వద్ద సంచరిస్తున్న చిరుతపులి

మహానంది: మహానంది గోశాల వద్ద బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో చిరుతపులి సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది వెంటనే నంద్యాల జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్‌లకు సమాచారం అందించారు. వారు మహానంది గోశాల వద్దకు చేరుకుని చిరుతపులి సంచరించిన ప్రదేశం, పాదముద్రలను గుర్తించారు. ఇదిలా ఉండగా.. నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని శిరివెళ్ల మండలం పచ్చర్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుతపులి దాడిలో మంగళవారం ఓ మహిళ మృతి చెందిన విషయాన్ని మరువక ముందే తాజా ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తుంది. ఘటనతో పచ్చర్ల వద్ద నల్లమలలో అటవీశాఖ అధికారులు చిరుతపులి కోసం బోను, పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే అటుగా సంచరించే చిరుతపులి అంతటా తిరుగుతుందని, బోనులోకి మాత్రం రావడం లేదని అటవీశాఖ అధికారులు తెలిపారు. గతంలోనూ మహానంది, పచ్చర్ల ప్రాంతాల్లో చిరుతలు సంచరించగా.. ఈ గ్రామాల పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎలా వచ్చాయనే విషయాలపై అటవీశాఖ అధికారులు ఇప్పటికీ గోప్యత పాటిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకాశంలో చిక్కిన చిరుత

- ఊపిరి పీల్చుకున్న అధికారులు, స్థానికులు
- ప్రకాశం జిల్లా దేవనగరం సమీపంలో ఘటన



గిద్దలూరు రూరల్: ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలోని దేవనగరం సమీపంలో ఓ చిరుతపులి స్థానికులకు కంటబడడంతో భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా.. వారు చిరుతపులిని బంధించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. నల్లమల అటవీ ప్రాంతం నుంచి ఓ చిరుతపులి దేవనగరం గ్రామ శివారులో మేకలు మేపుకునేవారి కంటపడింది. దీంతో వారు కేకలు వేయడంతో చిరుతపులి అక్కడే ఉన్న ఓ పాడుబడిన బావిలోకి దిగింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో డిప్యూటీ డైరెక్టర్ వై.వి.నరసింహారావు, రేంజి ఆఫీసర్ కుమార్‌రాజ రెస్క్యూ టీమ్ సిబ్బందితో సహా ఘటనా స్థలానికి చేరుకుని బావి చుట్టూ వలచుట్టి చిరుతను బంధించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడిన చిరుతను బోనులో బంధించి అడవిలో వదలనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

ప్రజాభీష్టానికి అనుగుణంగా పరిపాలన అందించాలి

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు


ప్రసంగిస్తున్న విద్యాసాగర్‌రావు

ఏయూక్యాంపస్: ప్రజాభీష్టానికి అనుగుణంగా పరిపాలన చేయాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో పీవీ చలపతిరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన పీవీ చలపతిరావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో '2024 ప్రజాతీర్పు–సందేశం' అనే అంశంపై విద్యాసాగర్‌రావు ప్రసంగించారు. రాజ్యాంగం రద్దు పేరుతో దుష్ప్రచారం ఎక్కువగా జరుగుతోందని, అసలు రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రసక్తే లేదన్నారు. దేశాన్ని కారాగారంగా మార్చిన కాంగ్రెస్ పార్టీ నేడు రాజ్యాంగం గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. హిందుత్వం మతం కాదని, అది జీవన విధానమని సుప్రీంకోర్టు సైతం పలు తీర్పుల్లో ఉదహరించిందని తెలిపారు. అన్నదాతగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ సహకారంతో పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో సైతం ప్రగతి చూపుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జాగృతి పూర్వ సంపాదకుడు వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సత్యారావు మాస్టారు తదితరులు ప్రసంగించారు.

మహిళా చట్టాలపై 'గిరిజనానికి' అవగాహన

ప్రాజెక్ట్ రూపకల్పనకు 'మహిళా కమిషన్' కసరత్తు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో మహిళా చట్టాలపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని మహిళా కమిషన్ తీర్మానించింది. బుధవారం మంగళగిరిలోని ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన త్రైమాసిక సమావేశంలో గత మూడు నెలల్లో కమిషన్ దృష్టికి వచ్చిన ఫిర్యాదులు, ఆయా కేసుల స్థితిపై సమీక్షించారు. ఇటీవల జాతీయ మహిళా కమిషన్ అంతర్జాతీయ సదస్సులో గిరిజన ప్రాంత మహిళల ఆరోగ్యంపై నివేదించిన ప్రాజెక్ట్ రిపోర్టును చైర్ పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి సభ్యులకు వివరించారు. బసివిని, జోగిని, మాతంగి వంటి అనాగరిక ఆచారాలపై కమిషన్ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టి నిరోధించాలన్నారు. కేసుల విచారణకు సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు ఎప్పటికప్పుడు అందజేయాలని చైర్ పర్సన్ ఆదేశించారు. కార్యదర్శి వసంత బాల మాట్లాడుతూ హర్యానాలో జరిగిన జాతీయ మహిళా కమిషన్ సదస్సులో ప్రస్తావించిన ఉమెన్ సేఫ్టీ ఆడిట్‌ను వివరించారు. కమిషన్ సభ్యులు కుమారి గద్దం ఉమా, బూసి వినీత హాజరయ్యారు. సమావేశంలో కమిషన్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాటలో పెట్టండి

కేంద్రమంత్రి కుమారస్వామితో ఏపీ బీజేపీ నేతల చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీజేపీ కోరింది. ఈ మేరకు బుధవారం ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించి ఒక యాక్షన్ ప్లాన్‌ను కేంద్రమంత్రికి అందించారు. గతంలో ఇచ్చిన వినతుల ఆధారంగా అధికార యంత్రాంగంతో చర్చలు జరిపిన విషయాన్ని కుమార స్వామి బీజేపీ నేతలకు వివరించారు. ఈ విషయమై కేంద్ర ఉక్కు శాఖ అధికారులతో కూలంకషంగా చర్చించిన అనంతరం రెండు నెలల్లో మరోసారి సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు. ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సాగి కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి కుమారస్వామి ట్వీట్ చేశారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగార (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్–ఆర్ఐఎన్ఎల్) పునరుద్ధరణకు సంబంధించి ఏపీ బీజేపీ నేతలతో చర్చించినట్లు కుమారస్వామి తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

మాడుగుల(అనకాపల్లి జిల్లా): పిడుగుపాటుకు యువకుడు మృతి చెందిన ఘటన అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలోని గాదిరాయిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన వడ్డాది భవానీ శంకర్(22) తండ్రి అప్పలనాయుడుతో కలిసి వర్షంలో పొలంలో వరినారు మడిని చూసేందుకు వెళ్లాడు. వర్షం పెరగడంతో సమీపంలోని పెంటకోట సూర్యప్రకాశరావు పశువుల పాకలో అప్పలనాయుడు, మరో ముగ్గురు తలదాచుకున్నారు. ఆ పక్కనే ఉన్న ఇంకో పాకలోకి భవానీ శంకర్ వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా సూర్యప్రకాశరావు పాక మీద పిడుగుపడింది. ఆ పాకలో ఉన్న అప్పలనాయుడు, మరో ముగ్గురు అక్కడి నుంచి బయటకు పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నారు. పిడుగు పాటుకు ఆ పాక పూర్తిగా దగ్ధమైంది. అయితే పిడుగుపాటు అదురుకు పక్క పాకలో ఉన్న భవానీ శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

స్పీకర్‌గా బిర్లా

విపక్ష అభ్యర్థి సురేశ్‌పై విజయం

- మూజువాణి ఓటుతో ఎన్నిక
- మోదీ, రాహుల్ అభినందన
- సీటు దాకా తోడ్కొని వెళ్లిన వైనం
- విలువలకు పట్టం కడతా: బిర్లా
- సభలో తొలి రోజే వాయిదా పర్వం
- ఎమర్జెన్సీని ఖండిస్తూ బిర్లా తీర్మానం
- తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు
- పార్లమెంటు ఆవరణలో బీజేపీ నిరసన

న్యూఢిల్లీ: అనూహ్యమేమీ జరగలేదు. అధికార ఎన్డీఏ పక్ష అభ్యర్థి ఓం బిర్లా లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. బుధవారం లోక్‌సభ సమావేశం కాగానే స్పీకర్ పదవికి బిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో పాటు ఏ పార్టీ కూడా ఓటింగ్ కోసం పట్టు బట్టలేదు. దాంతో మూజువాణి ఓటు ద్వారా విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై బిర్లా విజయం సాధించినట్టు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. స్పీకర్ ఎన్నికపై అధికార, విపక్ష కూటముల మధ్య నెలకొన్న రగడకు ఆ విధంగా తెర పడింది. అనంతరం మోదీ, విపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు 61 ఏళ్ల బిర్లాను స్పీకర్ స్థానం వరకు తోడ్కొని వెళ్లారు. పార్టీలకు అతీతంగా సభ్యులంతా చప్పట్లతో హర్షధ్వానాలు వెలిబుచ్చారు. అఖిలేశ్ యాదవ్ తదితర విపక్ష సభ్యులంతా ఈ సందర్భంగా బిర్లాను అభినందించారు. విధి నిర్వహణలో ఆయన నిష్పాక్షికంగా వ్యవహరిస్తారని, ప్రజల గొంతుక వినిపించేందుకు విపక్షాలకు తగిన అవకాశాలిస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. బలరాం జాఖడ్ అనంతరం ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుని తిరిగి స్పీకర్‌గా ఎన్నికైన రికార్డును బిర్లా సొంతం చేసుకున్నారు. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి 293, ఇండియా కూటమికి 233 మంది సభ్యుల బలముంది. వయనాడ్ స్థానానికి రాహుల్ రాజీనామాతో సభలో ఒక ఖాళీ ఉంది.

మోదీ తొలి ప్రసంగం

బిర్లా ఎన్నిక అనంతరం 18వ లోక్‌సభలో మోదీ తొలి ప్రసంగం చేశారు. గత ఐదేళ్లలో సభ హుందాతనాన్ని పరిరక్షించడంలో స్పీకర్‌గా బిర్లా గొప్ప పరిణతి చూపారంటూ ప్రశంసించారు. పలు చరిత్రాత్మక నిర్ణయాలతో లోక్‌సభ చరిత్రలో స్వర్ణయుగానికి సారథ్యం వహించారంటూ కొనియాడారు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిన సందర్భాల్లోనూ ఆయన చక్కని సంతులనం పాటించారన్నారు. సభ నిర్వహణలో బిర్లా సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతారని విశ్వాసం వెలిబుచ్చారు. పార్లమెంటేరియన్‌గా ఆయన పనితీరును కొత్త సభ్యులంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

విపక్షాల అభినందనలు

రాహుల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా 18వ లోక్‌సభ చక్కగా పని చేస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈసారి సభలో విపక్షాల బలం పెరిగిందని గుర్తు చేశారు. వాటికి అందుకు తగ్గట్టుగా ప్రజా సమస్యలు లేవనెత్తేందుకు వీలైనన్ని అవకాశాలు లభించాలన్నారు. ఈ సభలో సభ్యుల సస్పెన్షన్ల వంటి సభ హుందాతనాన్ని తగ్గించే చర్యలుండబోవని అఖిలేశ్ ఆశాభావం వెలిబుచ్చారు. సుదీప్ బంధోపాధ్యాయ (టీఎంసీ), టీఆర్ బాలు (డీఎంకే) తదితరులు మాట్లాడారు.



స్పీకర్‌గా ఎన్నికైన బిర్లాను పోడియందాకా తోడ్కొని వచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మోదీ, రాహుల్ గాంధీ, కిరెన్ రిజిజు

నేడు పార్లమెంటు సంయుక్త సమావేశం

గురువారం పార్లమెంటు సంయుక్త సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. మోదీ 3.0 నూతన సర్కారు ప్రాథమ్యాలను ఈ సందర్భంగా ఆమె పార్లమెంటు ముందుంచే అవకాశముంది. రాజ్యాంగంలోని 87వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ ఎన్నిక అనంతరం సమావేశాలు ప్రారంభమయ్యాక ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించాల్సి ఉంటుంది. ఇందుకోసం ముర్ము గురువారం ఉదయం రాష్ట్రపతి భవన్ నుంచి గుర్రపు బగ్గీలో సంప్రదాయ పద్ధతిలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకుంటారు. గజద్వారం వద్ద ప్రధానితో పాటు లోక్‌సభ, రాజ్యసభ ప్రిసైడింగ్ అధికారులు స్వాగతం పలుకుతారు. సంప్రదాయ సెంగోల్ చేబూని ముందు నడుస్తూ రాష్ట్రపతిని లోక్‌సభ చాంబర్లోకి తీసుకెళ్తారు.

మోదీ రాహుల్ కరచాలనం

స్పీకర్‌గా ఎన్నికయ్యాక బిర్లాను పోడియం వద్దకు తీసుకెళ్లే సందర్భంలో లోక్‌సభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బిర్లాను అభినందించే క్రమంలో మోదీ, రాహుల్ కరచాలనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు నవ్వుతూ మాట్లాడుకోవడం సభ్యులందరినీ ఆకర్షించింది.



రాహుల్ నయా లుక్

స్పీకర్ ఎన్నిక సందర్భంగా రాహుల్ సరికొత్త వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఆయన తెలుపు రంగు లాల్చీ, పైజామా ధరించి లోక్‌సభకు వచ్చారు. ఆయన కొన్నేళ్లుగా టీ షర్టు, బ్యాగీ ప్యాంటే ధరిస్తున్నారు. భారత్ జోడో యాత్రల్లోనూ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ అదే వస్త్రధారణ కొనసాగించారు. సోమ, మంగళవారాల్లో లోక్‌సభకు వచ్చినప్పుడు, సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు కూడా టీ షర్టు, బ్యాగీ ప్యాంటులోనే కన్పించారు. రాహుల్ ప్రస్తుతం లోక్‌సభలో విపక్ష నేత కావడంతో అందుకు తగ్గట్టుగా లాల్చీ, పైజామాకు మారినట్టు భావిస్తున్నారు.

అడ్డంకులు లేకుండా సాగాలి...

''నన్ను స్పీకర్‌గా ఎన్నుకున్నందుకు సభకు ధన్యవాదాలు. అధికార, విపక్ష సభ్యులు ఒక్కతాటిపై నడిస్తేనే సభ సాగుతుంది. ప్రతి ఒక్కరి గొంతుకనూ వినడమే భారత ప్రజాస్వామ్యపు మూల బలం. ఏకైక సభ్యుడున్న పార్టీకి కూడా సభలో కావాల్సినంత సమయం లభించాలి. మనల్ని ప్రజలు ఎన్నో ఆశలతో ఎన్నుకున్నారు. కనుక వారి సమస్యల పరిష్కారం కోసం సభ అడ్డంకుల్లేకుండా నడుస్తుందని ఆశిస్తున్నా. విమర్శలుండొచ్చు. కానీ సభను అడ్డుకోవడం సరి కాదు. సభ్యులపై చర్యలు తీసుకోవాలని నాకెప్పుడూ ఉండదు. కానీ ఉన్నత పార్లమెంటరీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు కఠిన నిర్ణయాలు తప్పకపోవచ్చు''

- స్పీకర్‌గా ఎన్నికైన అనంతరం లోక్‌సభనుద్దేశించి ఓం బిర్లా

"స్పీకర్‌గా ఎన్నికైన మీకు విపక్షం తరఫున, 'ఇండియా' కూటమి తరఫున మీకు అభినందనలు. ఉభయ సభలు సజావుగా సవ్యంగా సాగాలని ఆశిస్తున్నాం. విశ్వాసంతోనే సహకారం సాధ్యమవుతుంది. ప్రజావాణి పార్లమెంట్‌లో ప్రతిధ్వనించాలి. ప్రభుత్వం వెంట అధికార బలం ఉండొచ్చేమోగానీ విపక్షాలు గతంతో పోలిస్తే మరింత గట్టిగా ప్రజావాణిని పార్లమెంట్‌లో వినిపించనున్నాయి. మమ్మల్ని మాట్లాడేందుకు మీరు అనుమతిస్తారని విశ్వసిస్తున్నాం. విపక్షసభ్యులు మాట్లాడితే ప్రజల గొంతు పార్లమెంట్‌లో మోగినట్లే. ఈ మేరకు మీరు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించండి"

"గత లోక్‌సభ సెషన్లు అత్యంత ఫలవంతమయ్యాయని ప్రభుత్వం ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉంది. విపక్షసభ్యులందరినీ సస్పెండ్ చేసి సభలో మౌనం రాజ్యమేలేలా చేయడం అప్రజాస్వామిక విధానం. సభ అత్యంత ప్రభావవంతంగా నడవడం కంటే ప్రజావాణి ఎంతగా సభలో వినిపించింది అనేదే ముఖ్యం"

- రాహుల్ గాంధీ

"ప్రజాస్వామ్య న్యాయానికి ఓం బిర్లాయే చీఫ్ జస్టిస్. మరెవరి ఆదేశాల ప్రకారమో కాకుండా ఆయన మార్గదర్శకత్వంలోనే సభ సజావుగా సాగాలని ఆశిస్తున్నా. విపక్ష లేకుండా ప్రతి రాజకీయ పక్షానికి సమానమైన అవకాశాలు కల్పించాలి. నిష్పక్షపాత వైఖరి ప్రదర్శించడం గొప్ప బాధ్యత. సస్పెన్షన్ వంటి సభ గౌరవానికి హాని కల్గించే చర్యలు పునరావృతంకాబోవని భావిస్తున్నా"

- అఖిలేశ్ యాదవ్

"సభలో విపక్షాలు బలం పుంజుకున్నాయి. దీంతో సభ కొత్తరూపు సంతరించుకుందిగానీ బీజేపీ వైఖరి మారలేదు. మెజారిటీ సభ్యులున్న పార్టీలకు ప్రాధాన్యత దక్కుతోంది. సభకు సారథి అయిన స్పీకర్ చిన్న పార్టీలనూ పట్టించుకోవాలి"

- అసదుద్దీన్

విపక్షనేతగా రాహుల్: స్పీకర్

న్యూఢిల్లీ: రాహుల్‌ను లోక్‌సభలో విపక్షనేతగా గుర్తిస్తున్నట్లు నూతన స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రతిపక్షాలకు 'విపక్షనేత' హోదా దక్కడం విశేషం. ఈ మేరకు జూన్ 9వ తేదీ నుంచే రాహుల్‌ను విపక్షనేతగా పరిగణిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ బుధవారం ఒక నోటిఫికేషన్ జారీచేసింది. పార్లమెంట్ చట్టం1977లోని రెండో సెక్షన్ ప్రకారం రాహుల్‌ను విపక్షనేతగా ప్రకటించింది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. పార్టీ చీఫ్ ఖర్గే, పార్టీ కార్యకర్తలు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడిగా ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్‌లో వినిపిద్దామని పిలుపునిచ్చారు. 16వ, 17వ లోక్‌సభలో విపక్షపార్టీలకు కనీసం 10 శాతం సభ్యులబలం లేనికారణంగా ఏ పార్టీకీ విపక్షహోదా దక్కలేదు. విపక్షనేతగా ఎన్నికవడం ద్వారా రాహుల్ తన పాతికేళ్ల రాజకీయజీవితంలో తొలిసారిగా రాజ్యాంగబద్ధ పదవిని స్వీకరించారు. కేబినెట్ మంత్రి హోదాతో సమానమైన విపక్షనేత హోదాలో రాహుల్‌కు ఒక ప్రైవేట్ కార్యదర్శి, ఇద్దరు అదనపు ప్రైవేట్ కార్యదర్శులు, ఇద్దరు వ్యక్తిగత సహాయకులు, ఇక హిందీ స్టెనో, ఒక క్లర్క్, ఒక శానిటేషన్ వర్కర్, నలుగురు ప్యూన్లను కేంద్రం సమకూరుస్తుంది. 1954చట్టం 8వ సెక్షన్, 1977 చట్టాల ప్రకారం జీతభత్యాలు చెల్లిస్తుంది. లోక్‌పాల్, సీఈసీ, ఈసీ, సీబీఐ డైరెక్టర్, సీవీసీ, సీఐసీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీల నియామక ప్యానెళ్లలో ఇకపై రాహుల్ సభ్యునిగా ఉండనున్నారు.రాహుల్ తొలిసారిగా 2004లో అమేథీలో విజయంతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు.

కాక రేపిన ఎమర్జెన్సీ తీర్మానం

న్యూఢిల్లీ: స్పీకర్‌గా బాధ్యతలు చేపడుతూనే బుధవారం బిర్లా తీసుకున్న తొట్ట తొలి నిర్ణయమే లోక్‌సభలో కాక రేపింది. విపక్షాల నుంచి, ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి తీవ్ర నిరసనలకు, వ్యతిరేకతకు దారి తీసింది. 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడాన్ని ఖండిస్తూ స్పీకర్ సభలో స్వయంగా తీర్మానం ప్రవేశపెట్టారు! ''భారత్ ఎప్పుడూ ప్రజాస్వామిక విలువలకు పెద్దపీట వేసింది. అలాంటి దేశంలో ఇందిర 50 ఏళ్ల క్రితం ఇదే రోజున ఎమర్జెన్సీ విధించారు. ప్రజాస్వామిక విలువలపై, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపారు. విపక్ష నేతలను జైళ్లలో కుక్కారు. రాజ్యాంగంపై నేరుగా దాడి చేశారు. ఎమర్జెన్సీ విధించిన 1975 జూన్ 26 దేశ చరిత్రలో ఎన్నటికీ చెరగని మచ్చగా మిగిలిపోతుంది'' అంటూ తీర్మానాన్ని చదవి విన్పించారు. ఇందిర తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. ''ఎమర్జెన్సీ కాలంలో ప్రజలపై ఇందిర సర్కారు చెప్పలేనన్ని అకృత్యాలకు పాల్పడింది. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఎమర్జెన్సీ బాధితుందరికీ 18వ లోక్‌సభ సంతాపం తెలుపుతోంది. ఎమర్జెన్సీ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తోంది'' అన్నారు. ఎమర్జెన్సీకి నిరసనగా నిమిషం పాటు మౌనం పాటించాలని సభ్యులను కోరారు. ఎన్డీఏ సభ్యులంతా నిలబడి మౌనం పాటించగా విపక్షాలన్నీ స్పీకర్ తీరును తీవ్రంగా ఖండించాయి. ఎమర్జెన్సీ ప్రస్తావనను నిరసిస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దాంతో స్పీకర్‌గా తొలి రోజే సభను బిర్లా వాయిదా వేయాల్సి వచ్చింది. అనంతరం విపక్షాల నిరసనలకు ప్రతిగా బీజేపీ సభ్యులంతా పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శనకు దిగారు. ఎమర్జెన్సీ విధింపుపై కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.


స్పీకర్ తీరు ప్రశంసనీయం: మోదీ

ఎమర్జెన్సీని స్పీకర్ గట్టిగా ఖండించడం హర్షణీయమని మోదీ అన్నారు. ''ఇందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఎమర్జెన్సీ వేళ జరిగిన అకృత్యాలను స్పీకర్ తన తీర్మానంలో ఎత్తి చూపారు. రాజ్యాంగాన్ని తోసిరాజంటే, ప్రజాభిప్రాయాన్ని అణగదొక్కితే, వ్యవస్థలను నాశనం చేస్తే ఏమవుతుందో చెప్పేందుకు ఇందిర తీసుకున్న ఆ తప్పుడు నిర్ణయం ఒక చక్కని ఉదాహరణ'' అని ఎక్స్‌లో ప్రధాని పేర్కొన్నారు.

కుల గణన చేపట్టండి

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

చెన్నై: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. 2021 నుంచి వాయిదాపడుతున్న జన గణనను వెంటనే చేపట్టాలని, ఇందులో భాగంగా కుల గణన కూడా చేయాలని తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానంలో కోరారు. 'భారత్‌లోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, విద్య, ఉద్యోగాలు, ఆర్థికంగా సమాన అవకాశాలు అందాలంటే కుల గణన తప్పనిసరి అని శాసనసభ భావిస్తోంది' అని తీర్మానంలో పేర్కొన్నారు.



కాన్‌బెర్రా ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగుతూ అభివాదం చేస్తున్న అసాంజ్

అసాంజ్‌కు విముక్తి

- విడుదల చేసిన అమెరికా కోర్టు
- ఆస్ట్రేలియా చేరుకున్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు
- స్వాగతించిన ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

సైపన్/కాన్‌బెర్రా: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్‌కు పూర్తి విముక్తి దొరికింది. అమెరికా పసిఫిక్ ద్వీప భూభాగంలో ఉత్తర మరియానా దీవుల రాజధాని సైపన్‌లోని ఫెడరల్ కోర్టు అసాంజ్‌ను బుధవారం విడుదల చేసింది. అంతకుముందు మూడు గంటలపాటు విచారణ సాగింది. గూఢచర్య చట్టానికి విరుద్ధంగా అమెరికా జాతీయ రక్షణ పత్రాలను పొందడం, వాటిని బయట పెట్టడం వంటి నేరాలను అసాంజ్ అంగీకరించారు. అయితే, ''రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛపై నాకు నమ్మకముంది. అందులో భాగంగానే ఓ జర్నలిస్టుగా రహస్య పత్రాలను సేకరించి బయట పెట్టా. అమెరికా రాజ్యాంగానికి చేసిన తొలి సవరణ ప్రకారం నా చర్యలకు రక్షణ ఉంది'' అని చెప్పుకొచ్చారు. ఆయన నేరాంగీకార వాంగ్మూలాన్ని అనుమతిస్తున్నట్టు చీఫ్ యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి రమొనా వి.మంగ్లోనా ప్రకటించారు. అసాంజ్‌కు ఐదేళ్ల రెండు నెలల శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఇప్పటికే బ్రిటిష్ జైల్లో ఐదేళ్ల శిక్ష అనుభవించిన కారణంగా ఆయన్ను విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ''మీరు ఈ న్యాయస్థానం నుంచి స్వేచ్ఛా వ్యక్తిగా బయటకు వెళ్లవచ్చు'' అని ప్రకటించారు. అనంతరం అసాంజ్ కోర్టు నుంచి బయటికొచ్చారు. ఈ పరిణామం పట్ల ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

మీడియా ఎదురుచూపులు

విచారణను కవర్ చేయడానికి ప్రపంచవ్యాప్త మీడియా సైపన్‌లోని కోర్టు దగ్గరికి చేరుకుంది. గంటలపాటు బయట వేచి చూసినా విచారణను చిత్రీకరించేందుకు మీడియాను కోర్టు హాల్లోకి అనుమతించలేదు. అసాంజ్ కోర్టు హాలు నుంచి బయటకు వస్తున్న ఫొటోను ఆయన భార్య స్టెల్లా ఎక్స్‌లో పోస్టు చేశారు. 'భావోద్వేగంతో కంటతడి పెట్టకుండా ఉండలేకపోతున్నా' అన్నారు. అసాంజ్ విడుదల స్వాగతించదగ్గ పరిణామమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ అన్నారు. అసాంజ్ విడుదలకు ఆస్ట్రేలియా సకల ప్రయత్నాలు చేసిందన్నారు. ఇది చరిత్రాత్మకమైన రోజని అసాంజ్ న్యాయవాది జెన్నిఫర్ రాబిన్సన్ అన్నారు. ఆయన విడుదలకు సాయం చేసినందుకు అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వందేళ్లలో అమెరికా ఎవరిపైనా గూఢచర్య చట్టం ప్రయోగించలేదని, జర్నలిస్టు అయిన అసాంజ్‌పైనే మోపిందని ఆయన తరఫున వాదించిన మరో న్యాయవాది బారీ పొలాక్ తన క్లయింట్ అన్యాయానికి గురయ్యారన్నారు.

శుభాకాంక్షలు చెప్పిన న్యాయమూర్తి

విచారణ సందర్భంగా అసాంజ్‌కు న్యాయమూర్తి రమోనా ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం విశేషం. ''వచ్చే వారం మీ పుట్టిన రోజని తెలిసింది. మీరు కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారని ఆశిస్తున్నాను'' అని వ్యాఖ్యానించారు. జూలై 3న అసాంజ్ 54వ ఏట అడుగుపెట్టనున్నారు.

భార్యను, తండ్రిని హత్తుకుని..

ఆస్ట్రేలియా రాయబారులతో కలిసి అసాంజ్ ప్రైవేట్ విమానంలో సైపన్ దీవుల నుంచి బయల్దేరి బుధవారం రాత్రి ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రా చేరుకున్నారు. కుడిచేయి పైకెత్తి పిడికిలి బిగించి విమానం నుంచి బయటికొస్తున్న ఆయన్ను చూసి మద్దతుదారులంతా పెద్దగా నినాదాలు చేశారు. విమానాశ్రయంలో తనకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న భార్య స్టెల్లా, తండ్రి జాన్ షిప్టన్‌లను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. వారు అసాంజ్‌ను హత్తుకుని కన్నీటిపర్యంతమయ్యారు.

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అదుపులోకి తీసుకున్న సీబీఐ

సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయి తీహార్ సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ బుధవారం అదుపులోకి తీసుకుంది. సీబీఐ అధికారులు తొలుత ఆయనను జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట ప్రవేశపెట్టారు. మద్యం కుంభకోణం కేసులో అవినీతి వ్యవహారాలపై విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను ఐదు రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ విజ్ఞాపన సమర్పించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తన వాదనను కోర్టుకు తెలియజేశారు. మద్యం కుంభకోణంతో తనకు సంబంధం లేదని, తాను అమాయకుడినని పేర్కొన్నారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు, ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ కేసుతో సంబంధం లేదని, ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్‌కు సిసోడియాను బాధ్యుడిని చేస్తూ తాను సీబీఐకి స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని, అందులో ఎంతమాత్రం నిజం లేదని అన్నారు. సిసోడియాకు గానీ, ఇతరులకు గానీ వ్యతిరేకంగా తాను స్టేట్‌మెంట్ ఇవ్వలేదన్నారు.

అరెస్టు ఇప్పుడే ఎందుకంటే..

తాము నిజాలు మాత్రమే బహిర్గతం చేస్తున్నామని, మీడియాకు ఎలాంటి లీకులు ఇవ్వడం లేదని సీబీఐ తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. మద్యం కుంభకోణం వెనుక పెద్ద కుట్ర ఉందని, పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని, ఈ కేసులో కేజ్రీవాల్‌ను ప్రశ్నించి మరిన్ని నిజాలు రాబట్టాల్సి ఉందని తమ విజ్ఞాపనలో సీబీఐ పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఇప్పుడే అరెస్టు చేయాలని ఎందుకు భావిస్తున్నారని న్యాయమూర్తి ప్రశ్నించగా, ఇన్నాళ్లు సార్వత్రిక ఎన్నికలు జరగడంతో వేచి చూశామని, ఎన్నికలు ముగియడంతో అరెస్టు చేసి, విచారణ కొనసాగించాలని నిర్ణయించినట్లు సీబీఐ తరఫు న్యాయవాది బదులిచ్చారు. నూతన మద్యం విధానంలో భాగంగా ఢిల్లీలో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించాలని అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సిఫార్సు చేసినట్లు కేజ్రీవాల్ స్టేట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. అయితే, ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. అనంతరం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి, మూడు రోజులపాటు కస్టడీలో ఉంచి విచారించేందుకు సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి అమితాబ్ రావత్ అనుమతి ఇచ్చారు.



కేజ్రీవాల్‌ను తీసుకెళ్తున్న అధికారులు

బయటకు రాకుండా కుట్రలు: సునీతా


తన భర్త అరవింద్ కేజ్రీవాల్‌ను జైలు నుంచి బయటకు రానివ్వకుండా మొత్తం వ్యవస్థ కుట్రలు సాగిస్తోందని ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ మండిపడ్డారు. దేశంలో చట్టం అమల్లో లేదని, కేవలం నియంతృత్వం రాజ్యమేలుతోందని ఆరోపించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

రెగ్యులర్ బెయిల్‌పై మధ్యంతర స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బుధవారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో మరో పిటిషన్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

ఆస్పత్రిలో అద్వాణీ

వృద్ధాప్య సమస్యలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిక



న్యూఢిల్లీ: బీజేపీ కురు వృద్ధుడు, మాజీ ఉప ప్రధాని అద్వాణీ బుధవారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య నిపుణులు సమీక్షిస్తున్నారు. 96 ఏళ్ల అద్వాణీ వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. బీజేపీని దేశ వ్యాప్తంగా విస్తరించడంలో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు అద్వాణీది కీలక పాత్ర. దాదాపు నాలుగు దశాబ్దాల ఆయన రాజకీయ జీవితంలో రథయాత్ర కీలక మలుపు. ఆ యాత్ర ద్వారా బీజేపీకి దేశ వ్యాప్తంగా ఊపు తీసుకొచ్చారు. 1999-2004 మధ్య ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా చేశారు. బీజేపీ అధ్యక్షునిగా కూడా పని చేశారు. పదేళ్లుగా అద్వాణీ పూర్తి విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఈ ఏడాదే ఆయన భారతరత్న అందుకున్నారు. వయో భారం దృష్ట్యా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన నివాసానికి వెళ్లి ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో పురస్కారాన్ని అందజేయడం తెలిసిందే.

తుమ్మితే పేగులు బయటికొచ్చాయి!

సురక్షితంగా లోపల పెట్టేసిన వైద్యులు ● అమెరికాలో అరుదైన ఘటన

వాషింగ్టన్: ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవల మూత్రకోశం ఆపరేషన్ చేయించుకున్న 63 ఏళ్ల రోగి అనూహ్యమైన మెడికల్ ఎమర్జెన్సీ పరిస్థితులను ఎదుర్కొన్నారు. గట్టిగా తుమ్మి, దగ్గడంతో పేగులు బయటికొచ్చాయి. దీంతో ఆయనను అత్యవసరంగా ఆస్పత్రిలో చేర్పించి ఎలాంటి ఇన్ఫెక్షన్ సోకుండా కాపాడారు. ఫ్లోరిడావాసికి జరిగిన ఈ విచిత్ర ఘటన వివరాలు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ మెడికల్ కేస్ రిపోర్ట్స్'లో ప్రచురితమయ్యాయి. యూరినరీ బ్లాడర్ ఆపరేషన్ తర్వాత కోలుకున్న ఆ వ్యక్తికి ఇటీవల ఆస్పత్రికి వెళ్లారు. ఆపరేషన్ సమయంలో పై నుంచి వేసిన కుట్లను విప్పేశారు. ఆపరేషన్, కుట్లు విప్పడం అంతా సవ్యంగా జరగడంతో చిన్న పార్టీ చేసుకుందామనుకుని ఆ దంపతులు తర్వాతి రోజు ఉదయాన్నే దగ్గర్లోని రెస్టారెంట్‌కు వెళ్లి అల్పాహారం తినేందుకు కూర్చున్నారు. ఆ సమయంలో ఆ వ్యక్తి బిగ్గరగా తుమ్మడంతోపాటు దగ్గారు. దీంతో ఆపరేషన్ కోసం గతంలో కోత పెట్టిన ప్రాంతం నుంచి పేగుల్లో కొంతభాగం బయటికొచ్చింది. హుతాశుడైన వ్యక్తి వెంటనే ధైర్యం తెచ్చుకుని సొంతంగా డ్రైవింగ్ చేస్తూ ఆస్పత్రికి వెళ్దామనుకున్నాడు. భార్య వద్దని వారించడంతో అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లారు. పరిస్థితి చూసి అవాక్కవడం వైద్యుల వంతయింది. ముగ్గురు నిష్ణాతులైన యూరాలజీ సర్జన్లు జాగ్రత్తగా వాటిని మళ్లీ యథాస్థానంలోకి వెనక్కి నెట్టారు. ఇలాంటి ఘటన జరగడం మాకు తెలిసి ఇదే తొలిసారి అని అక్కడి వైద్యులు వ్యాఖ్యానించారు.

నేడే బైడెన్, ట్రంప్ బిగ్ డిబేట్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరిలో నిలిచిన రాజకీయ ప్రత్యర్థులు జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్ష చర్చా కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. ఇరువురు నేతలు గురువారం జరిగే ముఖాముఖి డిబేట్‌లో పాల్గొంటారు. బైడెన్, ట్రంప్ గత ఎన్నికల్లో పరస్పరం పోటీపడిన సంగతి తెలిసిందే. ఈసారి వారిద్దరూ మళ్లీ పోటీ చేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల ముందు అభ్యర్థుల మధ్య ఆనవాయితీగా జరిగే డిబేట్ గురువారం జరుగనుంది.

ముగ్గురు ఉగ్రవాదుల కాల్చివేత

భదేర్వాహ్/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం భారత భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మొహమ్మద్ (జేఈఎం)కు చెందిన వారుగా భావిస్తున్నారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు గాయపడ్డారు. ఈనెల 11న పోలీసులపై రెండు దాడులు జరిగాక సైన్యం, సీఆర్‌పీఎఫ్, పోలీసులు కలిసి సంయుక్తంగా గాలింపు చేపట్టారు. దోడా జిల్లాలో సినూ పంచాయతీ పరిధిలోని ఒక గ్రామంలో గాలింపు జరుపుతుండగా బుధవారం 10 గంటల ప్రాంతంలో ఉగ్రవాదులు ఎడతెరిపి లేకుండా కాల్పులు జరిపారు. దాదాపు ఆరుగంటల పాటు జరిగిన ఎన్‌కౌంటర్లో ముగ్గురు ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి.

రోడ్డు బాగాలేకపోతే టోల్ వసూలు చేయొద్దు

కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి గడ్కరీ ఆదేశం

న్యూఢిల్లీ: రహదారి సరిగ్గా లేకపోతే వాహనదారుల నుంచి టోల్ రుసుము వసూలు చేయొద్దని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ రహదారుల నిర్వహణ సంస్థలను ఆదేశించారు. శాటిలైట్ ఆధారిత టోల్ రుసుముల వసూలుపై బుధవారం ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించలేనప్పుడు టోల్ చార్జి వసూలు చేయొద్దని అన్నారు. గుంతలు, బురదతో నిండిన రోడ్లపై కూడా టోల్ వసూలు చేస్తే జనం నుంచి వ్యతిరేకత వస్తుందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5,000 కిలోమీటర్ల మేర రహదారులపై ఉపగ్రహ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా పిట్రోడా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌కు చైర్మన్‌గా శామ్ పిట్రోడా పునర్నియామకమయ్యారు. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం కావడం, వర్ణ వివక్ష వ్యాఖ్యలుగా మోదీతో సహా బీజేపీ దాడికి దిగడంతో ఆయన మే 8న రాజీనామా చేశారు. రాహుల్ గాంధీకి సన్నిహితుడైన పిట్రోడాను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం మళ్లీ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమించారు.

గోల్డీ బ్రార్‌పై రూ. 10 లక్షల రివార్డు

న్యూఢిల్లీ: కెనడాలో నివసిస్తున్న ఉగ్రవాది గోల్డీ బ్రార్ ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల నగదు రివార్డును అందిస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బుధవారం ప్రకటించింది. బెదిరించి డబ్బులు గుంజేందుకు చండీగఢ్‌లోని ఒక వ్యాపారవేత్త నివాసం వద్ద ఈ ఏడాది మార్చి 8న సత్వీందర్ సింగ్ (అలియాస్ సతిందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్), అతని అనుచరుడు గుర్‌ప్రీత్ సింగ్ (అలియాస్ గోల్డీ ధిల్లాన్ అలియాస్ గోల్డీ రాజీపురా)లు కాల్పులకు తెగబడ్డ సంగతి తెలిసిందే.

కాలేజీలో హిజాబ్‌పై నిషేధం సబబే

ముంబై హైకోర్టు తీర్పు

ముంబై: హిజాబ్, బుర్కా, నకాబ్‌లపై నిషేధం విధిస్తూ నగరానికి చెందిన ఒక కాలేజీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి ముంబై హైకోర్టు నిరాకరించింది. ఈ నిబంధనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులకు భంగకరం కాదని అభిప్రాయపడింది. విద్యా సంస్థ పాలనలో క్రమశిక్షణ నెలకొల్పడం కొరకే డ్రెస్ కోడ్ పెడతారని, ఇది కాలేజీ ప్రాథమిక హక్కని జస్టిస్ ఏ.ఎస్.చందూర్కర్, జస్టిస్ రాజేష్ పాటిల్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం పేర్కొంది. మతం, కులంతో సంబంధం లేకుండా డ్రెస్ కోడ్ అందరికీ వర్తిస్తుందని తెలిపింది. హిజాబ్ నిషేధాన్ని సవాల్ చేస్తూ తొమ్మిది మంది విద్యార్థినులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. చెంబూర్ ట్రోంబే ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే ఎన్.జీ.ఆచార్య, డి.కె.మరాఠే కాలేజీల్లో ఇటీవల డ్రెస్ కోడ్‌ను తీసుకొచ్చారు. కాలేజీ ఆవరణలో హిజాబ్, నకాబ్, బుర్కా, దుపట్టాలు, టోపీలు, బ్యాడ్జీలు ధరించడాన్ని నిషేధించారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

గురువారం ၊ 27 ၊ జూన్ ၊ 2024



పెద్ద వర్షాలు కురువ కాగా, జల్లు వానలే పలకరిస్తున్నాయి. బుధవారం బెంగళూరు విధానసౌధ పరిసరాల్లో ఓ మోస్తరు వర్షం కురిసిన దృశ్యం

న్యూస్‌రీల్

స్టాక్ మార్కెట్ పేరుతో రూ.64 లక్షలు స్వాహా

మైసూరు: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఓ వ్యక్తిని నమ్మించి రూ. 64 లక్షల వరకూ దోచుకున్నారు సైబర్ నేరగాళ్లు. తరచూ ఆన్‌లైన్ నేరాలకు పేరుపొందిన మైసూరు నగరంలోనే ఇది కూడా చోటుచేసుకుంది. కేసరె ప్రాంతంలో నివాసం ఉంటున్న వాసీం సైఫీ అనే వ్యక్తి బాధితుడు. మొబైల్‌కి దుండగులు పంపిన మేసేజ్ చూసి ఆ నంబరులోని వ్యక్తులతో మాట్లాడాడు. తమ వద్ద ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో బాధితుడు దశలవారీగా రూ. 64 లక్షలను పంపించాడు. తరువాత సంప్రదిస్తే దుండగుల ఫోన్లు స్విచాఫ్ అని వచ్చాయి. దీంతో బాధితుడు మైసూరు సెన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హంతకులకు జీవితఖైదు



మణి



సోను

శివమొగ్గ: శివమొగ్గ నగరంలో వాది-ఏ-హుదా వాసి మహమ్మద్ జైదాన్ హత్య కేసులో నిందితులు అయిన లష్కర్ మొహల్లాకు చెందిన నబీ అలి అలియాస్ మణి (21), ఇలియాస్ నగరకి చెందిన మహమ్మద్ అబు అలియాస్ సోను (21)కు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదును విధించింది. హత్యకు గురైన జైదాన్‌కు, నిందితుడు నబీకి ఏదో విషయంలో గొడవ జరిగింది. దీంతో కక్ష పెంచుకుని 2021, అక్టోబర్ 29న రాత్రి జైదాన్‌పై నబీ, సోనూతో కలసి మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. తుంగానగర పోలీసులు దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితులపై ఆరోపణలు నిరూపితం కావడంతో జడ్జి బీఆర్ పల్లవి ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

ప్రాణం తీసిన పనసపండు

యశవంతపుర: తోట పని చేస్తుండగా తలపై పనసకాయ పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా విట్ల కసబా గ్రామంలో జరిగింది. దాసరబెట్టు గ్రామాకి చెందిన కాశ్మీర్ డిసోజ (80) తన తోటలో పని చేస్తుండగా చెట్టు పై నుంచి పెద్ద పనసకాయ అతనిపై పడింది. ఈ ముక్కులో నుంచి తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు.

ఇక ఆటో చార్జీల బాదుడు?

యశవంతపుర: బెంగళూరులో ఒకటి తరువాత మరొకటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. మొదట పెట్రోల్, డీజిల్, కాయగూరలు, పూలు, పాలు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇదే పంథాలో తక్షణమే ఆటో చార్జీలను పెంచాలని బెంగళూరు ఆటో డ్రైవర్ల సంఘం యోచిస్తోంది. మూడేళ్ల నుంచి చార్జీలను పెంచని కారణంగా ఇప్పుడు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్లు జీవించడం కష్టంగా ఉన్నందున తక్కువగానే ధరలను పెంచాలని కోరుతున్నట్లు తెలిపారు. పెంపు నిర్ణయం నగర జిల్లా కలెక్టర్ కమిటీ పరిధిలో ఉంటుంది. నిర్ణయం తీసుకోవాలని డ్రైవర్ల సంఘం నేతలు కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిసింది.

తుమకూరు జైలుకు డి గ్యాంగ్ సభ్యులు



తుమకూరు/ దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్ ముఠాలోని నలుగురు నిందితులను తుమకూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించారు. బుధవారం 24వ ఏసీఎంఎం కోర్టు ఆదేశాల మేరకు రవిశంకర్, కార్తిక్ , కేశవ్, నిఖిల్ అనే నిందితులను బెంగళూరు పరప్పన జైలు నుంచి తుమకూరు ఊరుకెరె వద్ద రంగాపుర సమీపంలోని జిల్లా జైలుకు తరలించారు. జైలులో ప్రత్యేకంగా ఉంచారు.

నగదుపై ఐటీకి పోలీసుల లేఖ

రేణుకాస్వామి హత్య తరువాత హీరో దర్శన్ ద్వారా చేతులు మారిన రూ.70 లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. ఇంత పెద్ద మొత్తంలో నగదు ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తు చేయాలని ఆదాయపు పన్ను శాఖ (ఐటీ)కి పోలీసులు లేఖ రాసారు. హత్యను కప్పిపుచ్చేందుకు దర్శన్ రూ.30 లక్షలు ఇచ్చాడని, తరువాత మోహన్‌రాజ్ అనే మిత్రుని నుంచి రూ.40 లక్షలు సర్దుబాటు చేశాడని పోలీసులు పేర్కొన్నారు.

దర్శన్, ప్రదోశ్‌ల తుపాకులు సీజ్

దర్శన్, అనుచరుడు ప్రదోశ్‌లకు చెందిన రివాల్వర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో బెంగళూరు సిటీలో మొత్తం 7,830 మంది గన్ లైసెన్స్‌లు కలిగి ఉండగా 277 మంది గన్‌లు పోలీసులకు అప్పగించకుండా మినహాయింపు ఇచ్చారు. వారిలో దర్శన్, ప్రదోశ్ ఉన్నారు. హత్య కేసులో చిక్కుకోవడంతో ఆయుధాలను సీజ్ చేశారు.

అమ్మఒడికి శిశువు దూరం

- పిల్లల్ని ఎత్తుకెళ్లి అమ్మే ముఠా
- తుమకూరు జిల్లాలో గుట్టు రట్టు
- ఇద్దరు కాంట్రాక్టు నర్సులు సహా ఏడుగురు అరెస్ట్
- ఐదుగురు శిశువుల రక్షణ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్



శిశు విక్రయాల కేసులో అరెస్టు చేసిన నిందితులు వీరే, సీజ్ చేసిన కారు



తుమకూరు: పెళ్లి కాకుండా గర్భం ధరించిన, అలాగే వివాహేతర సంబంధాల ద్వారా గర్భధారణ జరిగిన మహిళలను గుర్తించి వారు జన్మనిచ్చిన పిల్లలను తీసుకుని లక్షలాది రూపాయలకు పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. అలాగే ఏమరుపాటుగా ఉన్న తల్లుల నుంచి పిల్లలను ఎత్తుకెళ్లి అమ్మేసేవారు. ఈ కేసులో ఏడు మందిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఐదు మంది చిన్నారులను రక్షించారు.

ఇదే ఆ ముఠా..

తుమకూరు జిల్లా కుణిగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఏఎన్‌ఎంగా పని చేసి, ఆ తరువాత ప్రైవేటు నర్సింగ్‌కాలేజీని స్థాపించిన తుమకూరు అశోక నగర వాసి మహేశ్ యూడీ (39) సూత్రధారిగా గుర్తించారు. హులియారు నివాసి, ఫార్మసిస్టు- ఆర్‌ఎంపీ మహబూబ్ షరీఫ్ (52), జాతరల్లో పచ్చబొట్లు వేసే గుబ్బి తాలూకా బిక్కేగుడ్డవాసి కేఎన్ రామకృష్ణ (53), తుమకూరువాసి నివాసి హనుమంతరాజు (45), మండ్య జిల్లా నాగమంగలవాసి ముబారక్‌పాషా (44), మధుగిరి తాలూకా దొడ్డేరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్టు నర్స్ ఎస్.పూర్ణిమా (39), శిరా జ్యోతినగర నివాసి, కాంట్రాక్టు నర్స్ సౌజన్య (48) అనేవారు ఒక ముఠాగా ఏర్పడి శిశు విక్రయాలను సాగిస్తున్నట్లు తేలింది. ఈ కేసులో నిందితులు ఉపయోగించిన కారు, రూ. 50 వేల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఐదుగురు శిశువుల స్వాధీనం

నిందితులను పోలీసులు విచారించి బెళ్లూరు క్రాస్‌లో రాకీ (11 నెలలు), హులియారు వద్ద టీవీ భక్తి (1), హాసన్‌జిల్లా సాణాహళ్లి వద్ద కృతి (1), బెంగళూరు సింగాపుర లేఔట్‌లోని వర్షిత్ కిషన్ ఆచార్య (2), మధుగిరి తాలూకా ఎస్‌ఎం గొల్లహళ్లిలోని మైథిలి (1) అనే చిన్నారులను రక్షించారు. ఇందులో రాకీని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. మిగిలిన నలుగురిని శిశు కేంద్రంలో ఉంచినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కేవీ తెలిపారు.



రాష్ట్రంలో పెరుగుతున్న శిశు చోరుల ముఠాలు

ఎలా డొంక కదిలిందంటే

ఈ ముఠా వ్యవహారం ఎలా బయటపడిందంటే.. ఈ నెల 6న రాత్రి సమయంలో గుబ్బి పట్టణం చన్నబసవేశ్వర దేవాలయం వద్ద మహాదేవీ అనే బాలింత కుటుంబంతో కలసి నిద్రించింది. ఆమె 11 నెలల రాకీ అనే మగ శిశువును ఎవరో దుండగులు అపహరించారు. దీంతో తల్లి గుబ్బి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి విచారణ సాగించారు. శిశువును దొంగతనం చేసిన రామకృష్ణ, హనుమంతరాజు అనే ఇద్దరిని అరెస్టు చేసి విచారించారు. ఈ ఇద్దరు ఇచ్చిన సమాచారం మేరకు మరో నిందితుడు మహేశ్‌ను పట్టుకున్నారు. మహేశ్‌ను తమదైన స్టైల్‌లో విచారించగా రూ.1.75 లక్షలకు శిశువును బెళ్లూరు క్రాస్‌లో ముబారక్ అనే వ్యక్తికి అమ్మేసినట్లు అంగీకరించాడు. అలాగే పలు చోట్ల శిశువులను ఎత్తుకెళ్లినట్లు, ఆ పిల్లలను రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల మధ్య అమ్మేస్తున్నట్లు చెప్పాడు. ఇక నిందిత నర్సులు కూడా అబార్షన్‌కు వచ్చేవారిని గుర్తించి వద్దని వారించేవారు. శిశువు పుట్టాక వారే తీసుకుని అమ్మేసేవారు. అచ్చం ఇలాంటి ముఠానే ఇటీవల బెళగావిలో పట్టుకోవడం తెలిసిందే. రాష్ట్రంలో శిశు విక్రయాల ముఠాలు చురుగ్గా పనిచేస్తున్నాయని ఈ పరిణామాలతో వెల్లడవుతోంది.

సూరజ్ కేసులో దర్యాప్తు



సూరజ్ రేవణ్ణ (ఫైల్)

బనశంకరి: యువకునిపై అసహజ లైంగిక దాడి కేసులో అరెస్టై సీఐడీ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణను సీఐడీ పోలీసులు విచారిస్తున్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారు, బాధిత జేడీఎస్ కార్యకర్త.. పలు కొత్త విషయాలను చెప్పినట్లు తెలిసింది. 2019 ఎన్నికల సమయంలో అరకలగూడులో నేను సూరజ్‌ను కలువగా నాతో పరిచయమై ఫోన్‌లో మాట్లాడేవాడు. వాట్సాప్‌లో లవ్ సింబల్ పంపించేవాడు. ఒకరోజు సూరజ్ ఫోన్ చేసి నీ జీవితం ఎలా ఉందని అడిగాడు. నేను నా కుటుంబం, వృత్తి వివరాలను చెప్పాను. ఇకపై ఎలాంటి భయం వద్దు, అని నేను అండగా ఉంటానని చెప్పి ఫాంహౌస్‌కి పిలిపించాడు. కాళ్లు నొక్కమని కోరాడు, ఆ సమయంలో బలవంతంగా తనపై లైంగికదాడికి పాల్పడ్డాడు. నాలుగేళ్లుగా ఈ దారుణాల గురించి బయటకు చెప్పలేకపోయాను అని పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రజ్వల్‌పై మరో కేసు

అత్యాచారం, లైంగిక వీడియోల కేసులో అరెస్టైన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై నాలుగో కేసు నమోదైంది. సీఐడీ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ అతనిపై ఫిర్యాదు చేసింది. రోజు వీడియోకాల్ చేసి నగ్నంగా ఉండాలనేవాడు, నన్ను చూస్తూ హస్త ప్రయోగం చేసుకునేవాడు. నేను ఒప్పుకోకపోతే వీడియో వైరల్ చేస్తానని బెదిరించేవాడు. ఓసారి వీడియో బయటకు వచ్చిందని చెబితే, ఏమీ కాదు అని చెప్పాడు అని ఆమె ఫిర్యాదులో తెలిపింది. మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడ, కిరణ్, శరత్ అనే వారు ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా వైరల్ చేశారని మరో కేసు నమోదైంది.

ప్రజ్వల్‌కు నో బెయిలు

యశవంతపుర: అత్యాచారం, అశ్లీల వీడియోల కేసులో హాసన్ మాజీ ఎంపీ హెచ్‌డీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిలు దరఖాస్తును బెంగళూరు ప్రజా ప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. హొళెనరసీపురలో దాఖలైన మొదటి కేసులో బెయిలు ఇవ్వాలని పిటిషన్ వేశారు. విచారించిన జడ్జి సంతోష్ గజానన భట్ కొట్టివేశారు.

పనస తోట కొట్టివేత

- చెట్లు, పండ్లు చోరీ



ఖాళీగా కనిపిస్తున్న తోట

విజయపుర: సుమారు 80కి పైగా పనస చెట్లను ఎలాంటి అనమతి లేకుండా కొట్టివేసి ఎత్తుకెళ్లిన ఘటన బెంగళూరు రూరల్‌లో ఇరిగేనహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామంలోని సర్వే నంబర్ 60/1లో ఎకరా 25 గుంటల పొలంలో 2011లో లాల్‌బాగ్ మధుర, బేలిచంద్ర అనే రకాలకు చెందిన పనస మొక్కలను టి.శ్యామణ్ణ అనే రైతు సాగు చేశారు. రెండేళ్ల క్రితం వర్షాలు అధికమై చెరువులు పొంగి ప్రవహించడంతో కొన్ని మొక్కలు నాశనమయ్యాయి. మిగిలిన 80కి పైగా చెట్లు పెరిగి ఫలాలను ఇస్తున్నాయి. ఏటా రూ. 2-3 లక్షల పండ్లను విక్రయించేవాడినని రైతు చెప్పాడు. అయితే ఈసారి కూడా ఇదే విధంగా విక్రయించే సమయం వచ్చిందని, భూటాన్ కు వాటిని తరలించాల్సి ఉందని, అయితే ఎవరో దుండగులు ఆ చెట్లను కొట్టేసి ఒక్కటి కూడా లేకుండా ధ్వంసం చేశారని ఆరోపించాడు. పని మీద వేరే ఊరికి వెళ్లానని, అక్కడి నుంచి వచ్చి చూస్తే తోటలో ఒక్క చెట్టు లేకపోవడాన్ని చూసి నిర్ఘాంతపోయినట్లు రైతు వాపోయాడు. చుట్టుపక్కల విచారించగా ఎవరో ట్రాక్టర్‌లో వాటిని తీసుకెళ్లినట్లు తెలిపారు. చెట్లు, పండ్లను దొంగతనం చేయడంతో తనకు రూ. 25 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ ఘటనపై విజయపుర పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాడు.

అయ్యయ్యో బియ్యం



ఒక్క బియ్యం గింజను పండించాలంటే రైతులు ఎన్నో నెలలు కష్టపడాలి. కానీ రోడ్డు ప్రమాదంలో ఆ కష్టం నేలపాలైంది. బుధవారం బెంగళూరులో సంజయనగర క్రాస్‌లో ఓ గూడ్స్ వ్యాన్ పల్టీ కొట్టడంతో బియ్యం బస్తాలన్నీ పడిపోయాయి. తరువాత వేరే వ్యాన్‌లో వాటిని ఎక్కించి పంపించారు. కొంత బియ్యం వృథా అయ్యింది.

వక్క చెట్లకు కుటుంబం బలి



వక్క చెట్లు పడడంతో కూలిన ఇల్లు

- నిద్రలోనే దంపతులు, ఇద్దరు కూతుళ్లు సమాధి
- మంగళూరు వద్ద దుర్ఘటన

యశవంతపుర: వానలతో ఇంటి పక్కనే ఉన్న వక్కచెట్లు కూలి పడిపోగా ఇల్లు ధ్వంసమై ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉల్లాల తాలూకా కుత్తారు మదాని నగరలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. యాసీర్ కట్టిమల్ల (45), భార్య మరియం కండక్ (40), వీరి ఇద్దరి కుమార్తెలు రఫీనా (19), రిహానా (16) మృతులు.

ఎలా జరిగిందంటే..

వివరాలు.. మంగళవారం సాయంత్రం నుంచి ఉల్లాలలో భారీ వానలు పడుతున్నాయి. వీరందరూ చిన్న పెంకుటింట్లో ఉంటున్నారు. తెల్లవారున నిద్రలో ఉండగా ఇంటి పక్కనే ఉన్న రెండు వక్కచెట్లు కూలి ఇంటి మీద పడ్డాయి. ఆ ధాటికి పెంకుటిల్లు పేకమేడలా ధ్వంసమైంది. దీంతో నలుగురు మట్టిలో చిక్కుకుని నిద్రలోనే శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. స్థానికులు చేరుకుని దంపతుల మృతదేహాలను బయటకు తీశారు. తరువాత ఫైర్ సిబ్బంది, పోలీసులు వచ్చి రెండు గంటలపాటు శ్రమించి బాలికల మృతదేహాలను వెలికితీశారు. యాసీర్ స్థానిక ఓడరేవులో పనిచేసేవాడు. కుమార్తెలు ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ, పీయూసీ చదువుతున్నారు. యాసీర్ ఆరేళ్ల క్రితం ఈ ఇంటిని కొన్నాడు. రెండేళ్ల క్రితం ఇంటి గోడ పడిపోగా మరమ్మతులు చేయించాడు. ఈసారి మాత్రం పెద్ద ఘోరం జరిగిపోయింది. ఉల్లాల పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ దుర్ఘటనతో స్థానికులు తీవ్ర విషాదానికి గురయ్యారు.



ప్రమాదస్థలిలో గుమిగూడిన స్థానికులు

అది పాల ధర పెంపు కాదు: సీఎం

బనశంకరి: నందిని పాల ధరలో ఎలాంటి పెంపు లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బుధవారం విధానసౌధలో విలేకరులతో సిద్దరామయ్య మాట్లాడుతూ పాల ధరను ప్రతి లీటరుకు రూ.2 పెంచారనడం సరికాదని, పాల ఉత్పత్తి పెరగడం వల్ల ఒక లీటరు, అర్ధ లీటరు ప్యాకెట్ కు 50 మిల్లీలీటర్లు అదనంగా కలిపి కొనుగోలుదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకు రూ.2.10 అవుతుందని, ఇది పాల ధర పెంపు కాదని, పాల విలువతో పోలిస్తే ధర అంతే ఉందని సర్దుబాటు చేసే యత్నం చేశారు.

బీజేపీ నేతలు పాల ధరను పెంచారని చెప్పడంలో ఎలాంటి అర్థం లేదని, ఇలా మాట్లాడేందుకు వారికి బుద్ధి ఉండాలని సీఎం మండిపడ్డారు. గతంలో బీజేపీ అధికారంలో ఉండగా నిత్యం 90 లక్షల లీటర్ల పాలు సేకరణ కాగా ప్రస్తుతం 99 లక్షల లీటర్లకు చేరుకుంది. దీంతో పాలను వేగంగా విక్రయించడానికి 50 మి.లీ.ను కలుపుతున్నట్లు చెప్పారు. రైతుల నుంచి పాలు తీసుకోవద్దని డెయిరీలకు చెప్పలేం కదా అన్నారు. హోటల్ యజమానులు కాఫీ, టీ ధర పెంచుతామని చెప్పడంపై ప్రస్తావించగా, పాల ధర పెరగనప్పుడు వాటి రేట్లను ఎలా పెంచుతారని రుసరుసలాడారు. ముగ్గురు డిప్యూటీ సీఎం పదవులపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

డ్రగ్స్‌తో వినాశనమే



మండ్యలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మండ్య: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అంతటా ర్యాలీలు జరుగుతున్నాయి. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే కష్టనష్టాలను వివరిస్తూ పోలీసులు మండ్యలో జాగృతి ప్రదర్శనను నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారులు విద్యార్థులు, ప్రజల చేత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ సేవిస్తే శారీరక, మానసిక ఆరోగ్యాలు దెబ్బతింటాయని తెలిపారు.

డ్రగ్స్‌ను తరిమివేద్దాం

మైసూరు: మత్తు పదార్థాల వాడకం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా బుధవారం నగరంలో జాగృతి ర్యాలీ నిర్వహించారు. పోలీసులు, పుష్పాంజలి సేవా సంస్థ, అగర్వాల్ సమాజం సంయుక్తంగా నగరంలోని కోటే ఆంజనేయ స్వామి దేవస్థానం ఎదుట ఈ ర్యాలీని చేపట్టారు. ఇందులో పలు కాలేజీల విద్యార్థులు పాల్గొని మానవహారంగా నిలిచారు. డ్రగ్స్‌ను తరిమివేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మైసూరు వర్సిటీ వీసీ ఎన్‌కే లోకనాథ్, పోలీసు కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరులో విద్యార్థుల ర్యాలీ



మైసూరులో మానవహారం ద్వారా జాగృతి

ఎమ్మెల్యే, వీసీకి హనీట్రాప్ బెదిరింపులు

బనశంకరి: రాజకీయ నేతలు, వీఐపీలను హనీట్రాప్‌కు పాల్పడుతూ నగదు కోసం బెదిరిస్తున్న ఇద్దరిని బుధవారం నగర సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు కు చెందిన సంతోష్, పుట్టరాజు నిందితులు.

చామరాజ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే హరీశ్‌గౌడను హనీట్రాప్ చేసి కోట్లాది నగదు కోసం బెదిరించసాగారు. ఫిర్యాదు రావడంతో నిందితులను అరెస్టు చేశారు. ఓ యూనివర్శిటీ వీసీని కూడా వారు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు విచారణలో వెలుగుచూసింది. మరోవైపు తనను ఎవరూ హనీట్రాప్ చేయలేదని హరీశ్‌గౌడ చెప్పారు. అయితే తన నియోజకవర్గంలో సుమారు 10 మంది హనీట్రాప్‌కు గురయ్యారని, వారందరూ తనకు పరిచయస్తులేనని తెలిపారు. ఆ పది మందిలో ఒకరు తనకు సమాచారం ఇచ్చారని చెప్పారు. మొదట నమ్మలేదని, ఆ తర్వాత ఐదు మంది చెప్పడంతో నమ్మానని చెప్పారు.

క్లుప్తంగా

తేనేటీగల పెంపకంపై శిక్షణ



మొక్కలు నాటుతున్న సైనిక అధికారులు

విజయపుర: సైనికులు యుద్ధ కౌశల్యంతో పాటు వ్యవసాయోత్పత్తుల శిక్షణ కూడా పొందడం వల్ల వారి రిటైర్మెంట్ జీవితానికి ఎంతో అనుకూలంగా మారుతోందని ఇండో-టిబెటెన్ సరిహద్దు పోలీసులు ఐజీ సంజీవ్ రెహానా తెలిపారు. యలహంక నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చర్ ఇన్‌సెక్ట్ రిసోర్సెస్, ఇండో టిబెటియన్ బార్డర్‌పోలీసు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెలిపోనికల్చర్ (తేనేటీగల పెంపకం) గురించి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో సంజీవ్ పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మొక్క నాటడం ద్వారా ప్రారంభించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


గగన(ఫైల్)

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం జిల్లా గుడిబండ తాలూకా ఓబన్నగారి పల్లెకు చెందిన గగన(19) అనే యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గగన జిల్లా కేంద్రంలో బీకాం చదువుతోంది. కూల్‌డ్రింక్స్ కోసం ఈనెల 24న ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లిన గగన తిరిగి రాలేదు. యువతి అన్న సాయికుమార్ పలు చోట్ల వెదికినా ఫలితం లేకపోయింది. దీంతో మహిళా పోలీసులకు పిర్యాదు చేశారు.

భార్యను హత్య చేసిన భర్త

- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు


నిందితుడు మునిరెడ్డి

శిడ్లఘట్ట: ఆస్తి విషయంలో భార్యను కడతేర్చిన భర్త పోలీసుల వద్ద లొంగిపోయాడు. ఈఘటన శిడ్లఘట్ట తాలూకా దేవరమళ్లూరు గ్రామ పంచాయతీ సొణ్ణేనహళ్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన మునిరెడ్డి తన మొదటి భార్య పద్మమ్మ (60)తో విభేదించి మరో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యతో పొలం విషయంలో తరచూ గొడవలు జరిగేవి. ఈ వ్యవహారం కోర్టు విచారణలో ఉంది. మునిరెడ్డి రెండో భార్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆస్తి వివాదంపై మునిరెడ్డి మంగళవారం సాయంత్రం తన మొదటి భార్య పద్మమ్మతో గొడవపడ్డాడు. ఓ దశలో కత్తితో తల, మెడపై పొడిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మునిరెడ్డి చిక్కబళ్లాపుర గ్రామీణ పోలీసుల వద్ద లొంగిపోయాడని ఎస్పీ ఎల్.నాగేశ్ తెలిపారు. మృతురాలు పద్మమ్మ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మత్తు వల్ల అన్నీ నష్టాలే


చైతన్య ర్యాలీలో డీఎస్పీ శాంతి తదితరులు

కెలమంగలం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తాగుడు వల్ల అనేక సమస్యలు తప్పవని బుధవారం డెంకణీకోటలో పోలీసులు, విద్యార్థులచే చైతన్య ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ శాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ తవమణి, సబ్ ఇన్స్పెక్టర్ పట్టు, హోలీక్రాస్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. డీఎస్పీ శాంతి మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాల సేవనం వల్ల ఆరోగ్యం చెడిపోతుందని, అన్ని విధాలా నష్టం జరుగుతుందని తెలపారు.

సీఎం కాన్వాయ్‌కి ఎదురుగా బైకిస్టు, కేసు

మైసూరు: ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాన్వాయ్ వస్తున్న సమయంలో బైకుపైన అడ్డుగా వచ్చి ఇబ్బందులు కలిగించాడంటూ ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మైసూరు తాలూకాలోని వరుణ గ్రామానికి చెందిన కుంబ్లి శివు (30) ఈనెల 23వ తేదిన సీఎం సిద్దు కాన్వాయ్ మైసూరు మండకళ్లి విమానాశ్రయం నుంచి నజరాబాద్‌కి వెళ్తుండగా నంజనగూడు జాతీయ రహదారి రాజహంస సర్కిల్ మీద నుంచి బైక్‌పై వెళ్లాడు. అక్కడ బారికేడ్లు, పోలీసులు ఉన్నా అతడు పట్టించుకోలేదు. చివరకు కొందరు పోలీసులు బారికేడ్లు అడ్డు పెట్టి శివును అడ్డుకున్నాడు. కాన్వాయ్ వెళ్లిపోయాక అతన్ని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. సీఎం కాన్వాయ్‌కి నిర్లక్ష్యంగా ఎదురు వెళ్లాడంటూ పలు సెక్షన్లతో కేసు నమోదు చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

పావగడ: స్థానిక సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తాలూకా లోని బ్యాడనూరు ఎంజీఎం ఉన్నత పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థులు, గుండార్లహళ్లి 150 మంది విద్యార్థులు, పెమ్మనహళ్లి 60 మంది విద్యార్థులు, హొసహళ్లి 60, మంగళవాడకు చెందిన 160 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. సత్యసాయి సేవాసమితి పదాధికారులు రామప్రసాద్, రమేశ్, మహంతేశ్,, బ్యాడనూరు శివు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు ఇంటింటా జాగృతి


అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ తుషార్ గిరినాథ్, సురళ్కర్ వికాస్ కిశోర్

బనశంకరి: బెంగళూరు నగరంలో డెంగీ నియంత్రణకోసం ఇంటింటికీ వెళ్లి ప్రజలను జాగృతం చేయాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ అధికారులను ఆదేశించారు. డెంగీ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం పాలికె కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి జూన్ వరకు 1230 డెంగీ కేసులు వెలుగుచూశాయని తెలిపారు. వలయాలవారీగా మైక్రోప్లాన్ చేసుకుని డెంగీ ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వెయ్యి ఇళ్లను ఒక్కో బ్లాక్‌గా విభజించి ఆయా ప్రాంతాల్లో ఆరోగ్య అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, లింక్ వర్కర్లతో కలిసి పర్యటించి లార్వా ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రజలను జాగృతం చేయడం, ఎవరైనా జ్వరం బారిన పడితే పీహెచ్‌సీలకు తీసుకెళ్లాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చైతన్య పరచాలన్నారు. జ్వరాలు ప్రబలితే పీహెచ్‌సీల్లో ఎన్.ఎస్.1 టెస్టు చేయించిన అనంతరం రక్తం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. 15 రోజులకు ఒకసారి ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యవిభాగ ప్రత్యేక కమిషనర్ సురళ్కర్ వికాస్ కిశోర్, డాక్టర్ హరీశ్ కుమార్, ఆర్ఎల్.దీపక్, వినోత్‌ప్రియా, రమేశ్, రమ్యా, కరిగౌడ పాల్గొన్నారు.

ఘరానా దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు



స్నాచర్ల నుంచి స్వాధీనం చేసుకున్న నగలు

తుమకూరు: దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న తుమకూరులోని అమరజ్యోతి నగర నివాసి పీఎస్ శ్రీనాథ్ (39), శారదాదేవీ నగర నివాసి వరుణ్ (27) అనే ఘరానా దొంగలను జయనగర పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 40.50 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ. 4.22 లక్షల విలువ చేసే వెండి స్వాధీనం చేసుకున్నారు. జయనగర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంటిలో ఇటీవల 700 గ్రాముల బంగారు ఆభరణాలు, 4,580 గ్రాముల వెండి చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ చోరీని చేధించేందుకు ఎస్పీ అశోక్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం తనిఖీ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసింది.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్

తుమకూరు: మధుగిరి ఉపవిభాగం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఏపీలోని హిందూపురానికి చెందిన జీఆర్ జిన్నా (34), రిజ్వాన్‌బాషా అనే నిందితులను మిడిగేశీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 29.35 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 82 వేల విలువైన సెల్‌ఫోన్లు, రూ. 3.80 లక్షల విలువైన మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చోరీ సొత్తును హిందూపురంలోని భరత్ అనే వ్యాపారికి విక్రయించినట్లు విచారణలో తేలిందని, దీంతో భరత్‌ను కూడా అదపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డీకే శివకుమార్‌ను అణగదొక్కేందుకు సీఎం కుట్ర

- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ పార్టీలో డీకే శివకుమార్‌ను అణగదొక్కేందుకే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన వర్గీయులతో డీసీఎం పదవుల కోసం డిమాండ్ చేయిస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ఆరోపించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీకే శివకుమార్ పవర్‌ను తగ్గించేందుకు సీఎం పవర్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే తన మద్దతుదారులతో డీసీఎం పదవులు ఇవ్వాలని అధిష్టానంపై డిమాండ్ చేయిస్తున్నారన్నారు.

రాష్ట్రంలో ధరల పెంపు కొనసాగుతోంది

రాష్ట్ర ప్రభుత్వం గత వారం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని, ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. మరో వైపు అభివృద్ధి అటకెక్కిందని, గ్యారంటీల అమలు కోసం నిధులు దారిమళ్లించడంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతికి సీఎం బాధ్యత వహించి రాజీనామా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతి కుంభకోణాన్ని ఖండిస్తూ శుక్రవారం అన్ని కలెక్టరేట్లను ముట్టడి చేపడుతామని తెలిపారు.

అధికారం దక్కలేదనే రాజ్యాంగ జపం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేష్ తదితరులు

కోలారు: కేంద్రంలో అధికారం వరుసగా పదేళ్లు దక్కలేదనే మళ్లీ కాంగ్రెస్ వారికి రాజ్యాంగ పుస్తకం జ్ఞాపకం వచ్చి చేతిలో పెట్టుకుని తిరుగుతున్నారని మాజీ మంత్రి మహేష్ ఎద్దేవా చేశారు. బుధవారం నగరంలోని సువర్ణ కన్నడ భవనంలో సామాజిక న్యాయం కోసం పౌర వేదిక తరఫున నిర్వహించిన ఎమెర్జెన్సీ-రాజ్యాంగ ఆశయాలకు అప ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ రక్షణ కోసం ఎన్నికల్లో బీజేపీని ఓడించండని కాంగ్రెస్ పిలుపు నిచ్చిందన్నారు. అయితే ఓటర్లు తిరిగి నరేంద్ర మోదీనే ప్రధానిని చేశారన్నారు. పార్లమెంట్ సమావేశాల మొదటి రోజునే సోనియా, రాహుల్ గాంధీ, ఇండియా కూటమి సభ్యులు గొడవ చేశారన్నారు. వీరికి ఎమెర్జెన్సీ నాటి రోజులు గుర్తు లేవా? అని ప్రశ్నించారు. దేశంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ పుస్తకాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే నన్నారు. ఎమెర్జెన్సీ సమయంలో 1.70 లక్షల మందిని అరెస్టు చేసి చీకట్లో బంధించారన్నారు. ఈ బాధను దేశ ప్రజలు ఇంకా మరువలేదన్నారు. రాజ్యాంగాన్ని పాలనా గ్రంథమని ప్రభుత్వం అంగీకరించిందని, ప్రజలు దీనిని విశ్వసించకుండా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను విశ్వసించడం విచారకరమన్నారు. ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వెంకటస్వామి పాల్గొన్నారు.

బాలుడు ఆత్మహత్య

క్రిష్ణగిరి: చదువుకోవాలని చెప్పడంతో బాలుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కురుబరపల్లి పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు కురుబరపల్లి సమీపంలోని చెన్నసంద్రం గ్రామానికి చెందిన మునిరత్నం కొడుకు రిషికుమార్ (16). పదవ తరగతి వరకు చదువుకొని ఇంట్లోనే ఉండేవాడు. రెండు రోజులుగా సూళగిరిలోని బేకరీలో పనికి వెళ్లసాగాడు. పనికి వెళ్లొద్దని, పై చదువులు చదవాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాలుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పైకప్పు కూలి ఒకరి మృతి

హుబ్లీ: చిత్రదుర్గ జిల్లాలో ఓ ఇంటి పైకప్పు కూలిన ఫలితంగా ఓ వ్యక్తి మరణించాడు. పైకప్పు సరి చేస్తున్న వేళ ఈ వ్యక్తి కింద పడి మృతి చెందిన ఘటన చెళ్లకెరె తాలూకా రామజోగిహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మురళీధర్(45) ఇంటి పైకప్పు మరమ్మతుల కోసం పైకి ఎక్కారు. ఆ సమయంలో పైకప్పు కూలడంతో కిందపడి మురళీధర్ దుర్మరణం పాలయ్యారు. ఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చోరీ సొత్తు కొనుగోలు ఆరోపణలపై ఇద్దరి అరెస్ట్

తుమకూరు: చోరీ సొత్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలపై జ్యువెలర్స్‌కు చెందిన ఇద్దరిని బుధవారం సాయంత్రం బెంగళూరులో కుణిగల్ డీఎస్పీ, తురువేకెరె సీఐ లోహిత్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ అశోక్ తెలిపారు. బెంగళూరు ఆనేకల్ తాలూకా జిగణికి చెందిన ఉదయ్ అనే నిందితుడు చోరీ చేసిన ఆభరణాలను శారద అనే మహిళ ద్వారా జ్యువెలర్స్ యజమానులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఘటనపై తురవేకెరె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు.

ఆడపిల్లలను రక్షించుకోవాలి

పావగడ: భ్రూణ హత్యలు, బాల్య వివాహాల నుంచి ఆడ పిల్లలను కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీడీపీఓ సునీత తెలిపారు. తాలూకాలోని దొడ్డహళ్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చెన్నపట్టణ ప్రగతికి భరోసా: డీసీఎం

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ తాలూకాలో నీటిపారుదల అభివృద్ధికి రూ.200 కోట్లు తీసుకువస్తానని, ఈసారి ఎమ్మెల్యే ఎవరు కావాలో మీరే నిర్ణయించాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. బుధవారం చెన్నపట్టణ తాలూకా బేవూరు గ్రామంలో జరిగిన జనస్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.150 కోట్ల నుండి రూ.200కోట్ల వరకూ స్పెషల్ గ్రాంట్ తీసుకువస్తానన్నారు. ఇప్పటికే ప్రతి రైతుకూ ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చామన్నారు. తనకు, ప్రజలకు మధ్య సంబంధం భగవంతుడు, భక్తుని మధ్య ఉన్న సంబంధం వంటిదన్నారు. తనను గెలిపించినా,ఓడించినా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. గతంలో హెచ్‌డీ కుమారస్వామి అధికారులను బానిసలుగా పిలిచారని, అయితే తాను మాత్రం అలా పిలవలేనన్నారు. ప్రభుత్వం పని దేవుని పనిలాంటిదన్నారు. తాను కూడా ఒక సేవకుడినే అన్నారు. చెన్నపట్టణలో అనేక సమస్యలు ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అన్ని సమస్యలూ జనస్పందన కార్యక్రమంలో పరిష్కరిస్తామన్నారు.

గనుల పునశ్చేతన పనులపై నిర్లక్ష్యమెందుకు ?


అధికారులతో సమావేశమైన సీఎం సిద్ధరామయ్య

యశవంతపుర/బనశంకరి: గనుల ప్రాంతాల్లో పరిసరాల పునశ్చేతన పనుల్లో జాప్యం జరుగుతోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గనుల శాఖ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోపు నివేదికను పూర్తి చేసి అందించాలని ఆదేశించారు. బుధవారం విధానసౌధలో కర్ణాటక గని, పరిసర పునశ్చేతన మండలి ప్రగతి పరిశీలన సమావేశం జరిగింది. కేఎంఈఆర్‌సీ ఆధ్వర్యంలోని గని ప్రాంతాలైన బళ్లారి, విజయనగర, చిత్రదుర్గ, తుమకూరు జిల్లాల్లో పరిసరాల సంరక్షణకు రూ.24,996 కోట్లు ఖర్చు చేయాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బీ.సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని సమితి సూచించింది. ఇందుకుగాను 358 పథకాలను తయారు చేసి ఇచ్చింది. ఇందులో రూ.3,469 కోట్లతో 182 పథకాలకు ఆమోదం లభించింది. 135 పథకాలకు సంబంధించి టెండర్లు పిలిచారు. 47 పనులకు ఆమోదం లభించింది. 23 పనులను పలు సంస్థలకు అప్పగించినట్లు అధికారులు సమావేశం దృష్టికి తెచ్చారు. సీఎం మాట్లాడుతూ మిగిలిన పథకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గనుల ప్రాంతంలో బడులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలినిరజనీశ్, అదనపు కార్యదర్శి ఎల్‌కే.అతీక్,కేవీ. త్రిలోక్‌చంద్ర పాల్గొన్నారు.

జంతుప్రదర్శన శాలలు జ్ఞానమందిరాలు

బనశంకరి: రాష్ట్రంలోని జంతుప్రదర్శన శాలలు(జూ) జ్ఞానమందిరాలు కావాలని అటవీ పరసరాల శాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే ఆకాంక్షించారు. బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలో దక్షిణ భారతదేశంలో తొలిసారిగా దేశంలోనే అతిపెద్ద చిరుత సఫారీతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. జంతుప్రదర్శనశాలకు వచ్చే పర్యాటకులు వన్యజీవులను వీక్షించి సంతోషపడతారని, ఆ సమయంలో వివిధ రకాల వృక్షాలను గుర్తించడంపై జాగృతం చేయాలన్నారు. బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలో 26 ఏనుగులు ఉండగా ఏటా రెండు మూడు ఏనుగుపిల్లలు జన్మిస్తాయన్నారు. ఏనుగు పిల్లలకు పాలు అందించే కేంద్రాన్ని రూ.10లక్షలతో ప్రారంభించామని తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలో స్కైవాక్‌ను కూడా నిర్మించామని, పర్యాటకులు ఇక్కడి నుంచి పక్షులను వీక్షించవచ్చునని తెలిపారు. రూ.1.5 కోట్లతో హంటింగ్ చీతా, రూ.1.5 కోట్లతో హమద్రియాస్, ఆలీవ్‌బాబూన్‌ను నిర్మిస్తామని మంత్రి తెలిపారు. కర్ణాటక జూ ప్రాధికార కార్యదర్శి డాక్టర్ సునీల్‌పన్వార్, బన్నేరుఘట్ట ఉద్యానవనం కార్యనిర్వాహక డైరెక్టర్ ఏవీ.సూర్యసేన్ పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ యతీశ్

మండ్య: దేశాభివృద్ధికి చోదకశక్తిగా మారాల్సిన యువత మత్తుకు బానిసవుతోందని, దీనికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ ఎన్.యతీశ్ పిలుపునిచ్చారు. అబ్కారీ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో పీఈఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించే క్రమంలో ముందుకు సాగాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలన్నారు.

కోలారు వార్తలు...

మత్తు పదార్థాల సేవనం ప్రమాదకరం


కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: యువత మత్తు పదార్థాలకు బానిస కారాదని, వాటి సేవనం ప్రమాదకరమనే విషయాన్ని యువత గుర్తించాలని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరాజ్ అరసు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతియేటా జూన్ 26న నిర్వహిస్తున్న ఈ దినోత్సవంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థలు మాదక ద్రవ్యాల సేవనం వల్ల కలిగే చెడు ప్రభావాల గురించి యువతను జాగృతం చేస్తున్నాయన్నారు. ఎస్పీ ఎం.నారాయణ మాట్లాడుతూ నేటి యువత లేట్ నైట్ పార్టీలంటూ తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక పట్ల తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. యుక్త వయస్సులోని పిల్లల కదలికలపై ఒక కన్నేసి ఉంచాలన్నారు. మాదక ద్రవ్యాల సేవనం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉండడం వల్ల ఇలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. డీఎస్పీ నాగ్తె, దేవరాజ అరస్ వైద్య మహా విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ప్రభాకర్, మనోశాస్త్ర విభాగం ప్రముఖుడు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ సజావుగా నిర్వహించండి


మాట్లాడుతున్న కలెక్టర్ అక్రంపాషా

కోలారు: నగరంలో ఈ నెల 30న నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హతా పరీక్ష(టెట్)ను సజావుగా నిర్వహించాలని జిల్లాధికారి అక్రంపాషా అధికారులకు సూచించారు. బుధవారం తన కార్యాలయ ప్రాంగణంలో టెట్ పరీక్ష నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలోని మొత్తం 14 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి నిషేధాజ్ఞలు జారీ చేయాలని ఆదేశించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతున్నప్పుడు 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేసే సమయంలోను, సమాధాన పత్రాలను ట్రెజరీకి తీసుకు వెళ్లే సమయంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు. సీఈఓ పద్మ బసవంతప్ప మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు సుస్థితిలో ఉండేలా చూసుకోవాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్, డీడీపీఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆక్షేపణలకు జూలై 10 వరకు గడువు

కోలారు: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమితి సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2024-25వ సంవత్సరం అవధికి ఎన్నికల ప్రక్రియను చేపట్టడానికి ఓటరు జాబితాను జులై 1వ తేదీన ప్రకటిస్తున్న నేపథ్యంలో జులై 10వ తేదీ వరకు ఆక్షేపణలు సమర్పించడానికి అవకాశం ఉంటుందని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

సంఘం బైలా నియమాలను అనుసరించి అర్హులుగా ఉన్న సంఘం సభ్యుల పేర్లతో కూడిన ఓటరు జాబితాను నిర్ణీత తేదీలోగా సిద్ధం చేసుకుని జాబితాను రాష్ట్ర సంఘానికి సమర్పిస్తామని తెలిపారు. అనంతరం కూడా సభ్యుల నుంచి ఆక్షేపణలు స్వీకరిస్తామని తెలిపారు.

కమలా హంపనా మృతి తీరని లోటు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: కమలా హంపనా మృతి సాహిత్య లోకానికి తీరని లోటు అని జిల్లా కసాప అధ్యక్షుడు ఎన్‌బీ గోపాలగౌడ తెలిపారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో తాలూకా కసాప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచయిత్రి కమలా హంపనా నుడి నమన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమలా హంపనా సాహిత్య పరిశోధన, విద్యా రంగానికి తనదైన సేవలు అందించారన్నారు. దేశ విదేశాల్లో కన్నడ సౌరభాన్ని ప్రసరించ జేసిన ఘనత కమలా హంపనాకు చెందుతుందన్నారు. ఆమె జీవితం, రచనలు యువ రచయితలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో తాలూకా కసాప అధ్యక్షురాలు పీఎస్ మంజుల, ఉపన్యాసకుడు ఎస్.వాసు, తాలూకా దళిత కసాప అధ్యక్షుడు జీకే నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే కరువు దూరం


మొక్కను నాటుతున్న దృశ్యం

కోలారు: కదంబ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవంలో భాగంగా రోజుకో మొక్కను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం సమాచార శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బీవీ చేతన్ కుమార్ మాట్లాడుతూ నీడను అందించే మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టడం హర్షణీయమన్నారు. రోజుకో మొక్కను నాటే కార్యక్రమం యేడాది పాటు పూర్తిగా కొనసాగించాలన్నారు. మన పరిసరాలు పచ్చదనంతో నిండితేనే వాతావరణం చక్కగా ఉంటుందన్నారు. సకాలంలో వానలు కురిసి కరువు కాటకాలు దరి చేరవన్నారు. పర్యావరణ సంరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచి పోషించాలన్నారు. ట్రస్టు సంస్థాపక అధ్యక్షురాలు ఆర్.నందిని, సిబ్బంది మంజేష్ పాల్గొన్నారు.

శ్రీ కంఠేశ్వరునికి రూ.1.69 కోట్ల కానుకలు

మైసూరు: దక్షిణ కాశీ నంజనగూడు శ్రీ కంఠేశ్వరునికి భక్తుల నుంచి సుమారు రూ. 1.69 కోట్ల ఆదాయం లభించింది. ఆలయ దాసోహ భవనంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. మొత్తం రూ. 1,69,69,867 మేర కానుకలు వచ్చాయి. 135 గ్రాముల బంగారం, 2 కేజీల 350 గ్రాముల వెండి, 23 విదేశీ కరెన్సీలు కూడా హుండీలో లభించాయి.

చదువుతోనే చక్కని భవిష్యత్


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించిన దృశ్యం

కోలారు: లక్ష్యం, శ్రద్ధతో చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎప్సన్ కంపెనీ అధ్యక్షుడు ఎస్.సాంబమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లాలోని 42,480 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.3.5 కోట్ల విలువ చేసే 2.35 లక్షల నోటు పుస్తకాలు, 12 వేల బ్యాగులు, 77 పాఠశాలలకు రక్షిత తాగునీటి ఫిల్టర్లు, 50 పాఠశాలలకు స్మార్ట్ క్లాస్‌లను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు, కలలను నెరవేర్చాలన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి సత్పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యాశాఖ డీడీపీఐ కృష్ణమూర్తి, ఎప్సన్ కంపెనీ అధికారి నవీన్‌శెట్టి, ఉపాధ్యాయ గౌరవర బళగ అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు వీరణ్ణగౌడ పాల్గొన్నారు.

జనతా దర్శన్‌తో సమస్యలకు చెక్


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే జీకె వెంకటశివారెడ్డి నేతృత్వంలో జనతా దర్శన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం తాలూకా స్థాయిలో జనతా దర్శన్‌ను నిర్వహిస్తోందన్నారు. ప్రజలు జనతా దర్శన్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి నెలా నిర్వహించే జనతా దర్శన్ వల్ల ప్రజల వివిధ రకాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రెవిన్యూ, ఖాతా, పోడి తదితర సమస్యలకు జనతా దర్శన్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శృంగేరి గ్రామ పంచాయతీ సభ్యుడి అరెస్ట్

యశవంతపుర: మైనర్ బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు అవాస్తవాలను ప్రచారం చేసిన శృంగేరి గ్రామ పంచాయతీ సభ్యుడు శబరీశ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. శృంగేరి పట్టణ పంచాయతీ సభ్యుడు హరీశ్‌శెట్టి మైనర్ బాలికపై లైంగిక దౌర్జన్యం చేసినట్లు నిందితుడు సామాజిక మాధ్యమాలలో పోస్టు పెట్టాడు. అయితే తనపై రాజకీయకక్షతో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నట్లు హరీష్ శెట్టి పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు శబరీష్‌ను అదుపులోకి తీసుకోగా అసలు విషయం బయట పడింది.

యువకుడు ఆత్మహత్య

యశవంతపుర: యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బంట్వాళ నరికోంబులో జరిగింది. సమీపంలోని శేఖర పూజారి రెండో కుమారుడు రమేశ్(22) విష పదార్థం తిని అనంతరం ఇంటి కిటికీ కడ్డీలకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలు తెలియరాలేదు. బంట్వాళ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు



స్తంభంపైనే స్పృహ కోల్పోయిన కార్మికుడు

శివమొగ్గ: విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈఘటన శివమొగ్గలో చోటు చేసుకుంది. కాశీపురలోని ఒక కొత్త భవనంలో షీటు వేస్తుండగా గణేశ్ (26), రాజు (32) అనే ఇద్దరు కార్మికులకు పక్కనే ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగలు తగులుకున్నాయి. దీంతో విద్యుదాఘాతం జరిగింది. గణేశ్ తలకు, రాజు ఎడమ చేతికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరిని ప్రైవేటు ఆస్పత్రికి, మరొకరిని మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు.

పని నుంచి తొలగించారని ఆత్మహత్య



కిరణ్(ఫైల్), సూసైడ్ నోట్

మైసూరు : తనను పని నుంచి తొలగించడంతో పాటు ఎక్కడా ఉద్యోగం రాకుండా చేశారనే ఆవేదనతో యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మైసూరు జిల్లా టి.నరసీపుర పట్టణంలో జరిగింది. చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకా బెరంబాడి గ్రామానికి చెందిన కిరణ్(28) టీ నరసీపురలోని సాయి గార్మెంట్స్‌లో పనిచేసేవాడు. టీ నరసీపురలోనే అద్దె గదిలో ఉండేవాడు. అయితే తనకు పని సరిగా రాదని క్వాలిటీ ఏజీఎం లోకేష్, హెచ్‌ఆర్, ఏజీఎం అనిల్‌లు తనను వేధించారని, పని నుంచి తీసివేశారని, మరో చోట తనకు ఉపాధి లభించకుండా ప్రచారం చేశారని ఆరోపిస్తూ లేఖ రాసి తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

బాల కార్మికులకు విముక్తి

మైసూరు : దుకాణాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను అధికారులు గుర్తించి వారికి విముక్తి కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా కార్మిక శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు బుధవారం నగరంలోని వివిధ దుకాణాల్లో తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ఐదుమంది బాలలు పనిచేస్తున్నట్లు గుర్తించి బాలల సంరక్షణ సమితి అధికారుల వద్దకు తీసుకెళ్లారు. వివరాలు సేకరించి తల్లిదండ్రులను పిలిపించి బాలలను అప్పగించారు. బాలలను పనుల్లోకి పంపవద్దని, బడికి పంపాలని సూచించారు. అదేవిధంగా బాలలను పనుల్లో పెట్టుకుంటే కఠిన శిక్షలు ఉంటాయని దుకాణ దారులను అధికారులు హెచ్చరించారు.

పర్యావరణ రక్షణ మనందరి కర్తవ్యం

గౌరిబిదనూరు : పర్యావరణ రక్షణ మనందరి కర్తవ్యం కావాలని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షురాలు, సాహితీవేత్త డాక్టర్ కే ప్రభానారాయణగౌడ అన్నారు. తాలూకాలోని హనుమంతపురం గ్రామంలో అంబేడ్కర్ రెసిడెన్సియల్ పాఠశాలలో ధర్మస్థల సంస్థ బుధవారం ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పర్యావరణం సమతుల్యత కోల్పోయి భూమి వేడెక్కి అకాల వర్షాలు, కరువు కాటకాలు సంభవిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మనం మేల్కొని పర్యావరణాన్ని రక్షించుకునేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ధర్మస్థల సంస్థ జ్ఞాన వికాస కేంద్రం అశ్విని, ప్రిన్సిపాల్ సంతోష్, నారాయణగౌడ, అన్నపూర్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కావేరి ఒడ్డున ఆధ్యాత్మిక పరవళ్లు

- తలకాడులో కొలువైన పంచలింగాలు
- ఐదు రూపాల్లో శివుడు
- ఇసుకలో కూరుకుపోతున్న శివాలయాలు
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న స్మారకాలు



మురుకేశ్వర ఆలయంలో శివలింగం



ఇసుకలో కూరుకుపోతున్న ఆలయం



కీర్తి నారాయణ ఆలయం

బనశంకరి: మైసూరు జిల్లా కావేరినది ఒడ్డున పంచముఖేశ్వర ఆలయాలకు నెలవైన తలకాడు గొప్ప పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. చోళులు, పల్లవులు, హొయ్సళులు, విజయనగర రాజుల కాలంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ తలకాడు ఇసుకతిన్నెలకు నెలవు. తలకాడులో కావేరినది చుట్టూ ఉన్న మట్టిని గమనిస్తే నదీతీరమా? సముద్ర తీరమా? అని అనిపించకమానదు. ఎన్నో స్మారకాలను తనలో ఇముడ్చుకున్న ఈ తలకాడును సందర్శించేందుకు దేశ విదేశాలనుంచి పర్యాటకులు ఎంతో ఇష్టపడుతుంటారు. తలకాడులోని పంచముఖేశ్వరస్వామి ఆలయం పేరుకు ఒకటే కానీ ఐదూ శివాలయాలే. తలకాడు చాలా చిన్న గ్రామం. కానీ పంచముఖ ఆలయాల కారణంగా ప్రసిద్ధి చెందింది. వైద్యనాథేశ్వర, పాతాళేశ్వర, మరుళేశ్వర, అరకేశ్వర, మల్లికార్జున స్వామి ఆలయాలు ఆధ్యాత్మికతను పంచుతాయి. బాధాకరమైన విషయం ఏమిటంటే ఏటా కొద్ది కొద్దిగా ఇవి ఇసుకలోకి కూరుకుపోతున్నాయి. వీటిని సంరక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోనే చెప్పుకోదగ్గ మరో ఆలయం విష్ణుభగవానుడి ఆలయం. దీనిని స్థానికులు కీర్తినాథేశ్వర ఆలయం అని పిలుస్తారు. ఇక్కడ ఉన్న పాతాళేశ్వర శివలింగానికి ఓ ప్రత్యేకత ఉంది. క్రీ.శ. 1004 వరకు పాలించిన గంగవంశ రాజుల కాలం నుంచి పాతాళేశ్వరాలయం ఆలయం ఉంది. కాలక్రమంలో ఇసుకతో కప్పబడింది. పురావస్తుశాఖ పరిశోధనలతో ఈ ఆలయం బయటపడింది. నేలమట్టం కన్నా చాలా లోతుగా ఉన్న ఈ ఆలయంలోని శివలింగం ఉదయం ఎరుపు, మధ్యాహ్నం నలుపు, సాయంత్రం తెలుపురంగులోకి మారుతూ దర్శనమిస్తుంది. తలకాడు పట్టణం ఒకప్పుడు ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. సుమారు 30 దేవాలయాలకు పైగా ఉండేవి. కానీ16 వ శతాబ్దం తర్వాత ఇది ఇసుక తిన్నెలుగా మారింది. ఒడయార్ల పాలనలో ఈ ప్రాంతం నాశనమైందని చెబుతారు. అయితే చరిత్రకారులు, స్థానికుల కథనాలు, ఊహల ప్రకారం ఈ ప్రాంత దేవత అలమేలు అమ్మవారి శాపం కారణంగా తలకాడు ఇసుకతో కప్పబడిందని చెబుతారు. అలమేలు అమ్మవారి నగలపై కన్నేసిన మైసూరు రాజు తలకాడుపై తన సైన్యంతో దాడిచేయగా ఆమె తన నగలను కావేరినదిలో పడేసి అక్కడే మునిగిపోయిందని, అమ్మవారు జల సమాధి అయ్యే ముందు తలకాడు ఇసుక దిబ్బగా మారిపోవాలని శపించిందని, మాలంగి ఒక సరస్సుగాను, మైసూరు రాజులు వారసులు లేకుండా పోతారని శపించినట్లు స్థానికుల కథనం.

తలకాడు కావేరినది పట్టణం గుండా ప్రవహిస్తూ ఒక అందమైన మలుపు తీసుకుంటుంది. ఇక్కడ ప్రకృతి మనోహరదృశ్యాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పంచలింగదర్శనం ఇక్కడ ప్రసిద్ధి. పంచలింగ దర్శనం కార్తీక పౌర్ణమి రోజున రెండు నక్షత్రాలు ఖుహ యోగ మరియు విశాఖ కలిసినప్పుడు ఏర్పడుతుంది. తలకాడు చుట్టుపక్కల సోమనాథపూర్, శివసముద్రం, మైసూరు, శ్రీరంగపట్టణం, రంగనతిట్టు, బండీపుర జాతీయ ఉద్యానవనం ఆకర్షణీయమైన ప్రదేశాలు.

మురుశేశ్వర ఆలయం

కీర్తినారాయణ ఆలయానికి ఉత్తరాన అరమైలు దూరంలో మరుశేశ్వర ఆలయం ఉంది. ఇక్కడ భారీ శివలింగాన్ని బ్రహ్మదేవుడు ప్రతిష్టించి పూజలు చేశారని చెబుతారు. ముఖ మండపంలో మహేశ్వరుడు, తిరుమల్, అంబిగై, సూర్యుడు, గణపతి, షణ్ముగర్ విగ్రహాలు కొలువు దీరాయి.

ఆర్కేశ్వర ఆలయం...

ఈ ఆలయం వైవిధ్యంగా ఉంటుంది. ఆర్కేశ్వర ఆలయానికి సమీపంలో కొట్టెవినాయగర్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో భైరవర్, దుర్గై, అభయంగర లింగం విగ్రహాలు ఉన్నాయి. ప్రవేశ ద్వారం వద్ద వాస్తు యంత్రంతో కూడిన శిల ఉంది.



పాతాళేశ్వర ఆలయం



కావేరినది ప్రవాహం

మల్లికార్జున ఆలయం....

ముదుకుతురైలోని మల్లికార్జున ఆలయంలో కొలువైన స్వామి ఒక చిన్న శివలింగం. మల్లికార్జున స్వామి, అమ్మవారు భ్రమ్మరాంబిగా దర్శనమిస్తారు. లింగంపై కామధేనుడి పాదాల గుర్తులు కనిపిస్తాయి. వైద్య నాథ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మండపంలో పంచ లింగాలను పూజించవచ్చు . చాముండేశ్వరి, వీరభద్ర, సంధ్యా గణపతి, వీర ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉన్నాయి.

తలకాడు మైసూరు జిల్లా మైసూరు నగరానికి 43 కిలోమీటర్లు, బెంగళూరు నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. బెంగళూరు నుంచి మైసూరుకు రైలు, బస్సుసౌకర్యం అందుబాటులో ఉంది.



కీర్తినారాయణ ఆలయంలో కొలువైన విష్ణువు



వైద్యనాథేశ్వర ఆలయంలో పార్వతీ అమ్మవారు

బైక్‌ల ప్రమాదాల్లో ముగ్గురు మృతి

మైసూరు: రాచనగరి పరిధిలో మూడు వేర్వేరు బైక్ ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. మైసూరు బిదరహళ్లి నివాసి చేతన్ (22), అభి అనే వ్యక్తులు పని నిమిత్తం బైక్‌లో బన్నూరుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా బీదరహళ్లి గేట్ వద్ద వేగంగా వచ్చిన గూడ్స్ వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టింది. చేతన్ తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మరణించాడు.

- ఇక రెండో ఘటనలో ఇలవాల నివాసి కృష్ణ (55) తన కుమారుడు సంజయ్‌తో కలసి ఇలవాల ప్రధాన రోడ్డు యాత్రిక్ హోటల్ వద్ద వాకింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో హుణసూరు నుంచి వేగంగా వచ్చిన బైక్ కృష్ణను ఢీ కొట్టి వెళ్లిపోయింది. గాయపడిన కృష్ణను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది.
- మైసూరు యరగనహళ్లి డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులో ఓ యాక్సిడెంటు జరిగింది. శాంతినగర నివాసి మహమ్మద్ ఇర్ఫాన్ (19) తన స్నేహితుడు సాహిల్‌తో కలసి కేఈబీ జంక్షన్ నుంచి త్రివేణి సర్కిల్‌వైపుగా బైక్‌లో వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటో వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఇర్ఫాన్ తలకు తీవ్ర గాయమై అక్కడే మరణించాడు. సాహిల్, ఆటో డ్రైవర్ సిద్ధప్పాజీ గాయపడ్డారు. వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదాలపై స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యూట్యూబర్ ....

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో యూట్యూబర్ మృతిచెందిన ఘటన దొడ్డ బళ్లాపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తేజస్ అనే యువకుడు సోషల్ మీడియాలో విభిన్న వీడియోలతో జనాదరణ పొందాడు. ఇతను స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా బెంగళూరు-దొడ్డబళ్లాపుర మార్గంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ప్రమాదంలో తేజస్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుక కూర్చున్న స్నేహితుడు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. దొడ్డబళ్లాపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి కాలేదని ఆత్మహత్య

యశవంతపుర: పెళ్లి కాలేదనే ఆవేదనతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకా కస్తూర్బా నగర్‌లో జరిగింది. ఇబ్రహీంబాషాసాబ్ మల్లక్కనవర(25) ఓ వివాహితను ప్రేమించాడు. ఆమెకు భర్త నుంచి విడాకులు తీసుకునే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. దీంతో తనకు పెళ్లికాదనే బాధతో ఇబ్రహీం సాబ్ తన ఇంటిలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

త్రిపుర నుంచి బెంగళూరుకు గంజాయి

- గుట్టు రట్టు చేసిన రైల్వే పోలీసులు
- 32.88 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి విక్రేతతో రైల్వే పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయి

బనశంకరి: త్రిపుర నుంచి భారీ ఎత్తున కర్ణాటకకు సాగుతున్న గంజాయి రవాణా గుట్టు రట్టయ్యింది. రైలులో తరలిస్తున్న 32.88 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్పీ సౌమ్యలత తెలిపారు. బుధవారం ఆమె బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. త్రిపుర పాండబ్బుర నివాసి దీపన్‌దాస్(20)అనే యువకుడు త్రిపురలోని అగర్తల నుంచి బెంగళూరుకు గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందిందన్నారు. అగర్తల -బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుడు రైల్వేలో కాంట్రాక్టు ప్రాతిపదికన బెడ్‌రోలర్ పనులు చేస్తూ త్రిపుర నివాసి సుమన్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి దానిని కిట్‌బ్యాగుల్లో ఉంచి రైలులో బెంగళూరుకు సరఫరా చేస్తున్నాడని విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. మరో ముగ్గురు ఈ దందాలో పాల్గొని తప్పించుకున్నారని, వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు. నిందితుడిపై బయప్పనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ లక్షల రూపాయల విలువ చేస్తుందని ఎస్పీ తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

మైసూరు : నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండి మొహల్లాలోని ఎంకేడీకే రోడ్డులో ప్లాస్టిక్ కవర్‌లో గంజాయి పెట్టుకొని విక్రయించడానికి వచ్చిన అర్షద్‌పాషాను మండి పోలీసులు అరెస్ట్ చేసి వేలాది రూపాయల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సాతగళ్లి బస్ డిపో వెనుక గంజాయి విక్రయిస్తున్న బన్ని మంటపకు చెందిన మహ్మద్ జైద్ అనే యువకుడిని ఉదయగిరి పోలీసులు అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

స్థానికంగానే పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శుభకల్యాణ్

తుమకూరు: ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే గ్రామ లెక్కాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిష్కరించాలని జిల్లాధికారి శుభకల్యాణ్ సూచించారు. జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో తురువెకెరె పట్టణం శ్రీ సత్యగణపతి ఆస్థాన మంటపంలో బుధవారం ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి జనస్పందన కార్యక్రమంలో జిల్లాధికారి పాల్గొని మాట్లాడారు. ఫిర్యాదులు అర్హమైనవా కాదా అని పరిశీలించి 15రోజుల్లోగానే పరిష్కరించాలని సూచించారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు జిల్లా కేంద్రానికి తరలివస్తున్నారని తెలిపారు.

మాదకద్రవ్యాల వ్యసనం నేరాలకు ఊతం



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్, డీజీపీ అలోక్‌మోహన్



రూ.42 కోట్ల విలువచేసే డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న పోలీసులు

- డ్రగ్స్ రహిత రాష్ట్రమే ప్రభుత్వ ధ్యేయం
- హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

బనశంకరి: మాదక ద్రవ్యాల వ్యసనంతో నేరాలు పెరుగుతున్నాయని, ఈ నేరాల్లో యువకులే ఎక్కువగా ఉంటున్నారని హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర్ అన్నారు. కంఠీరవ స్టేడియంలో రాష్ట్ర పోలీస్‌శాఖ, వివిధ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని హోం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. డ్రగ్స్ వ్యసనం యువతను నిర్వీర్యం చేస్తోందన్నారు. హత్య కేసుల్లో నిందితులు ఎక్కువగా 17 నుంచి 20 సంవత్సరాల మధ్య వయసున్న వారే ఉన్నారని, వీరిలో చాలా మంది డ్రగ్స్‌కు బానిసలైనట్లు విచారణలో తేలిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘాపెట్టాలన్నారు. మాదకద్రవ్యాలతో తలెత్తే దుష్పరిణామాలపై గురించి జాగృతం చేయాలని పోలీస్‌శాఖకు సూచించారు. డ్రగ్స్ రహిత కర్ణాటక నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపిందన్నారు. రూ.40 కోట్ల విలువచేసే డ్రగ్స్ నాశనం చేశామని, 10 టన్నుల గంజాయి కాల్చివేశామన్నారు. డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని, ఐటీ కంపెనీలు, పరిశ్రమలు డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలని కోరారు. నగర పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో డీజీపీ అలోక్‌మోహన్, సీఐడీ విభాగ డీజీపీ డాక్టర్ ఎంఏ.సలీం, ఏడీజీపీ ప్రణబ్ మొహంతి తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ పోటీ దారుడు సంతోష్‌పై మరో కేసు

యశవంతపుర: మెడలో పులి గోరు ధరించి జైలుపాలైన బిగ్‌బాస్ పోటీదారుడు వత్తూరు సంతోష్‌ను మరో వివాదం చుట్టుముట్టింది. అవులను అసురక్షితంగా రవాణా చేసినట్లు ప్రాణి కల్యాణాధికారి హరీశ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వత్తూరు సంతోష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సంతోష్ హళ్లికార్ రేస్ చేయటానికి ట్రక్‌లో 9 కోడెలను రవాణా చేసినట్లు ఆ అధికారి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీఎం మాట తప్పారు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విశ్వనాథ్

మైసూరు: ప్రజలపై ధరల పెంపు భారం మోపనని ఎన్నికలకు ముందు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన సిద్దరామయ్య ఆ తర్వాత అన్ని నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ మాట తప్పుతున్నారని ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్ ఆరోపించారు. బుధవారం మైసూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గ్యారెంటీ పథకాల అమలు కోసం అవసరమైన నిధుల కోసం నిత్యావసర వస్తువుల ధరలు పెంచబోనని ఎన్నికల ముందు సిద్దరామయ్య హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ మాటను మరచి ప్రజలను మోసగిస్తూ ఒక్కొక్కటిగా ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్నారని విశ్వనాథ్ విమర్శించారు. ఇంట్లో కాఫీ, టీ తాగినా జీఎస్టీ కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు.

పుస్తక పఠనంతో జ్ఞానార్జన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకొని గ్రంథాలయాలకు వెళ్లి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల సభాభవనంలో జరుగుతున్న 2023–24 సంవత్సర సాంస్కృతిక, క్రీడ, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాల ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. మహనీయుల జీవితాలపై అవగాహన పెంపొందించుకొని స్ఫూర్తి పొందవచ్చన్నారు. మరో అతిథి భీరమంగల రామేగౌడ మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ చదివింది టెన్త్ అయినా విశ్వ వ్యాప్తంగా రాణించారని ఉదహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ చంద్ర దత్త, నేషనల్ కళాశాల అధ్యక్షుడు నాగరాజప్ప, మంజునాథ్, రంగనాథ్, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

మహిళకు రూ. 13.34 లక్షలు టోపీ

హోసూరు: పెట్టుబడికి అధిక లాభం అందజేస్తామని నమ్మించి మహిళ నుంచి రూ. 13.34 లక్షలు వసూలు చేశారు. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ మూకొండపలిల ప్రాంతానికి చెందిన శ్రీనిధి (26) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిని, గత ఫిబ్రవరి నెలలో ఆమె సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌పై సంప్రదించింది. పెట్టుబడి ద్వారా అధిక లాభం పొందవచ్చునని కొందరు వ్యక్తులు సూచించడంతో, ఆమె రూ. 13.34 లక్షల నగదును జమ చేసింది. ఇంతవరకూ డబ్బులు రాకపోవడంతో వారికి కాల్ చేయగా స్విచాఫ్ వచ్చింది. మోసపోయినట్లు తెలుసుకుని ఆమె క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లారీపై చెట్టు కూలి ఇద్దరు మృతి



సెప్టిక్ ట్యాంకర్‌పై కూలిన చెట్టు

హోసూరు: హోసూరు సమీపంలో ఆలయం వద్ద నిలిపి ఉన్న సెప్టిక్ ట్యాంకర్ లారీపై మర్రిచెట్టు కూలి ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాల మేరకు హోసూరు సమీపంలోని పాళ్యం గ్రామానికి చెందిన మారప్ప, వెంకటేష్‌లు బుధవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్ లారీని తీసుకొని మత్తిగిరి సమీపంలోని యడేనల్లూరు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్దకెళ్లారు. ఈ సమయంలో ఆలయం వద్ద ఉన్న వందల నాటి మర్రిచెట్టు ఆకస్మాత్తుగా లారీపై కూలింది. అందులో ఉన్న మారప్ప, వెంకటేష్‌లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మత్తిగిరి పోలీసులు చేరుకొని చెట్టును కత్తిరించి శవాలను బయటకు తీసి హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేరు లేకున్నా బాధలేదు: కుమార

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ జయంతి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలో తన పేరు లేకపోవడం గురించి తాను పట్టించుకోనని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కెంపేగౌడ ఎవరి సొత్తు కాదన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న కెంపేగౌడ జయంతి కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవేగౌడ, తన పేరు వేయలేదన్నారు. అయితే ఇదేమంత పెద్ద విషయం కాదన్నారు. బెంగళూరు నగరం ఇంతగా అభివృద్ధి చెందడం వెనుక కెంపేగౌడ కష్టం ఉందన్నారు. ఆయన నిర్మించిన ఎన్నో చెరువులు ఇప్పుడు మాయమయ్యాయని, ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఆ చెరువులను రక్షించాలని కుమారస్వామి సూచించారు.

కంది రైతులకు నగదు సాయం

హోసూరు: కంది సాగు చేసే రైతులకు వ్యవసాయ శాఖ రాయితీలు కల్పిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి పేర్కొన్నారు. కంది మొక్కలు నాటే రైతులకు ఎకరాకు 1.5 కిలోల విత్తనం సరిపోతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో విత్తనాలను అందిస్తామన్నారు. అలాగే ఉచిత మందులు, దుక్కి చేసేందుకు ఎకరాకు రూ.2500 నగదు అందజేస్తామని, కందిసాగుతో పాటు అంతర్ పంటలు వేసే రైతులకు అదనంగా ఎకరాకు రూ. 2500 రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిరుతపులి దాడి

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని ఇస్లాంపురం, అడవీస్వామీపురం, తంగ్రి, కొరటగిరి తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో గత ఆరు నెలలుగా చిరుత సంచరిస్తూ వీధికుక్కలను, గొర్రెలను, మేకలను బలితీసుకొంటుంది. మంగళవారం రాత్రి అడవీ స్వామిపురం గ్రామంలో చెందిన రైతు మునిరాజ్ కొట్టంలో కట్టేసిన గొర్రెలపై దాడి చేసి ఒక గొర్రెను చంపింది. మునిరాజ్, కుటుంబసభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చిరుత పరారైంది. అటవీ శాఖాధికారి దేవానత్తం, సింగారవేల్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుతను త్వరలో బంధిస్తామని, ఈ ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

గ్రామదేవతల ఉత్సవాలు



గ్రామదేవతల ఉత్సవమూర్తులు

హోసూరు: డెంకణీకోట తాలూకా కొత్తాళం గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామదేవతల ఊరేగింపు ఘనంగా జరిగింది. గెరిగమ్మ, మదనగిరి మునేశ్వరస్వామి, ముత్తప్ప, వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, బసవేశ్వరస్వామి, మురగన్ తదితర దేవతామూర్తులను అలంకరించి పూజలు చేశారు. కొత్తాళం, పచ్చపనట్టి, బిదిరెడ్డి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ధ్రువసర్జా పరామర్శ

దొడ్డబళ్లాపురం: దర్శన్ అండ్ గ్యాంగ్ చేతిలో హత్యకు గురైన రేణుకాస్వామి కుటుంబాన్ని హీరో ధ్రువసర్జా పరామర్శించారు. ఈమేరకు బుధవారం ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మీకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. గతంలో అర్జున్ సర్జాకు దర్శన్‌కు మధ్య ఒక సినిమాకు సంబంధించి వివాదం ఏర్పడింది. అర్జున్‌సర్జా పట్ల దర్శన్ అనుచితంగా ప్రవర్తించాడని, అప్పటి నుంచి ధ్రువ సర్జా దర్శన్‌పై కోపంగా ఉన్నాడు.

పిన్నెల్లి అరెస్టు

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి/సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లర్లకు సంబంధించి ఆయనపై నమోదు చేసిన కేసుల్లో అరెస్టు చేశారు. పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గంలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేశారన్న అభియోగంతోపాటు మరో మూడు ఘటనలకు సంబంధించి పోలీసులు ఆయనపై కేసులు నమోదు చేశారు. ఈ నాలుగు కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అనంతరం మధ్యంతర ముందస్తు బెయిల్ కోరుతూ అనుబంధ పిటిషన్లు వేశారు. వీటిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారణ జరిపారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై గత వారం విచారణ జరిపిన న్యాయమూర్తి, బుధవారం ఆ పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. ఆ వెంటనే పోలీసులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు అతిథి



పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం వద్దకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

గృహంలో ఉంటున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేశారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలించారు. రాత్రి 8 గంటల సమయంలో నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం తిరిగి పల్నాడు ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ముందు జాగ్రత్తగా ఎస్పీ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి మీడియా ప్రతినిధులతో సహా ఎవర్నీ అనుమతించలేదు. పిన్నెల్లిని అర్ధరాత్రి దాటిన తర్వాత మాచర్ల కోర్టుకు తరలించి, అక్కడ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలో మాచర్ల పట్టణాన్ని కూడా పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. కోర్టు పరిసరాల్లో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు.

గత నెల 28 నుంచి నరసరావుపేటలోనే

పోలింగ్ రోజు, మరుసటి రోజు టీడీపీ నేతలు చేస్తున్న దౌర్జన్యాలను అడ్డుకునేందుకు పాల్వాయి గేట్ పోలింగ్ బూత్, కారంపూడికి వెళ్లిన పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. తనపై అక్రమంగా కేసులు నమోదు చేశారని, అరెస్ట్ నుంచి ఉపశమనం కల్పించమని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 28న ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాలను పాటిస్తూ ఆరోజు నుంచి ఆయన నరసరావుపేటలోనే ఉంటున్నారు.

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వారికి శిక్ష తప్పదు: ఈసీఐ

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని భారత ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకు మాచర్ల మాజీ శాసన సభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఉదంతమే నిదర్శనమని తెలిపింది. భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడరని ఆశాభావం వ్యక్తం చేసింది. పిన్నెల్లి అరెస్టుతో ఆదర్శప్రాయమైన చర్యకు తార్కిక ముగింపు లభించిందని ఈసీఐ పేర్కొంది.

ఆర్బీకే శిలాఫలకం ధ్వంసం



తుమ్మగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం



అప్పేచర్ల సచివాలయంపై నవరత్నాల బోర్డును ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రగతి పనులకు సంబంధించిన శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేస్తూనే ఉన్నారు. మంగళవారం రాత్రి ఏలూరు జిల్లా చాట్రాయి మండలం తుమ్మగూడెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ శిలాఫలకంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో, పేరు, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, స్థానిక ప్రజాప్రతినిధులు పేర్లు ఉండటంతో వాటిని ధ్వంసం చేశారు.

సచివాలయంలో నవరత్నాల బోర్డు ధ్వంసం

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం అప్పేచర్లలో టీడీపీ నేతలు బుధవారం రెచ్చిపోయారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన నవరత్నాల ప్రదర్శన బోర్డును ధ్వంసం చేశారు. సచివాలయ సిబ్బంది వారిస్తున్నా వినకుండా వారిపై దౌర్జన్యానికి దిగారు. కార్యాలయం ఎదుటనే పోలీసుల పికెట్ ఉన్నా దుశ్చర్యకు పాల్పడ్డారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఫిర్యాదు మేరకు శంకర్‌నాయుడు, శరత్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

క్లుప్తంగా...

ఎస్టీ కాలనీలో ఇళ్లు కూల్చివేత

20 కుటుంబాలు నిరాశ్రయం



కూల్చివేసిన ఇళ్ల వద్ద బాధితులు

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం మంగంపేట కాపుపల్లె ఎస్టీ కాలనీలో ఇళ్లను రెవెన్యూ, ఎంపీఎండీసీ అధికారులు బుధవారం జేసీబీలతో తొలగించారు. బాధితుల కథనం ప్రకారం.. 2008లో 20 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో వారంతా ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ ఇళ్లను ఏపీఎండీసీ అధికారులు ఎటువంటి పరిహారం చెల్లించకుండా యంత్రాల సాయంతో తొలగించారు. నిరాశ్రయులైన 20 కుటుంబాల వారు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై సీపీఓ సుదర్శన్‌రెడ్డిని వివరణ కోరగా.. సంబంధిత సర్వే నంబర్లలో అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించినందున రెవెన్యూ శాఖ అధికారులతో పరిశీలన జరిపించి తొలగించామన్నారు.

గుడివాడలో టీడీపీ నేతల దుర్మార్గం

గుడివాడ రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ నాయకుడు దాడి చేసిన ఘటన గుడివాడలో బుధవారం చోటుచేసుకుంది. గుడివాడకు చెందిన డాక్యుమెంట్ రైటర్ చంద్రాల హరిరాంబాబు వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. వారం క్రితం టీడీపీకి చెందిన కొందరు నాయకులు రాంబాబు వద్దకు వెళ్లి మాజీ మంత్రి కొడాలి నానికి సంబంధించిన ఆస్తులు, బినామీ ఆస్తుల వివరాలు చెప్పాలంటూ ఆయనపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటనను మరో మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ పత్రికాముఖంగా ఖండించారు. ఈ నేపథ్యంలో హరి రాంబాబు బుధవారం తన షాపులో ఉండగా గుడివాడ మండలం వలివర్తిపాడు గ్రామానికి చెందిన మాజీ రౌడీషీటర్, టీడీపీ నాయకుడు డొక్కుమాల శ్రీకాంత్ (38) వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడు. అనంతరం హరిరాంబాబుపై విచక్షణా రహితంగా దాడి చేశారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు. చంద్రాల హరిరాంబాబు చేసిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకుడిపై టీడీపీ నేతల దాడి



గాయపడిన నాగాంజనేయులు

ఒంగోలు టౌన్: వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు పేరకం నాగాంజనేయులుపై టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు దాడి చేసిన ఘటన ఒంగోలు ముంగమూరు డొంకలో బుధవారం జరిగింది. ఆర్యవైశ్య ప్రముఖుడు, పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడైన నాగాంజనేయులు వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఉదయం 10గంటలకు సమీపంలోని షటిల్ కోర్టు వద్దకు మంచినీళ్లు తీసుకు రమ్మని టీడీపీ నాయకుడు బోడేపూడి శివప్రసాద్ ఫోన్ చేసి చెప్పగా.. అందుకు కుర్రోళ్లు అందుబాటులో లేరని బదులిచ్చారు. కొద్దిసేపటికే శివప్రసాద్, టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు కొప్పురావూరి సురేష్, చీదెళ్ల యశ్వంత్, పల్లబోతు నాని మరో ముగ్గురితో కలిసి వాటర్ ప్లాంట్‌కు వెళ్లారు. నువ్వు దామచర్ల జనార్దన్‌ను తిడతావా.. అంటూ నాగాంజనేయులుపై దాడికి పాల్పడ్డారు. పొట్టి శ్రీరాములు స్వగ్రామం పడమరపల్లెలో అమరజీవి ఇంటి పునర్నిర్మాణం విషయంలో దామచర్ల జనార్దన్‌తో ఏర్పడిన వివాదం నేపథ్యంలోనే ఈ దాడి జరిగినట్టు చెబుతున్నారు.

ఆర్యవైశ్యులపై టీడీపీ దాడులు దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్



ఒంగోలు టౌన్: చంద్రబాబు సీఎం అయ్యాక ఆర్యవైశ్యులపై దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్యవైశ్యులపై దాడులు చేయించడానికే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారా అని నిలదీశారు. ఒంగోలులో పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులుపై టీడీపీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండించారు. గడచిన 10 రోజుల్లో ఆర్యవైశ్యులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశాడన్న నెపంతో పువ్వాడ భాస్కర్ అనే ఆర్యవైశ్యుడిపై దాడి చేశారని, రోడ్ల మీద పరిగెత్తించి మరీ కొట్టారని తెలిపారు. చీరాలలో కర్రీ పాయింట్ నిర్వహించే కంచర్ల సతీష్‌పై దాడి చేసి కత్తితో పొడిచారన్నారు. ఆర్యవైశ్యుల సంస్థలను బెదిరించి లాగేసుకుంటున్నారని వాపోయారు. ఎలాంటి తప్పు జరిగినా తాను ప్రశ్నిస్తానని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో ఆర్యవైశ్యులపై దాడుల గురించి ఎందుకు ప్రశ్నించడం లేదో అర్థం కావడం లేదన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులపై టీడీపీ నేత దాదాగిరి

పనులు సాగాలంటే రూ.30 కోట్లు ఇవ్వాలంటూ బెదిరింపులు

- కమీషన్ ముట్టజెప్పేంతవరకూ పనులు చేపట్టొద్దు
- పులివెందులకు చెందిన కీలక నేత హుకుం
- తమకు ముడుపులు ఇవ్వకపోవడంతో వేల్పుల వద్ద పనుల అడ్డగింత
- గతంలో ఇలాంటిదే జరిగితే వెంటనే స్పందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, కడప: అధికారం వచ్చిందే తడవుగా టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారు. అభివృద్ధి పనుల్లోనూ అందినకాడికి దండుకుంటున్నారు. పనులు చేస్తోంది.. జాతీయ స్థాయి సంస్థలైనా సరే తమకేంటన్నట్టు చెలరేగుతున్నారు. తాజాగా వివిధ రాష్ట్రాల్లో కాంట్రాక్టు పనులు చేస్తున్న దిలీప్ దిల్కాన్ సంస్థకు తాజాగా ఇలాంటి దుస్థితే వైఎస్సార్ జిల్లాలో ఎదురైంది. టీడీపీ నాయకుల దాదాగిరితో రోడ్డు పనులు నిలిపేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కొడికొండ చెక్‌పోస్టు నుంచి విజయవాడకు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు మంజూరైంది. అందులో మూడు ప్యాకేజీల పనులు దిలీప్ దిల్కాన్ సంస్థకు దక్కాయి. మరో మూడు ప్యాకేజీలు మెగా కంపెనీకి లభించాయి. ఈ క్రమంలో వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో రూ.700 కోట్లతో ఒక ప్యాకేజీ పనులను దిలీప్ దిల్కాన్ సంస్థ చేపట్టింది. ఇంతకాలం ఆ పనులు శరవేగంగా కొనసాగించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న దౌర్జన్యకర పరిస్థితులు ఆ సంస్థకు కూడా ఎదురయ్యాయి. వేల్పుల గ్రామం వద్ద చేపడుతున్న పనుల వద్దకు వేముల మండలంలో క్రియాశీలకంగా వ్యవహరించే టీడీపీ నేత వెళ్లారు. పనులు నిలిపేయాలని, లేదంటే వెంటనే మీ జీఎంను వచ్చి కలవమని చెప్పండంటూ హుకుం జారీ చేశారు. దీంతో ఆ సంస్థ పర్సనల్ ఇన్‌చార్జి వచ్చి ఆ నాయకుడితో సమావేశమయ్యారు. ఈ మొత్తం వ్యవహారం మూడు రోజుల క్రితం నడిచినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ కీలక నాయకుడితో సదరు నేత ఫోన్‌లో మాట్లాడించారు. మీ పనులు సజావుగా కొనసాగాలంటే రూ.30 కోట్లు తనకు చెల్లించాలని ఆ కీలక నాయకుడు డిమాండ్ చేశారు. 'ఎన్నికల్లో ఖర్చులు పెట్టుకున్నాం, మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తనకు రూ.30 కోట్లు చెల్లిస్తేనే పనులు కొనసాగుతాయి' అని తేల్చిచెప్పారు. మూడు రోజుల్లోగా మీ నిర్ణయం ఏంటో చెప్పాలని వేముల మండల నాయకుడు సంస్థ ప్రతినిధిని హెచ్చరించాడు.

పనులను నిలిపేయించిన టీడీపీ నేతలు..

దిలీప్ దిల్కాన్ సంస్థకు చెందిన పనులను బుధవారం సాయంత్రం వేముల మండలం వేల్పుల గ్రామం వద్ద టీడీపీ నేతలు నిలిపేశారు. ప్రశ్నించిన సంస్థ ప్రతినిధులకు మీకు ఇచ్చిన గడువు ముగిసిందని, మీ నుంచి ఎలాంటి నిర్ణయం రాలేదు కాబట్టే పనులు నిలిపేస్తున్నామని దాదాగిరి చేశారు. తమకు రూ.30 కోట్లు ఇచ్చేవరకు పనులు చేపట్టవద్దని హెచ్చరించారు. జిల్లాలో ఇదివరకు ఇలాంటి ఘటన చక్రాయపేట కేంద్రంగా ఓ సంస్థకు ఉత్పన్నమైతే అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కాంట్రాక్టు సంస్థలకు ఆటంకాలు లేకుండా సత్వర చర్యలు చేపట్టింది.

బెదిరింపులతో టీడీపీ నేతల స్వైరవిహారం..

టీడీపీ అధికారంలోకి రావడం ఆలస్యం వ్యక్తుల ఆస్తులు, వ్యాపారాలను చేజిక్కించుకునేందుకు ఆ పార్టీ నేతలు బరితెగిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో ఓ వ్యాపారికి చెందిన రెండు మద్యం బార్‌లను తమకు అప్పగించాలని టీడీపీ నేతలు బెదిరించారు. అలాగే వేంపల్లె కేంద్రంగా పోటాపోటీగా పొక్లెయిన్లు పెట్టి టిప్పర్లతో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతలు ఇసుక దోపిడీ చేస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ఆయా వ్యక్తులకు చెందిన ప్రైవేటు స్థలాలను సైతం కబ్జా చేస్తున్నారు. కోర్టులో ఉన్న వ్యవహారాల్లో సైతం తలదూర్చి సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది. మునుపెన్నడూ ఇలాంటి అధ్వాన పరిస్థితులు చూడలేదని పాతతరం టీడీపీ నాయకులు సైతం వాపోతుండటం గమనార్హం.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- న్యాయస్థానాలు సుమోటాగా బాధితులకు న్యాయం చేయాలి
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ: టీడీపీ, జనసేన కూటమి పాలనలో పోలీస్, రెవెన్యూ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు అధికారం ఇచ్చింది ఇష్టారాజ్యంగా పరిపాలన చేసుకోవటానికి కాదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలనే కుట్ర పన్నుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, వారి ఆత్మస్థైర్యాన్ని, మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. పోలీసులు, రెవెన్యూ దృష్టికి కూటమి నేతల అరాచకాలు తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడితే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఆస్తులపై జరిగిన దాడులను కోర్టులు సుమోటాగా స్వీకరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనగాని ఇలాకాలో ఆగని విధ్వంసం

- వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా దాడులు
- తాజాగా విలేకరి ఇల్లు కూల్చివేసిన టీడీపీ నేతలు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



కస్తూరివారిపేటలో కూల్చివేసిన వెంకటేశ్వరరావు ఇల్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకా రేపల్లెలో టీడీపీ నేతల విధ్వంసం పతాక స్థాయికి చేరింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. దొరికిన వారిని దొరికినట్లు విచక్షణారహితంగా చితక బాదుతున్నారు. ఊళ్లు వదలి వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో ఉంటే అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. అధికారం అండతో కూటమి నేతలు, ప్రధానంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి దాడులకు తెగబడుతుండటంతో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఇప్పటికే గ్రామాలు వదిలి వెళ్లారు. కొందరు స్వగ్రామాల్లోనే ఉంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకు తున్నారు. ఏ సమయంలో టీడీపీ నాయకులు దాడి చేస్తారో తెలియక బెంబేలెత్తిపోతున్నారు. చెరుకుపల్లి, నిజాంపట్నం, నగరం మండలాల పరిధిలో ఈ తరహా దాడులు పెరిగాయి.

విలేకరి ఇల్లు కూల్చివేత

చెరుకుపల్లి మండలం కస్తూరివారిపేటలో బుధవారం ఉదయం టీడీపీ నేతలు గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ విలేకరి యెనుముల వెంకటేశ్వరరావుకు చెందిన ఇంటిని కూల్చివేశారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ల క్రితం 4 సెంట్ల స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. ఇటీవలే గృహప్రవేశం జరిగింది. బుధవారం ఉదయం టీడీపీ నేతలు జేసీబీతో వచ్చి ఆయన ఇంటిని కూల్చివేశారు. టీడీపీ ఓటు బ్యాంకు అధికంగా ఉన్న గ్రామంలో 225 ఓట్లు వైఎస్సార్‌సీపీకి రావడానికి విలేకరి వెంకటేశ్వరరావే కారణమని టీడీపీ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. కౌంటింగ్ అనంతరం ఆయనను బెదిరించిన టీడీపీ నేతలు బుధవారం అతడి ఇంటిని కూల్చివేశారు. గ్రామకంఠం స్థలంలో వెంకటేశ్వరరావు ఇంటిని నిర్మించుకున్నారనేది టీడీపీ ఆరోపణ. అక్కడ దాదాపు 40 కుటుంబాలకు చెందిన వారు జీవనం సాగిస్తున్నారు. పూరిళ్ల స్థానంలో చాలామంది భవనాలు నిర్మించుకున్నారు. 30 సంవత్సరాలుగా విద్యుత్ బిల్లులు, పంచాయతీకి ఇంటిపన్ను చెల్లిస్తున్నారు. వెంకటేశ్వరరావు మూడేళ్ల క్రితం వేరొకరి వద్ద 4 సెంట్ల స్థలం కొనుగోలుచేసి ఇంటిని నిర్మించుకున్నారు. తన ఇంటికి భార్య శ్యామల పేరున విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీకి ఇంటిపన్ను చెల్లిస్తున్నారు. ఆక్రమణలు అనుకుంటే అధికారులు అందరిపై చర్యలు తీసుకోవాలి. చట్టవిరుద్ధంగా గృహాలు నిర్మించారనుకుంటే అందరికీ నోటీసులు జారీ చేయాలి. ఆ తర్వాత చట్టపరమైన చర్యలు చేపట్టాలి. కానీ.. టీడీపీ నేతలు జేసీబీతో వెంకటేశ్వరరావు ఇంటిని మాత్రమే కూల్చివేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గంలో ఇలాంటి చర్యలు సహేతుకం కాదని పాత్రికేయులు, ప్రజాస్వామిక వాదులు విమర్శిస్తున్నారు. తన ఇంటిని టీడీపీ నేతలు కూల్చివేస్తున్న విషయాన్ని తెలిపేందుకు విలేకరి వెంకటేశ్వరరావు ప్రయత్నించినా పోలీసులు స్పందించలేదు. వెంకటేశ్వరరావు ఇంటిని టీడీపీ నేతలు కూల్చడంపై జర్నలిస్ట్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

నాకు న్యాయం చేయాలి

- కొత్త ప్రభుత్వం ఉద్యోగం నుంచి తీసేయడం దారుణం
- న్యాయం చేయకపోతే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటా
- ఏలూరు జీజీహెచ్ వద్ద కుటుంబంతో అటెండర్ నిరసన



ఏలూరు జీజీహెచ్‌లో పురుగు మందు, పెట్రోల్‌తో బాధితుడు దుర్గారావు, ఆయన కుటుంబం

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేస్తున్న తనను అకారణంగా తొలగించారని అటెండర్ దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని.. లేకుంటే కుటుంబంతో సహా పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. ఈ మేరకు తన భార్య, పిల్లలతో ఏలూరు సర్వజన ఆస్పత్రి వద్ద దుర్గారావు బుధవారం నిరసన తెలిపాడు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే ఉద్యోగాలు ఎలా తీసేస్తారంటూ అధికారులను నిలదీశాడు. తనతోపాటు మరికొందరిని కూడా తొలగిస్తామని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో దుర్గారావు ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్‌గా విధుల్లో చేరాడు. అప్పటి నుంచి ఏలూరు జీజీహెచ్ ఆరోగ్యశ్రీ విభాగంలోనే పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే దుర్గారావును విధుల్లోంచి తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పడంతో అతడు ఆందోళనకు గురయ్యాడు. తన కుటుంబంతో కలిసి ఆస్పత్రి వద్ద నిరసనకు దిగాడు. ఐదు నెలలుగా జీతాలు సైతం ఇవ్వలేదని, అప్పులు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపాడు. ఇప్పుడు తనకు ఉద్యోగం కూడా లేకుంటే అప్పుల వాళ్లు తనను బతకనివ్వరని వాపోయాడు. తనకు ఉద్యోగం కావాలని, జీతం కూడా వెంటనే ఇప్పించాలంటూ పురుగుల మందు, పెట్రోల్‌తో ఆందోళనకు దిగాడు. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళితే తనకు సరైన సమాధానం చెప్పడం లేదన్నాడు. ఈ విషయమై ఏలూరు జీజీహెచ్ ఆర్ఎంవో ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా.. దుర్గారావుతో మాట్లాడి భరోసా ఇచ్చామన్నారు. రెండు, మూడు రోజుల్లోనే జీతాలు చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే సారూ.. ఇదేమి తీరు!

- రహదారిపై సంబరాలు.. నిలిచిపోయిన వాహనాలు
- అంబులెన్స్, ఆర్డీవో కారుకు సైతం దారి ఇవ్వకుండా అత్యుత్సాహం
- మూడున్నర గంటలకుపైగా ప్రయాణికులకు నరకయాతన



లచ్చయ్యపేట వద్ద వాహనాల మధ్యలో చిక్కుకున్న అంబులెన్స్

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన టీడీపీకి చెందిన బోనెల విజయ్‌చంద్రకు స్వాగతం పేరుతో కూటమి శ్రేణులు చూపిన అత్యుత్సాహం ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. బోనెల విజయ్‌చంద్ర అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి బుధవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పేరిట రహదారిపై టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు హడావుడి చేశారు. బొబ్బిలి దాటిన తర్వాత లచ్చయ్యపేట నుంచి పార్వతీపురం వచ్చే వరకు ఓపెన్ టాప్ వాహనంలో ఆయనను ఊరేగిస్తూ.. కార్లు, బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రీయ రహదారిపై ప్రతి గ్రామం వద్ద ఆయనకు స్థానిక నేతలు, కార్యకర్తలతో స్వాగత ఏర్పాట్లు చేయించి పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ హంగామా చేశారు. లచ్చయ్యపేట, అంటిపేట, కాశీపేట, చినభోగిలి, సీతానగరం, మరిపివలస, నర్సిపురం.. ఇలా ఎక్కడికక్కడ రహదారులను బ్లాక్ చేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గంలోకి ప్రవేశించిన ర్యాలీ.. మధ్యాహ్నం 12.30 వరకు కొనసాగింది. దీంతో అటు పార్వతీపురం నుంచి.. ఇటు బొబ్బిలి మీదుగా వెళ్లే వాహనాలు కిలోమీటర్ల మేర బారులుతీరాయి. రహదారి మధ్యలోనే వీరి ర్యాలీ సాగడం.. కనీసం అంబులెన్స్‌లు వెళ్లేందుకు కూడా దారి ఇవ్వలేదు. లచ్చయ్యపేట వద్ద ర్యాలీలో ఓ అంబులెన్స్ చిక్కుకుపోయింది. పార్వతీపురం ఆర్డీవో వాహనం కూడా చాలాసేపు ఈ ర్యాలీ కారణంగా రోడ్డుపై నిలిచిపోయింది. ఆ సమయంలో ఆర్డీవో హేమలత వాహనంలోనే ఉన్నారు. వాస్తవానికి బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్లేందుకు అరగంట పడుతుంది. కానీ ఈ ర్యాలీలో చిక్కుకున్న ప్రయాణికులు మూడున్నర గంటలకుపైగా నరకయాతన అనుభవించారు.

టీడీపీ ఒత్తిళ్లకు యానిమేటర్ బలి

- యానిమేటర్ పోస్టుకు రాజీనామా చేయాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు
- తీవ్ర మనోవేదనతో గుండెపోటుకు గురై మృతి



అంజనాదేవి (ఫైల్)

రాప్తాడు రూరల్: తెలుగుదేశం పార్టీ నేతల ఒత్తిళ్లకు అనంతపురం మండలం కామారుపల్లికి చెందిన యానిమేటర్ బలైంది. గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తరువాత రేషన్ డీలర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులపై టీడీపీ నాయకులు కన్నేశారు. వారిపై కొన్నిచోట్ల ఒత్తిడి చేస్తున్నారు. కొందరు స్వచ్ఛందంగా తప్పుకుంటుండగా.. మరికొందరిని అధికారులతో బెదిరించి తప్పిస్తున్నారు. ఇంకొందరిని తామే బెదిరిస్తూ తప్పుకునేలా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీడీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక అనంతపురం మండలం కామారుపల్లిలో యానిమేటర్ అంజనాదేవి (57) గుండెపోటుకు గురై మరణించింది. ఈ గ్రామంలో అంజనాదేవితో పాటు సాయిలీల పదేళ్లుగా యానిమేటర్లుగా పని చేస్తున్నారు.

వారికి తెలీకుండా మరో ఇద్దరి ఎంపిక

అంజనాదేవి, సాయిలీలకు తెలీకుండా వారి స్థానాల్లో మరో ఇద్దరు మహిళలను ఎంపిక చేసి జాబితాను సంబంధిత అధికారులకు పంపారు. పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనంతపురంలో చికిత్స పొందుతున్న అంజనాదేవికి మంగళవారం ఈ సమాచారం తెలిసింది. వెంటనే గ్రామంలో ఉండే టీడీపీ నాయకుడికి ఆమె ఫోన్ చేసింది. 'నేను ఏ పనీ చేసుకోలేను. నా భర్త కూడా అనారోగ్యంగా ఉండే విషయం మీకు తెలుసు. దయచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు' అని వేడుకుంది. 'పదేళ్లుగా మీరే పని చేస్తున్నారు కదా? ఇప్పుడు కొత్తవాళ్లకు ఇవ్వాలనుకున్నాం. చూద్దాం లే' అని ఆ నాయకుడు చెప్పడంతో ఇక తన ఉద్యోగం పోయినట్లేనని తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన బాధితురాలికి గుండెపోటు వచ్చింది. వెంటనే అనంతపురం నగర శివారులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం కన్నుమూసింది. అనంతపురం మండలంలో ఆలమూరు, ఆకుతోటపల్లి, రాచానపల్లి, పాపంపేట, ముండబండపల్లిలో ఆరుగురు యానిమేటర్లను ఇప్పటికే తప్పించారు. మరికొన్ని గ్రామాల్లో ఎంపిక పూర్తి చేసి జాబితా పంపుతామని, ఆ మేరకు నియామకాలు చేయాలంటూ సంబంధిత అధికారులను టీడీపీ నాయకులు కోరినట్టు ప్రచారం జరుగుతోంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన గిరి

పూతలపట్టు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకులు దాడి చేసిన ఘటన చిత్తూరు జిల్లా యాదమరి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. యాదమరి మండలం దాసరాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వ్యక్తిగత పనుల నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు బైక్ స్టార్ట్ చేస్తుండగా.. కార్యాలయం గేటు ఎదుట అదే గ్రామానికి చెందిన ఐదుగురు టీడీపీ నాయకులు కారులో నుంచి దిగి గిరిని అడ్డగించారు. కారులో ఉన్న ఆయుధాలతో గిరిపై దాడి చేశారు. దాడి అనంతరం గిరి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తుండగా.. అక్కడ కూడా అడ్డగించి దాడి చేశారు. గిరి తలకు గాయాలవడంతో చిత్తూరులోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎంపీపీ సురేష్ బాబు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను పరామర్శించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి దాడిపై ఆరా తీశారు.

సేవ


ఆస్పత్రిలోని పేద రోగులకు కిచిడీ పంచుతున్న కిరణ్ కామ్దార్

కిచిడీ బామ్మ

ఆస్పత్రిలోని రోగులు ప్రతి మధ్యాహ్నం ఆమె కోసం ఎదురు చూస్తారు. ఆమె రాకుండా పోదు. మబ్బులు రానీ నిప్పులు కురవనీ వస్తుంది. ముంబై ఆస్పత్రుల్లోని పేద రోగులకు రోజుకు వంద మందికి ఆమె కిచిడీ పంచుతుంది. ఆమె దగ్గర డబ్బు లేదు. మనసు తప్ప. అందుకే ఆమెను అందరూ 'కిచిడీ ఆజి' అని పిలుస్తారు.

62 సంవత్సరాల కిరణ్ కామ్దార్ కుదురుగా నిలబడి గాని, కూచునిగాని మాట్లాడలేదు. దానికి కారణం ఐదేళ్ల క్రితం ఆమెకు వచ్చిన పార్కిన్సన్స్ వ్యాధి. కాని ఆమె ఆలోచనలు కుదురుగా ఉన్నాయి. ఆమె సేవా గుణం కుదురుగా ఉంది. దానిని ఎవరూ కదపలేరు.

ముంబై శివార్లలో కొంకణి తీరాన ఉన్న పాల్ఘర్ పట్టణం ఆమెది. సాదాసీదా జీవనమే అయినా ఒక మనిషికి సాటి మనిషి సేవ అవసరం అని ఆమె తెలుసుకుంది. అందుకు కారణం ఆమె కుమారుడు సెరిబ్రల్ పాల్సీతో జన్మించడమే. కుమారుడి కోసం జీవితాన్ని అంకితం చేసిన కిరణ్ చుట్టుపక్కల పేద పిల్లలకు పాఠాలు చెప్పడంతో పాటు చేతనైన సాయం చేయడం కొనసాగించేది. అయితే పార్కిన్సన్స్ వ్యాధి ఆమె కార్యకలాపాలను స్తంభింపచేస్తుందని ఆమె భర్త, కుమార్తె అనుకున్నారు. కాని 2021లో జరిగిన ఒక ఘటన అందుకు విరుద్ధంగా ఆమెను ప్రేరేపించింది.



కిచిడి ముద్ద

పాల్ఘర్‌లో ఒకే ఒక పెద్ద గవర్నమెంట్ హాస్పిటల్ ఉంది. చుట్టుపక్కల 15 పల్లెల నుంచి పేద జనం ఉదయం నుంచే వచ్చి ఓపీలో వెయిట్ చేస్తుంటారు. వారికి చెకప్ అయ్యేసరికి మధ్యాహ్నం 2 అవుతుంది. ఆ సమయంలో వారి ఆకలి బాధకు అక్కడ విరుగుడు లేదు. 2021లో కోవిడ్ సెకండ్‌వేవ్ సమయంలో ఒక బంధువును పరామర్శించడానికి కిరణ్ ఆ ఆస్పత్రికి వెళ్లింది. మధ్యాహ్నం వేళ చాలామంది పేషెంట్లు ఆకలితో బాధ పడుతున్నారని గ్రహించింది. 'వీరికి ఆకలి తీరే మార్గమే లేదా?' అనుకుని వెంటనే రంగంలో దిగింది. హాస్పిటల్ డీన్‌ని కలిసి 'నేను మీ హాస్పిటల్‌లోని పేషెంట్లకు శుచిగా చేసిన వెజిటబుల్ కిచిడి పెట్టొచ్చా. వాళ్లు అన్నం లేక బాధ పడుతున్నారు' అని అడిగింది. హాస్పిటల్ డీన్ వెంటనే అంగీకారం తెలిపారు. అలా మొదలైంది కిరణ్ 'కిచ్‌డీ బ్యాంక్' ఆలోచన.

రోజూ 100 మంది

అంతటి పార్కిన్సన్స్ వ్యాధితో బాధ పడుతున్నా రోజూ స్వయంగా దాదాపు 20 నుంచి 22 కిలోల కిచిడి తయారు చేస్తుంది కిరణ్. ఆ తర్వాత దానిని స్వయంగా తీసుకుని ఆస్పత్రి చేరుతుంది. అక్కడ వార్డు వార్డుకు తిరుగుతూ పేషెంట్లకి, వారి బంధువులకి, చిన్న పిల్లలకు పంచి పెడుతుంది. ఇందుకు రెండు మూడు గంటలు పట్టినా ఆమె అలసి పోదు. పల్లెటూరి పేద వారు ఆమె తెచ్చే ఆ కిచిడి కోసం ఎదురు చూస్తూ ఉంటారు. 'నువ్వు దేవతవు తల్లీ' అని ఆశీర్వదిస్తూ ఉంటారు. 'కిచిడి పేషెంట్లను త్వరగా కోలుకునేలా చేస్తుంది. సులభంగా అరుగుతుంది' అంటుంది కిరణ్.

అదే వైద్యం

పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతూ ఇంతమందికి రోజూ వండటం గురించి కిరణ్‌కు చికిత్స చేస్తున్న డాక్టర్లు ఆందోళన చెందినా, వారించినా ఇప్పుడు మూడేళ్లుగా సాగుతున్న ఆమె సేవను చూశాక, ఆమెకు పరీక్షలు చేశాక 'ఆమె చేస్తున్న సేవే ఆమెకు వైద్యంగా పని చేస్తున్నదని' తేల్చారు. ఆమె సంకల్పం వ్యాధిని అదుపులో పెడుతోందని తెలియచేశారు. కిరణ్ కామ్దార్ గత మూడేళ్లుగా సాగిస్తున్న ఈ సేవకు ఆమెకు ఎన్నో అవార్డులు వచ్చాయి. మెచ్చుకోళ్లు దక్కుతున్నాయి. నిజానికి ఇది అసాధ్యమైన పని కాదు. ఆమె మాత్రమే చేయదగ్గ పని కాదు. ఎవరైనా అతి సులువుగా పూనుకోదగ్గదే. ప్రతి ప్రాంతంలో ఎన్నో ప్రభుత్వ ఆస్పత్రుల దగ్గర పేదవాళ్లు, లోపలి పేషెంట్లు సరైన తిండి లేక బాధపడుతుంటారు. వారికి కిచ్‌డీయో సాంబార్ రైసో పెట్టడం పెద్ద కష్టం కాదు. రోజూ చేయకపోయినా వారానికి ఒకరోజైనా ఇలాంటి సేవ చేస్తే ఆ తృప్తే వేరు. ఎక్కువమంది పూనుకోరు. పూనుకున్నవారు కిరణ్ కామ్దార్‌లా చిరాయువు పొందుతారు.

అదర్ సైడ్


విజీ వెంకటేష్

వెండితెర వెలుగుల్లోనూ...

కన్నీళ్ల భాష తెలిసిన విజీ వెంకటేష్ కళారంగంలోకి అడుగుపెట్టింది. దేశవ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించడం నుంచి క్యాన్సర్ బాధితులకు అండగా నిలవడం వరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన విజీ వెంకటేష్‌లో నటిగా మరో కోణం పరిచయం అయింది. ఆమెకు నటనలో ఓనమాలు తెలియవు. అయితే 'తెలియదు' అనే మాట దగ్గర ఆమె ఎప్పుడూ ఆగిపోలేదు. మలయాళం మాట్లాడడం నేర్చుకుంది. సాధన చేసి నటనలో శభాష్ అనిపించుకుంది. 'బలమైన సినీ మాధ్యమం ద్వారా ఎన్నో సందేశాలను ప్రజలకు చేరువ చేయవచ్చు' అంటుంది విజీ వెంకటేష్...

71 ఏళ్ల వయసులో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన విజీ వెంకటేష్ మన దేశంలో క్యాన్సర్ పేషెంట్‌ల కోసం మూడు దశాబ్దాలకు పైగా రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఆమె స్వచ్ఛంద సంస్థ 'ది మాక్స్ ఫౌండేషన్'కు ఇండియా, సౌత్ ఏషియా హెడ్‌గా ఉన్నారు.

దిల్లీలో పుట్టి పెరిగిన విజీకి సామాజిక స్పృహకు సంబంధించిన విషయాలపై స్కూల్ రోజుల్లో నుంచే ఆసక్తిగా ఉండేది. ఆ ఆసక్తికి అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. వివాహం తరువాత దిల్లీ నుంచి బాంబేకు వచ్చింది. ఒక కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లుగా అనిపించింది. తన ఆసక్తులకు తగిన వాతావరణం ఇక్కడ కనిపించింది. ఆంగ్లంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. 'ది మాక్స్ ఫౌండేషన్' ద్వారా ఉద్యోగ, సేవాప్రస్థానాన్ని ప్రారంభించింది.

'క్యాన్సర్ పేషెంట్ల గురించి పనిచేయాలనుకోవడానికి కారణం ఏమిటి? అని చాలామంది నన్ను అడుగుతుంటారు. అయితే కాన్సర్‌పై పోరాటానికి, అవగాహన కలిగించడానికి క్యాన్సర్ పేషెంట్ కానక్కర్లేదు. వారి కష్టాలు మనకు తెలిసుంటే చాలు. ముంబైలో సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి క్యాన్సర్ బాధితులకు అవసరమైన నిధుల సేకరణ ప్రారంభించడం ద్వారా నా ప్రస్థానం మొదలైంది' అంటుంది విజీ.

నిధుల సేకరణ మాత్రమే కాదు పేద క్యాన్సర్ పేషెంట్ల ఇంటికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. ధైర్యం చెప్పేది. వీరిలో చాలామందికి పొగాకు నమిలే అలవాటు ఉన్నట్లు గ్రహించింది.

ఉద్యోగ ప్రయాణం మొదలైన కొత్తలో బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీకి వెళ్లి క్యాన్సర్‌కు సంబంధించిన ఎన్నో పుస్తకాలను చదివి కొత్త విషయాలను తెలుసుకునేది. అంతేకాదు టాటా మెమోరియల్ హాస్పిటల్‌లోని ఆంకాలజీ డిపార్ట్‌మెంట్ ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకుంది.

ఫ్యాక్టరీలకు వెళ్లి పొగాకు నమలడం ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యల గురించి కార్మికుల కోసం అవగాహన సదస్సులు నిర్వహించేది. ఈ సమావేశాలు పొగాకు నమిలే అలవాటు ఉన్న చాలామందిలో మార్పు తీసుకువచ్చి ప్రమాదం బారిన పడకుండా చూశాయి.

అవగాహన సదస్సులతో పాటు పేదల కోసం ఎన్నో చోట్ల క్యాన్సర్‌కు సంబంధించి ఎర్లీ డిటెక్షన్ క్యాంపులు నిర్వహించింది. ఈ క్యాంప్‌లు ఎంతోమందిని కాపాడాయి.


మలయాళ చిత్రంలో ఫాహద్ ఫాజిల్, విజీ వెంకటేష్

అసలు సినిమాల్లో నటించే అవకాశం విజీ వెంకటేష్‌కు ఎలా వచ్చింది అనే విషయానికి వస్తే... సోషల్ మీడియాలో ఆమె చురుగ్గా ఉంటుంది. మలయాళ డైరెక్టర్ అఖిల్ సత్యన్, అతని టీమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో విజీ వెంకటేష్ ఫొటోను చూశారు. తమ సినిమా 'పచ్చుం అబ్బుతావిలక్కుమ్'కు 'ఉమ్మచ్చి' క్యారెక్టర్‌కు సరిగ్గా సరిపోయే మహిళ అనుకున్నారు. వెంటనే విజీ వెంకటేష్‌ను సంప్రదించారు.

'నేను ఫుల్–టైమ్ జాబ్ చేస్తున్నాను. నాకు మలయాళం పెద్దగా రాదు' అని చెప్పింది. 'ఈ వయసులో నటన ఏమిటి' అని కూడా అన్నది.

అయితే డైరెక్టర్ పట్టువదలని విక్రమార్కుడు అయ్యాడు. 'రోల్' గురించి మరింత వివరంగా చర్చించాడు. అతడి ఆసక్తి, వృత్తిపట్ల అంకిత భావం నచ్చడంతో విజీకి 'ఓకే' అనక తప్పలేదు. ఇక అప్పటినుంచి మలయాళం స్పీకింగ్ స్కిల్స్‌పై దృష్టి పెట్టింది. నటనలో మంచి మార్కులు కొట్టేసింది.

ఈ సినిమాలో విజీ తల్లి పాత్ర పోషించింది. స్వతంత్ర వ్యక్తిత్వం, పోరాడే ధీరత్వం ఉన్న మహిళ పాత్ర అది. నిజానికి ఈ పాత్రకి సంబంధించిన లక్షణాలు ఆమెలో సహజంగా ఉన్నవే.

ఈ సినిమా నుంచి మరికొన్ని సినిమాల నుంచి ఆఫర్లు వచ్చాయి. 'వీర' లాంటి చిత్రాలతో పేరు తెచ్చుకున్న దర్శకుడు జయరాజ్ చిత్రం కోసం సైన్ చేసింది. కాటుక, ముక్కు పుడక... ఇలా విజీ వెంకటేష్‌కు తనదైన సిగ్నేచర్ స్టైల్ ఉంది. తన మొదటి సినిమా కోసం ఆ స్టైల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే కొత్త లుక్‌లో కూడా సహజంగా, అందంగా ఉంది విజీ వెంకటేష్.

బ్యూటిప్స్



అందానికి ఓట్లు



ఓట్స్ ఆరోగ్యపోషణతో పాటు సౌందర్యపోషణకూ దోహదం చేస్తాయి. ఓట్స్‌తో చర్మ సౌందర్యాన్ని సంరక్షించుకోవడం ఎలాగో చూద్దాం.

- రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్‌పౌడర్‌లో మూడు టేబుల్ స్పూన్‌ల పెరుగు, టీ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిక్స్‌ను ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత వేళ్లతో వలయాకారంగా రుద్దుతూ చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి తగిన పోషణ లభించడంతోపాటు మృతకణాలు తొలగిపోయి చర్మం కాంతిమంతమవుతుంది.
- మొటిమలు తగ్గాలంటే టేబుల్ ఓట్స్ పౌడర్‌లో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. పూర్తిగా ఆరిన తర్వాత మెల్లగా రుద్దుతూ చన్నీటితో శుభ్రం చేయాలి. చర్మంలో అధికంగా ఉన్న జిడ్డును ఓట్స్ పీల్చుకోవడం వల్ల మొటిమలు వాడిపోతాయి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే నాలుగు వారాల్లోనే మొటిమలు పూర్తిగా తగ్గిపోతాయి.
- రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్ పౌడర్‌లో టేబుల్ స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్‌ల పాలు కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఈ ప్యాక్ సహజమైన బ్లీచ్. చర్మాన్ని తెల్లబరుస్తుంది. మృదువుగా మారుతుంది కూడా.
- ఓట్స్ పౌడర్ రెండు టేబుల్ స్పూన్‌లు, బాదం పొడి టేబుల్ స్పూన్, తేనె టేబుల్ స్పూన్, పాలు లేదా పెరుగు రెండు టేబుల్ స్పూన్‌లు కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి, మెడకు పట్టించి వలయాకారంలో పది నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఈ ప్యాక్ వల్ల మృతకణాలు తొలగిపోవడంతోపాటు చర్మకణాల్లో పట్టేసిన మురికి వదులుతుంది. ఈ ప్యాక్ నెలకు రెండుసార్లు వేస్తుంటే ప్రత్యేకంగా స్క్రబ్ క్రీమ్‌లు, బ్లీచ్‌లు వాడాల్సిన అవసరం ఉండదు.
- రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్ పౌడర్‌లో రెండు టేబుల్ స్పూన్‌ల బొప్పాయి గుజ్జు, టీ స్పూన్ బాదం ఆయిల్ కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. పొడి చర్మానికి ఈ ప్యాక్ చాలా మంచి ఫలితాన్నిస్తుంది. చర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. మొటిమలు ఉన్న వాళ్లు బాదం ఆయిల్ లేకుండా ప్యాక్ వేసుకోవచ్చు.

యోగవికాసానికి పద్మ పురస్కారం


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మశ్రీ అందుకుంటున్న చార్లోట్ చోపిన్

నూటొక్క వసంతాలను చూసిన చార్లోట్ చోపిన్ ఈ ఏడాది మే నెలలో మనదేశం అందించే అత్యున్నత పద్మపురస్కారాన్ని అందుకున్నారు. ఆమె పుట్టి వందేళ్లు దాటింది. నిజమే, 1922, డిసెంబర్ 11వ తేదీన ఫ్రాన్స్‌లోని చేర్ పట్టణంలో పుట్టారామె. యాభై ఏళ్ల వయసులో ఆమె ఎదుర్కొన్న శారీరక, మానసిక రుగ్మతలకు సమాధానంగా యోగసాధన ప్రారంభించారు చార్లోట్. అప్పటి నుంచి ఆమె జీవనశైలి పూర్తిగా మారిపోయింది. తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని అంతటితో సంతృప్తి చెందలేదామె. యోగసాధన గురించి ప్రపంచానికి తెలియచేయాలని కంకణం కట్టుకున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి, ఆనందానికి, అహ్లాదకరమైన జీవనానికి యోగసాధనను మించినది మరొకటి లేదని వర్క్‌షాప్‌లు పెట్టి అవగాహన కల్పించారు.

ఫ్రాన్స్‌లో పరిమళించిన మన ప్రాచీన విద్య

చార్లోట్ 1982 లో చేర్ పట్టణం నుంచి యోగ సాధన పట్ల అవగాహన కార్యక్రమాలు మొదలు పెట్టారు. యోగసాధన వల్ల లభించే ప్రయోజనాలను వివరిస్తూ, యోగసాధన నేర్పిస్తూ ఫ్రాన్స్ మొత్తం పర్యటించారామె. ఫ్రెంచ్ టీవీలో 'ఫ్రాన్స్ గాట్ ఇన్‌క్రెడిబుల్ టాలెంట్' ప్రోగ్రామ్ ద్వారా దేశమంతటా యోగ విద్యను విస్తరింపచేశారు. ఆమె తాను నివసిస్తున్న చేర్ పట్టణంలో స్వయంగా వేలాది మందికి నేర్పించారు. దేశవిదేశాల్లో యోగవిద్య విస్తరించడానికి ఆమె విశేషమైన కృషి చేశారు.

ప్రాచీనమైన యోగవిద్య మనిషికి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని అందించే ఏకైకమార్గమని ప్రపంచానికి చాటారు చార్లోట్. యోగసాధనకు వయసుతో సంబంధం లేదని, అందుకు తానే పెద్ద నిదర్శనమని అనేక సందర్భాల్లో చెప్పారామె. తన ఆరోగ్య రహస్యం యోగసాధన అని 2024, మే, 9వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్న సందర్భంగా కూడా చెప్పారు చార్లోట్ చోపిన్.

సోషల్ టౌన్ / స్వచ్ఛంద సహకారం





కేరళకు చెందిన నీనూ రతిన్‌కు సామాజిక సేవా రంగం అంటే ఇష్టం. సోషల్ యాక్టివిస్ట్‌లతో కలిసి పనిచేయడం అంటే ఇష్టం. ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రహించి నిధుల సేకరణలో వారికి సహకరించడానికి ఒక సంస్థను ఏర్పాటు చేసింది. తక్కువ కాలంలోనే 'సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్'గా పెద్ద పేరు తెచ్చుకుంది. సోషల్ వర్కర్ కావాలనుకునే వారికి సంస్థ సహకారం అందిస్తుంది. స్వచ్ఛంద సంస్థలు వివిధ విషయాలలో పరస్పరం సహకరించుకునే వాతావరణాన్ని కల్పించింది.

కేరళలోని త్రిసూర్‌లో పుట్టి పెరిగిన నీనూ రతిన్ చదువులో 'తెలివైన అమ్మాయి' అనిపించుకుంది. క్లాసులో టీచర్‌లు చెప్పే సామాజిక సేవకు సంబంధించి విషయాలను శ్రద్ధగా వినేది. అలా... తనకు చిన్నప్పుడే సామాజిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరిగింది. చదువుకు ఎంత ప్రాముఖ్యత ఇచ్చేదో సామాజిక సేవా కార్యక్రమాలకు అంతగా ప్రాధాన్యత ఇచ్చేది.

ఇంజినీరింగ్ చేస్తున్నప్పటికీ ఆమె మనసు మాత్రం సామాజిక విషయాలపై కేంద్రీకృతమై ఉండేది.

ఆమె ఫ్రెండ్స్‌కు మాత్రం ఇంజినీరింగ్ అంటే చాలా ఇష్టం. ఒకానొక దశలో అయితే 'వీరి మధ్య నేను ఉండడం సరియైంది కాదేమో. నా ఆలోచనలు వేరు, వీరి లక్ష్యాలు వేరు' అనుకునేది నీనూ.

ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చిందిగానీ ఏవో కారణాల వల్ల అందులో చేరలేకపోయింది. దీంతో ఒక చిన్న ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసింది.

అయితే కొంత కాలం తరువాత... 'ఈ ఉద్యోగం నాకు కరెక్ట్ కాదేమో' అనుకుంది. అదే సమయంలో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు. పెళ్లి తరువాత తనకు ఎప్పటి నుంచో ఆసక్తి ఉన్న సామాజిక సేవారంగంలోకి అడుగు పెట్టింది.

'ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్' కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. ఇది తన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.

'ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో ఆధ్యాత్మిక. సామాజిక కార్యక్రమాలు ఉండేవి. నాకు రెండోదానిపై ఆసక్తి' అంటుంది నీనూ. ఫౌండేషన్‌కు సంబంధించి ఎన్నో రకాల సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంది. ఈ కార్యక్రమాలు భవిష్యత్‌లో తాను చేయబోయే పనులకు పునాదిగా నిలిచాయి.

తొలి అడుగుగా ఫౌండేషన్ తరపున ఎన్నో స్కూల్స్‌కు వెళ్లి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు చెప్పేది. మొక్కలు నాటేది. పది స్కూల్స్‌తో మొదలైన మొక్కలు నాటే కార్యక్రమం ఆ తరువాత 30కు చేరుకుంది. ఒకవైపు ఇంటిపనులు చూసుకుంటూనే పర్యావరణ విషయాలపై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొనేది నీనూ.

సామాజిక సేవా రంగంలో పనిచేయడం వల్ల తనలాగే ఆలోచించే ఎంతోమంది పరిచయం అయ్యారు. ఎన్నో స్వచ్ఛందసంస్థలతో కలిసి రకరకాల కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వచ్చింది.

ఆ బలమే వేరు

ఒకే రకమైన ఆలోచన విధానం ఉన్న వారు ఒకే దగ్గర ఉంటే ఆ బలమే వేరు. ఇంకా ఎన్నో మంచి పనులు చేయవచ్చు. చాలా మందికి సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వారికి దారి తెలియదు. అలాంటి వారికి ఒక కొత్త దారిని చూపే బాధ్యతను మా స్వచ్ఛంద సంస్థ తీసుకుంది. స్వచ్ఛంద సేవకురాలిగా ప్రభావశీలమైన ఎన్నో ప్రాజెక్ట్‌లలో పాల్గొన్నాను. వాటి గురించి గుర్తు తెచ్చుకున్నప్పుడల్లా ఉత్సాహం వస్తుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలనిపిస్తుంది.

– నీనూ రతిన్

కొంతకాలం తరువాత భర్త, పిల్లలతో కొచ్చికి వెళ్లింది నీనూ. అక్కడికి వెళ్లిన తరువాత కూడా స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేయడం మొదలుపెట్టింది. మహిళా సమస్యలపై పనిచేయడం నుంచి రక్తదాన కార్యక్రమాల వరకు ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంది.

తాను కొచ్చిలో ఉన్న సమయంలో కేరళకు భయానకమైన వరదలు వచ్చాయి. వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. సోషల్ మీడియా వేదికగా బాధితులకు ఎన్నో రకాలుగా అండగా నిలబడింది. అట్టాపాడి, నీలంబూర్, వయనాడ్‌లోని గిరిజన జనావాసాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'బాధితులకు సహాయపడే కార్యక్రమాల్లో పాల్గొనడం అనేది సమిష్టి కార్యాచరణ శక్తిని అర్థం చేసుకునేలా చేసింది. గతంలో మా కుటుంబ సభ్యులు ఎవరూ సామాజిక సేవా రంగంలో లేరు. నాకు కూడా కొత్త. ఎన్ని రకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొంటే నాకు అంత ఉత్సాహం వచ్చేది' అంటుంది నీనూ రతిన్.

ఆ ఉత్సాహ బలమే ఆమెను 'సోషల్ టౌన్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రారంభించేలా చేసింది.

మొదట్లో ఇంటరాక్షన్స్ కోసం వాట్సాప్ గ్రూప్‌లు, ఈ మెయిల్స్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు 'సోషల్ టౌన్ పరిధి విస్తరించి క్షేత్రస్థాయిలో సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయి.

'సమాజంలో ఏదో ఒక మార్పు తీసుకురావాలని కలలు కనే ఒకేరకమైన ఆలోచనా విధానం కలిగిన వ్యక్తులుండే సంఘంలాంటిది మా సంస్థ' అంటుంది నీనూ రతిన్.



14 ఏళ్లకే ఒలింపిక్స్ బరిలోకి...

వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ తరఫున బరిలోకి దిగనున్న అతి పిన్న వయస్కురాలిగా కర్ణాటకకు చెందిన 14 ఏళ్ల స్విమ్మర్ ధినిధి దేసింగు గుర్తింపు పొందనుంది. ధినిధి మహిళల 200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో పోటీపడుతుంది. భారత్ నుంచి ఎవరూ పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని అందుకోలేకపోయారు. దాంతో చివరి అవకాశంగా అందుబాటులో ఉన్న రెండు 'యూనివర్సాలిటీ' బెర్త్‌లను భారత స్విమ్మింగ్ సమాఖ్య ఉపయోగించుకుంది. ధినిధి కాకుండా పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ భారత్ తరఫున 'పారిస్'లో పోటీపడతాడు.

జింబాబ్వే పర్యటనకు నితీశ్ కుమార్ రెడ్డి దూరం

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి మరికొంతకాలం వేచి చూడాల్సి ఉంటుంది. వచ్చే నెలలో జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత టి20 జట్టులో నితీశ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. అయితే దురదృష్టవశాత్తు బుధవారం నితీశ్ గాయపడి జింబాబ్వే పర్యటనకు దూరమయ్యాడు. ఫలితంగా నితీశ్ స్థానంలో ముంబైకి చెందిన ఆల్‌రౌండర్ శివమ్ దూబేను బీసీసీఐ ఎంపిక చేసింది.





'ఫైనల్' అడుగు ఎవరిదో!

నేడు ఇంగ్లండ్‌తో భారత్ సెమీఫైనల్ ● జోరు మీదున్న రోహిత్ బృందం
నిలకడలేమితో బట్లర్ జట్టు ● రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



టీమిండియా ఏడు నెలల్లో మరో ప్రపంచకప్ ఫైనల్‌పై గురి పెట్టింది. 2022 టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో తమను ఓడించి తుది పోరుకు అర్హత పొందిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ పై బదులు తీర్చుకునేందుకు భారత జట్టు అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. 'ఒకే దెబ్బకు రెండు పిట్టలు' అన్నట్లు ఈ ఒక్క నాకౌట్ విజయంతో ఇంగ్లండ్ ను కసితీరా ఇంటికి పంపొచ్చు... మనమేమో 10 ఏళ్ల తర్వాత ఈ మెగా టోర్నీలో మరోసారి ఫైనల్ చేరవచ్చు. బ్యాటింగ్ ఫామ్, బౌలింగ్ నిలకడ భారత్‌ను ఓ మెట్టుపైనే నిలబెడుతోంది.

జార్జ్‌టౌన్: భారత్ ఇక అసలైన పోరుకు సిద్ధమైంది. గడిచిన 26 రోజులుగా ఆడిన మ్యాచ్‌లు వేరు, నేటి సెమీఫైనల్ పోరాటం వేరు. లీగ్, సూపర్–8 దశలు కావడంతో ఇన్నాళ్లూ కచ్చితంగా గెలవకపోయినా... ముందుకెళ్లే అవకాశమైతే ఉండింది. కానీ ఇది నాకౌట్ పోరు. అన్నీ గెలిచామన్న ధీమా కుదరదు. అలాగే ఇదీ గెలుస్తామన్న గ్యారంటీ లేదు. ఇంకా చెప్పాలంటే కప్ గెలవాలన్నా... ఆఖరి మెట్టుపై నిలవాలన్నా... ఈ రెండో మెట్టే గట్టిగా వేయాలి. లేదంటే అమీతుమీకి ముందే మన జైత్రయాత్రకు చెక్ పడుతుంది. పైగా ఇది టి20 ఫార్మాట్. ఈ మెరుపుల ఫార్మాట్‌ను బ్యాటర్లు, బౌలర్లు, ఆల్‌రౌండర్లే కాదు... వరుణ దేవుడు కూడా శాసిస్తోంది. ఇది ఒక్కోసారి పెద్ద జట్లకు శాపంగా... ఉన్నపళంగా జఠిలంగా కూడా మారుతోంది.

ఏడు జట్లను ఓడించాం కానీ...

ఒక వార్మప్ మినహాయిస్తే... నాలుగు లీగ్ దశ పోటీలు, మూడు సూపర్–8 మ్యాచ్‌ల్లో ఏడు వేర్వేరు జట్లనైతే ఓడించాం. కానీ గట్టిగా జయించింది ఇద్దరినే! లీగ్ దశలో పాకిస్తాన్, 'సూపర్–8'లో ఆస్ట్రేలియా ఈ రెండు మేటి జట్లపై గెలుపే ప్రపంచకప్ స్థాయి గెలుపని చెప్పొచ్చు. ఐర్లాండ్, అమెరికా, కెనడా, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌లను ఓడించడం టీమిండియా స్థాయికి ఏమాత్రం విషయం కానేకాదు. ఆస్ట్రేలియా లాంటి మేటి జట్టుపై కెప్టెన్ రోహిత్ శర్మ విధ్వంసం భారత బ్యాటింగ్‌ను మరోస్థాయిలో నిలబెడుతోంది. కానీ విరాట్ కోహ్లి వైఫల్యమే జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. బహుశా ఈ సెమీస్‌లో ఆ కరువు తీర్చుకుంటే అభిమానులకు 'ఫైనల్ పండగే' మిగులుతుంది. సూర్యకుమార్, దూబే, హార్దిక్ పాండ్యాలు దంచేయడం, బౌలింగ్‌లో బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ నిప్పులు చెరుగుతుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. స్పిన్నర్లు కుల్దీప్, జడేజా, అక్షర్ పటేల్‌లు కూడా జట్టు విజయాల్లో భాగమవుతున్నారు.

తడబడుతూ ఇంగ్లండ్

డిఫెండింగ్ చాంపియన్ హోదాతో మెగా ఈవెంట్‌ను మొదలుపెట్టిన ఇంగ్లండ్ జట్టు ఇక్కడిదాకా వచ్చేందుకు తడబడింది. ఇంకా చెప్పాలంటే కొన్ని సందర్భాల్లో ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడింది కూడా! కానీ ఏ జట్టుపై, ఏ వేదికపై సాధికారికంగా ఆడిన దాఖలాలైతే లేవు. అయితే అసలైన ఈ నాకౌట్ సమరంలో కెప్టెన్ జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, మొయిన్ అలీ, హ్యారీ బ్రూక్‌లు బ్యాట్ ఝుళిపిస్తే మాత్రం భారత్‌కు కష్టాలు తప్పవేమో! బౌలింగ్‌లో స్పిన్నర్ ఆదిల్ రషీద్ అద్భుతంగా రాణిస్తుండటం ప్రత్యర్థి బౌలింగ్ దళానికి బలంగా మారింది.

23 భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటివరకు 23 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరిగాయి. 12 మ్యాచ్‌ల్లో భారత్, 11 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి. ప్రపంచకప్‌లో నాలుగుసార్లు తలపడగా... చెరో రెండు విజయాలతో సమంగా ఉన్నాయి.

వర్షార్పణమైతే..

గయానాలో బుధవారం వాన కురిసింది. మ్యాచ్‌కు వరుణ గండమైతే ఉంది. తొలి సెమీఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది. భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. ఈ మ్యాచ్ ఉదయం జరగనుండటంతో నిర్ణీత సమయం కటాఫ్ లేకుండా పొడిగింపు మాత్రం ఉంటుంది. భారీ వర్షంతో సెమీఫైనల్స్ రద్దయితే లీగ్, సూపర్–8 దశల్లో టాపర్‌గా నిలిచిన భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఫైనల్ చేరుతాయి.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), కోహ్లి, సూర్యకుమార్, రిషభ్ పంత్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, అర్ష్‌దీప్, బుమ్రా. ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), సాల్ట్, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, హ్యారీ బ్రూక్, మొయిన్ అలీ, స్యామ్ కరన్, జోర్డాన్, ఆర్చర్, ఆదిల్ రషీద్, టాప్లీ.

పిచ్, వాతావరణం

గయానా పిచ్ బౌలర్లకు స్వర్గధామం. ఈ వేదికపై తొలుత బ్యాటింగ్ చేసిన జట్ల సగటు స్కోరు 127. అయితే లక్ష్యఛేదన మరీ దారుణం. సగటు స్కోరు 95 పరుగులే! కాబట్టి మెరుపుల్ని ఆశించడం అత్యాశే! మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది.

కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత పురుషుల హాకీ జట్టును ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన టీమిండియాకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్... వైస్ కెప్టెన్‌గా హార్దిక్ సింగ్ వ్యవహరిస్తారు. గత టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతకం సాధించింది. గ్రూప్ 'బి'లో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లతో భారత్ ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా జట్లున్నాయి. గోల్‌కీపర్ శ్రీజేశ్, మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ వరుసగా నాలుగో ఒలింపిక్స్ ఆడనున్నారు. **భారత హాకీ జట్టు:** హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), హార్దిక్ సింగ్ (వైస్ కెప్టెన్), శ్రీజేశ్ (గోల్‌కీపర్), జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, సుమిత్, సంజయ్, రాజ్‌కుమార్, షంషేర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ ప్రసాద్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ ఉపాధ్యాయ్, మన్‌దీప్ సింగ్, గుర్జంత్ సింగ్, క్రెయిగ్ ఫుల్టన్ (హెడ్ కోచ్).

చరిత్రకు చేరువలో..





తరూబా (ట్రినిడాడ్): ఓ ఆసక్తికర సెమీస్ సమరం, ఓ కొత్త ఫైనలిస్టుకు వేదికైన ఈ ప్రపంచకప్‌లో అటు దక్షిణాఫ్రికా, ఇటు అఫ్గానిస్తాన్ ఎవరు ఫైనల్ చేరతారో గురువారం మధ్యాహ్నంలోపు తెలిసిపోతుంది. మెగా ఈవెంట్‌లోనే మేటి జట్లను తోసిరాజని బాగా ఆకట్టుకున్న ఏకైక జట్టు అఫ్గానిస్తాన్. తమ ఆట ఆషామాషీగా లేదని, సంచలన విజయాలు గాలివాటం కానేకాదని రషీద్ ఖాన్ బృందం నిరూపిస్తోంది. ఆతిథ్య విండీస్, పటిష్ట న్యూజిలాండ్ ఉన్న గ్రూప్ 'సి'లో లీగ్ దశనే అఫ్గానిస్తాన్ దాటడం గొప్పనుకుంటే... 'సూపర్–8'లో ఏకంగా 2021 చాంపియన్ ఆస్ట్రేలియానే కంగుతినిపించడం, బంగ్లాదేశ్‌పై తీవ్ర ఒత్తిడి ఉన్న ఆఖరి మ్యాచ్‌లో పోరాడి గెలవడం క్రికెట్ చరిత్రలోనే నిలిచేలా చేసింది. అఫ్గాన్ సెమీస్ చేరడంతోనే రికార్డుల్లోకెక్కింది. ఇప్పుడు ఫైనల్ చేరి చరిత్ర పుటల్లోకెక్కాలని గట్టి పట్టుదలతో ఉంది. ఇటు బ్యాటర్లు, అటు బౌలర్లు సమష్టిగా రాణిస్తుండటం అఫ్గాన్ పెను సంచలనాలకు కారణం కాగా... మరోవైపు గట్టి జట్టయిన దక్షిణాఫ్రికా మాత్రం ప్రతి మ్యాచ్‌ను కష్టపడుతూనే గెలుపొందడం విడ్డూరం. నెదర్లాండ్స్‌పై 103 పరుగుల లక్ష్యాన్ని 19వ ఓవర్లో ఛేదించడం, బంగ్లాదేశ్‌పై 4 పరుగులు, నేపాల్‌తో ఒక పరుగు తేడాతో గట్టెక్కడం సఫారీ స్థాయిని తక్కువ చేస్తోంది. తొలిసారి ప్రపంచకప్‌లో ఆడిన అమెరికాపై 194/4లాంటి భారీస్కోరు చేసినా కేవలం 18 పరుగులతోనే గెలుపొందడం... ఇలా ప్రతీ మ్యాచ్‌లోనూ దక్షిణాఫ్రికా పెద్ద పెద్ద పోరాటాలే చేసింది. ఇలాంటి జట్టుపై జోరుమీదున్న అఫ్గాన్ గెలిస్తే సంచలనమైతే అవుతుందేమో కానీ ఇందులో పెద్ద విశేషమైతే ఉండదు. మొత్తం మీద తొలి ఫైనల్ అవకాశాన్ని ఎవరు దక్కించుకుంటారనేదే ఆసక్తికరంగా మారింది.

దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ మధ్య తొలి సెమీఫైనల్ నేడు

- ఎవరు గెలిచినా తొలిసారి వరల్డ్‌కప్ 'ఫైనల్'కు
- ఉదయం గం. 6 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

జట్లు (అంచనా)

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, హెండ్రిక్స్, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్, రబాడ, నోర్జే, షమ్సీ. **అఫ్గానిస్తాన్:** రషీద్ ఖాన్ (కెప్టెన్), గుర్బాజ్, ఇబ్రహీమ్, అజ్మతుల్లా, గుల్బదిన్, నబీ, కరీమ్, నంగేయలియా, నూర్ అహ్మద్, నవీనుల్ హక్, ఫరూఖీ.

2 దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఇప్పటి వరకు రెండు టి20 మ్యాచ్‌లు జరగ్గా... రెండింటిలోనూ దక్షిణాఫ్రికానే గెలిచింది. 2010 ప్రపంచకప్‌లో 59 పరుగులతో, 2016 ప్రపంచకప్‌లో 37 పరుగులతో దక్షిణాఫ్రికా నెగ్గింది.

టాప్ ర్యాంక్ కోల్పోయిన సూర్యకుమార్ యాదవ్

కొత్త నంబర్‌వన్‌గా హెడ్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. గత ఏడు నెలలుగా నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్న భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్ రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. ఐదో ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రవిస్ హెడ్ నాలుగు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుత టి20 ప్రపంచకప్‌లో హెడ్ మొత్తం 255 పరుగులు సాధించాడు. దాంతో అతను 844 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. 842 రేటింగ్ పాయింట్లతో సూర్య రెండో స్థానంలో ఉన్నాడు. ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), బాబర్ ఆజమ్, రిజ్వాన్ (పాకిస్తాన్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు.

సినిమా

కౌంట్‌డౌన్ స్టార్ట్


● రామ్

హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరిద్దరి కలయికలో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. ఆగస్టు 15న సినిమాని విడుదల చేయనున్నాం. సినిమా రిలీజ్‌కి సరిగ్గా 50 రోజులు ఉంది. అందుకే 50 రోజుల కౌంట్‌డౌన్‌ను మార్క్ చేస్తూ రామ్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశాం. మణిశర్మ సంగీతం అందించిన ఈ మూవీ టైటిల్ సాంగ్ షూట్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ పాటకి జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మా సినిమా విడుదల కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

రాజా సాబ్ సరిగమలు


● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'రాజా సాబ్'. మాళవికా మోహనన్, రిద్దీ కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో ఈ సినిమాను టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఆల్రెడీ మొదలై, సగానికి పైగా పూర్తయింది. తాజాగా 'రాజా సాబ్' సినిమాకు చెందిన మ్యూజిక్ సిట్టింగ్ వర్క్స్‌తో బిజీగా ఉన్నారు ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ తమన్. చెన్నైలోని మెరీనా బీచ్‌లో 'రాజా సాబ్' పాటల గురించి చర్చించుకుంటున్నారు మారుతి, తమన్. ఈ సినిమాలో ఐదు పాటలు ఉంటాయని, ఆల్రెడీ మూడు పాటలకు సంబంధించిన ట్యూన్స్‌ను తమన్ పూర్తి చేశారని, మిగిలిన రెండు పాటలకు చెందిన చర్చలు ఇప్పుడు జరుగుతున్నాయని టాక్. ఇక ఇన్ని రోజులు 'కల్కి 2898 ఏడీ' సినిమా ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు ప్రభాస్. దీంతో కొన్ని రోజులు విశ్రాంతి కోసం ఫారిన్ వెళ్తారట. తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్' చిత్రీకరణలో పాల్గొంటారు. అలాగే దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో 'స్పిరిట్', దర్శకుడు హను రాఘవపూడితో ఓ లవ్‌స్టోరీ సినిమా ప్రభాస్ కమిటైన సంగతి తెలిసిందే.

కూలీ ఆగలేదు


● లోకేశ్, రజనీకాంత్

రజనీకాంత్ 'కూలీ' ఆగలేదు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ'. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. కాగా ఇటీవల ఓ సందర్భంలో 'కూలీ' చిత్రీకరణ జూన్ 10న ప్రారంభం కానున్నట్లు రజనీకాంత్ వెల్లడించారు. కానీ ఈ తేదీకి 'కూలీ' సెట్స్‌పైకి వెళ్లలేదు. ఆ తర్వాత దర్శకుడు లోకేశ్ కనగరాజ్ 'ఎక్స్' బయోలో 'కూలీ' సినిమా పేరు కనిపించలేదు. దీంతో ఈ సినిమా ఆగిపోయిందనే పుకార్లు తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై తాజాగా లోకేశ్ కనగరాజ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'కూలీ' చిత్రానికి సంబంధించిన లుక్ టెస్ట్ జరుగుతోందని, జూలైలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని లుక్ టెస్ట్ సెషన్‌లోని ఫొటోను షేర్ చేశారు లోకేశ్.

అడవిలో స్వయంభూ


● నిఖిల్

మారేడుమిల్లిలోని దట్టమైన అడవులకు వెళ్లారు నిఖిల్. ఎందుకంటే 'స్వయంభూ' సినిమా కోసం. నిఖిల్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ పాన్ ఇండియన్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో నభా నటేశ్, సంయుక్తా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ మారేడుమిల్లి ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో జరుగుతోంది. అక్కడి లొకేషన్స్‌లో ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''స్వయంభూ'లో నిఖిల్ వారియర్ పాత్రలో కనిపిస్తారు. ఇందుకోసం ఆయన ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఆస్కార్ నుంచి ఆహ్వానం


● షబానా ఆజ్మీ ● రమ ● రాజమౌళి ● ప్రేమ్ రక్షిత్

ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, ఆయన భార్య, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, బాలీవుడ్ ప్రముఖ నటి షబానా ఆజ్మీ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. దర్శకుల కేటగిరిలో రాజమౌళి, కాస్ట్యూమ్ డిజైనర్ జాబితాలో రమ, ఆర్టిస్ట్ విభాగంలో షబానా ఆజ్మీ ఆస్కార్ అకాడమీలో సభ్యులుగా చేరేందుకు ఆహ్వానం అందుకున్నారు. 'బాహుబలి' చిత్రంతో తెలుగు సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' మూవీతో ప్రపంచపటంలో నిలిపారు. ఆ చిత్రంలోని 'నాటు నాటు...' పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు.. 'ఆర్ఆర్ఆర్' హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, సంగీత దర్శకుడు కీరవాణి, పాటల రచయిత చంద్రబోస్, కెమెరామేన్ కేకే సెంథిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్ గతేడాది 'అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఎమ్‌పీఏఎస్) లో సభ్యత్వం పొందారు. తాజాగా ఆ జాబితాలో రాజమౌళి, రమలతో పాటు 'నాటు నాటు...' కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ చేరారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి 487 మంది సభ్యులకు ఆస్కార్ అకాడమీ ఆహ్వానం పంపింది. వారిలో భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి రాజమౌళి, రమ, ప్రేమ్ రక్షిత్, షబానా ఆజ్మీ, కెమెరామేన్ రవి వర్మన్, దర్శక–నిర్మాత రీమా దాస్, నిర్మాత రితేశ్ సిధ్వానీ ఉన్నారు. ఈ సభ్యులంతా తమ ఓట్లు వేసి ఆస్కార్ విజేతలను ఎంపిక చేస్తారు. ''అకాడమీ ఓటర్స్‌గా ఆహ్వానం అందింది. పెద్దన్న (కీరవాణి), తారక్ (ఎన్టీఆర్), చరణ్ (రామ్‌చరణ్), సాబు సార్, సెంథిల్, చంద్రబోస్... ఇప్పుడు ప్రేమ్, రమ, నేను... ఒక సినిమా ('ఆర్ఆర్ఆర్') తొమ్మిది మందికి ఈ గౌరవం దక్కేలా చేసింది. అకాడమీకి, 'ఆర్ఆర్ఆర్' సినిమాకి ధన్యవాదాలు'' అని 'ఎక్స్' వేదికగా రాజమౌళి పేర్కొన్నారు.

స్పై మిషన్‌లో...

'**స**ర్దార్' స్పై మిషన్‌లో భాగం కానున్నారట హీరోయిన్ ఆషికా రంగనాథ్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'సర్దార్' (2022) ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం 'సర్దార్'కు సీక్వెల్‌గా 'సర్దార్ 2' చేయాలనుకుంటున్నారు హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్. ఇందుకు సంబంధించిన సన్నాహాలు మొదలయ్యాయని టాక్. ప్రస్తుతం నటీనటుల ఎంపికపై మిత్రన్ కసరత్తులు చేస్తున్నారట. ఈ క్రమంలోనే 'సర్దార్ 2'లోని ఓ కీలక పాత్ర కోసం ఆషికాను సంప్రదించారని, ఆమె కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ భోగట్టా. కాగా 'సర్దార్' సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించారు. మరి... సీక్వెల్‌లో ఆషికా పాత్ర హీరోయిన్‌గా ఉంటుందా? లేక ఏదైనా స్పై మిషన్‌లో కీలకంగా ఉంటుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు ఆషిక. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా జనవరి 10న విడుదల కానుంది.


● ఆషికా రంగనాథ్

హైదరాబాద్‌లో వైజాగ్!


● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మట్కా'. ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. వైర ఎంటర్‌టైన్మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం మూడో షెడ్యూల్ ప్రస్తుతం భాగ్యనగరంలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''దేశాన్ని కదిలించిన వాస్తవ ఘటనల ఆధారంగా కరుణ కుమార్ 'మట్కా' స్క్రిప్ట్ తయారు చేశారు. 35 రోజుల లాంగ్ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో రూ. 15 కోట్లతో వింటేజ్ వైజాగ్ సెట్‌లు వేశాం. వైజాగ్‌లోని ఎసెన్స్‌ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ సెట్‌లు సినిమా హైలైట్స్‌లో ఒకటిగా నిలుస్తాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.

క్రిస్మస్‌కు బేబీ జాన్


● వరుణ్ ధావన్

థియేటర్స్‌లోకి 'బేబీ జాన్' రాక మరింత ఆలస్యం అవుతోంది. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు కాలీస్ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'బేబీ జాన్'. హీరోయిన్‌గా కీర్తి సురేష్ బాలీవుడ్‌కు పరిచయం అవుతున్న ఈ చిత్రంలో వామికా గబ్బి మరో హీరోయిన్. తమిళ దర్శకుడు అట్లీ సమర్పణలో మురాద్ ఖేతని, జ్యోతిదేశ్ పాండే, ప్రియా అట్లీ నిర్మించిన ఈ సినిమాను మే 31న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆ తేదీకి విడుదల కాలేదు. తాజాగా 'బేబీ జాన్' సినిమాను క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న విడుదల చేస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

గుడుగుడు గుంజం...


● రేణు ప్రియ, రమేశ్ బాబు

చిమటా రమేశ్ బాబు హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నేను–కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లుగా నటించారు. చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రం అతి త్వరలో విడుదల కానుంది. ఎంఎల్ రాజా సంగీతం అందించిన ఈ మూవీలోని 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం..' అంటూ సాగే ఐటమ్ సాంగ్‌ను నటుడు, నిర్మాత మురళీ మోహన్ విడుదల చేశారు. చిమటా రమేశ్, రేణు ప్రియపై ఈ పాట చిత్రీకరించారు. ''వైవిధ్యమైన కథతో రూపొందించిన చిత్రమిది. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతో పాటు ఆరు ఫైట్స్ ఈ మూవీకి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి'' అన్నారు చిమటా రమేశ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
621	169
78,674	23,890

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,753	▲	33
డోజోన్స్	39,143	▲	31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,210	▼	38
డాక్స్	18,063	▼	115
షాంఘై	2,973	▲	23
నికాయ్	39,667	▲	494

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,267
బంగారం (99.5 స్వచ్ఛత)	70,982
వెండి (కేజీ)	86,994

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.05	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.75	107.30
€	యూరో	ఎస్‌బీఐ	88.34	90.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.72	53.85
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.82	56.76
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.18	63.87
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.39	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.65
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

అణు విద్యుత్ రంగంలోకి మేఘా

- రూ.12,800 కోట్ల ప్రాజెక్టు కైవసం
- కర్ణాటకలో అణు విద్యుత్ ప్లాంటు నిర్మాణం

meil


హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) అణు విద్యుత్ రంగంలోకి ఎంట్రీ ఇస్తోంది. రూ.12,800 కోట్ల విలువైన అణు విద్యుత్ కేంద్ర నిర్మాణ కాంట్రాక్టుకు సంబంధించి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన టెండర్లలో అత్యల్ప బిడ్డర్‌గా నిలిచి ప్రాజెక్టును చేజిక్కించుకున్నట్టు ఎంఈఐఎల్ బుధవారం తెలిపింది. కాంట్రాక్టులో భాగంగా కర్ణాటకలోని కైగా వద్ద 700 మెగావాట్ ఎలక్ట్రికల్ సామర్థ్యంగల రెండు రియాక్టర్ల నిర్మాణాన్ని ఈపీసీ పద్ధతిలో చేపడతామని సంస్థ డైరెక్టర్ సి.హెచ్.సుబ్బయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అణు ఇంధన శాఖ పరిధిలోని ఎన్‌పీసీఐఎల్ ఈ రియాక్టర్ల నిర్మాణానికి గత ఏడాది మే నెలలో టెండర్లు పిలిచింది. 2023 అక్టోబర్ 4న టెండర్ల దాఖలుకు తుది గడువుగా నిర్ణయించారు. అక్టోబర్ 5న సాంకేతిక బిడ్లను, ఈ ఏడాది జూన్ 26న ప్రైస్ బిడ్లను తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువగా రూ.12,799.92 కోట్లను కోట్ చేసి తొలి స్థానంలో నిలిచినట్టు ఎంఈఐఎల్ వెల్లడించింది. ఎల్‌అండ్‌టీ, బీహెచ్‌ఈఎల్ సైతం ఈ ప్రాజెక్టు కోసం పోటీపడ్డాయి. ఎన్‌పీసీఐఎల్ పిలిచిన టెండర్లలో ఇదే పెద్దది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

ముగిసిన స్పెక్ట్రం వేలం కేంద్రానికి 11,341 కోట్లు

- 141.4 మెగాహెట్జ్ విక్రయం
- అత్యధికంగా కొనుగోలు చేసిన ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: ఈసారి టెలికం స్పెక్ట్రం వేలం ప్రక్రియ రెండు రోజుల్లోనే ముగిసింది. మొత్తం రూ. 96,238 కోట్ల బేస్ ధరతో 800 మెగాహెట్జ్ నుంచి 26 గిగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్‌లో 10 గిగాహెట్జ్ స్పెక్ట్రంను వేలానికి ఉంచగా.. ఏడు రౌండ్లలో 141.4 మెగాహెట్జ్ మాత్రమే అమ్ముడైంది. టెల్కోలు సుమారు రూ. 11,340.78 కోట్ల విలువ చేసే బిడ్లు దాఖలు చేశాయి.

ప్రధానంగా గడువు తీరిపోతున్న స్పెక్ట్రంను రెన్యువల్ చేసుకోవడం, కవరేజీని పెంచుకునేందుకు నిర్దిష్ట ఫ్రీక్వెన్సీల్లోనే కొనుగోలు చేసేందుకు టెల్కోలు ప్రాధాన్యమివ్వడం ఇందుకు కారణం. భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా స్పెక్ట్రం కొనుగోలు చేసింది. తొలిరోజైన జూన్ 25న (మంగళవారం) అయిదు రౌండ్లు జరగ్గా, రెండో రోజున పెద్దగా స్పందన లేకపోవడంతో వేలం ముగిసినట్లు బుధవారం అధికారులు ప్రకటించారు. టెల్కోలు తమ సర్వీసులను కొనసాగించడంతో పాటు కార్యకలాపాలను విస్తరించేందుకు కూడా స్పెక్ట్రంను కొనుగోలు చేసినట్లు కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈసారి విక్రయానికి ఉంచిన స్పెక్ట్రంలో 12 శాతానికి మాత్రమే బిడ్లు వచ్చాయి. గత వేలంలోనే టెల్కోలు గణనీయంగా స్పెక్ట్రం తీసుకోవడంతో నిర్దిష్ట బ్యాండ్లకు ఈసారి పెద్దగా డిమాండ్ కనిపించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. 900, 1800 మెగాహెట్జ్ బ్యాండ్‌లపై ఎక్కువగా ఆసక్తి నెలకొంది. 2022లో జరిగిన స్పెక్ట్రం వేలం బ్లాక్‌బస్టర్‌గా నిల్చింది. అప్పట్లో ఏడు రోజులు సాగిన వేలంలో రూ. 1.5 లక్షల కోట్ల విలువ చేసే స్పెక్ట్రంను టెల్కోలు కొనుగోలు చేశాయి. జియో అత్యధికంగా రూ. 88,078 కోట్లతో దాదాపు సగం స్పెక్ట్రంను దక్కించుకుంది.

ఎయిర్‌టెల్ రూ. 6,857 కోట్ల బిడ్..

భారతీఎయిర్‌టెల్ అత్యధికంగా రూ.6,856.76 కోట్లు, వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) రూ. 3,510 కోట్లు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రూ. 973.6 కోట్ల విలువ చేసే స్పెక్ట్రంను కొనుగోలు చేశాయి. ఎయిర్‌టెల్ 97 మెగాహెట్జ్, వీఐఎల్ 30 మెగాహెట్జ్, జియో ఇన్ఫోకామ్ 14.4 మెగాహెట్జ్ దక్కించుకున్నాయి. కస్టమర్లకు మెరుగైన సర్వీసులు అందించేందుకు ఎప్పటికప్పుడు అవసరమైనంత స్పెక్ట్రంను సమకూర్చుకుంటామని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ తెలిపారు. బిహార్, పశ్చిమ బెంగాల్ సర్కిళ్లలో 1,800 మెగాహెట్జ్ స్పెక్ట్రంను కొనుగోలు చేయడం ద్వారా తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నట్లు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ చెప్పారు. నిర్దిష్ట మార్కెట్లలో స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా స్పెక్ట్రంను కొనుగోలు చేసినట్లు వీఐఎల్ సీఈవో అక్షయ ముంద్రా తెలిపారు.

రెండో రోజూ రికార్డుల ర్యాలీ

- రిలయన్స్ దూకుడు
- బ్యాంకింగ్, ఇంధన షేర్లకు డిమాండ్



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (4%), ఐసీఐసీఐ బ్యాంక్ (2%), ఎయిర్‌టెల్ (3%) షేర్లు రాణించడంతో సూచీల రికార్డుల ర్యాలీ రెండో రోజూ కొనసాగింది. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 706 పాయింట్లు ఎగసి 78,759 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 621 పాయింట్ల లాభంతో 78,674 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 169 పాయింట్లు బలపడి 23,890 వద్ద తాజా గరిష్టాన్ని నెలకొల్పింది. ఆఖరికి 148 పాయింట్లు బలపడి 23,869 వద్ద నిలిచింది. క్రూడ్ ధరలు పెరగడం, డాలర్ బలపడటంతో రూపాయి విలువ 14 పైసలు క్షీణించి 83.57 స్థాయి వద్ద స్థిరపడింది.

- సెన్సెక్స్ సూచీ మూడు రోజుల ర్యాలీతో బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.53 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది.
- రిలయన్స్ షేరు 4 శాతం పెరిగి రూ.3,027 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.50% ఎగసి రూ.3,037 జీవితకాల గరిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ రూ.80,359 కోట్లు పెరిగి రూ.20.48 లక్షల కోట్లకు చేరింది.
- డీఈఈ డెవలప్‌మెంట్ ఇంజనీర్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.203)తో 60% ప్రీమియంతో రూ.325 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 80% ఎగసి రూ.366 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 65% లాభంతో రూ.335 వద్ద స్థిరపడింది.
- ఆక్మే ఫిన్‌ట్రేడ్ షేరు ఇష్యూ ధర(రూ.120)తో పోలిస్తే బీఎస్‌ఈలో 5% పెరిగి ప్రీమియంతో రూ.126 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ ఆద్యంతం కొనుగోళ్ల మద్దతు లభించడంతో 10% ఎగసి ఇంట్రాడే గరిష్టం రూ.132 వద్ద స్థిరపడింది.

డాక్టర్ రెడ్డీస్ చేతికి నికోటినెల్ బ్రాండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్‌ఆర్‌టీ)లో ఉపయోగించే బ్రాండ్‌ల కొనుగోలుకు బ్రిటన్‌కు చెందిన కన్సూమర్ హెల్త్‌కేర్ సంస్థ హెలియోన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ ప్రకారం హెలియోన్ గ్రూప్ కంపెనీ నార్త్‌స్టార్ స్విట్జర్లాండ్ ఎస్‌ఏఆర్‌ఎల్ షేర్లను కొనుగోలు చేయనుంది. డీల్ విలువ 500 మిలియన్ పౌండ్లుగా ఉంటుందని, ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో డీల్ పూర్తి కాగలదని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. అమెరికా వెలుపలి మార్కెట్లలో నికోటినెల్, నికాబేట్, హాబిట్రాల్, థ్రైవ్ తదితర బ్రాండ్లను విక్రయించేందుకు ఇది తోడ్పడనుంది.

సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్ వాటా విక్రయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్స్, రవి సంఘీ 3.52% వాటాకు సమానమైన 90,92,000 షేర్లను ఒక్కొక్కటి రూ.90 చొప్పున విక్రయించనున్నారు. ఇందులో అంబుజా సిమెంట్స్ 60,92,000 షేర్ల (2.36% వాటా) అమ్మకం చేపట్టనుంది. ఆఫర్ ఫర్ సేల్ నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు బుధవారం ప్రారంభం అయింది. రిటైల్ ఇన్వెస్టర్లకు గురువారం (నేడు) మొదలు కానుందని సంఘీ ఇండస్ట్రీస్ ప్రకటించింది. 2024 మార్చి 31 నాటికి సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్స్‌కు 60.44 శాతం వాటా ఉంది.

రూ.10 లక్షల కోట్లు!

- స్వదేశానికి మనోళ్లు పంపిన నిధులివి..
- రెమిటెన్సుల్లో ప్రపంచంలోనే టాప్
- ప్రపంచబ్యాంక్ నివేదిక

వాషింగ్టన్: ప్రవాస భారతీయులు స్వదేశం పట్ల అపారమైన అభిమానం చాటుతున్నారు. కష్టార్జితాన్ని తాముంటున్న చోటే దాచుకోకుండా, స్వదేశానికి పెద్ద ఎత్తున పంపిస్తున్నారు. స్వదేశంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. మాతృభూమికి నిధులు పంపించడంలో (రెమిటెన్స్‌లు) ప్రపంచదేశాల్లోనే ప్రథమ స్థానంలో నిలుస్తున్నారు. 2023లో 120 బిలియన్ డాలర్ల (రూ.10లక్షల కోట్లు సుమారు) రెమిటెన్స్‌లను భారత్ అందుకున్నట్టు ప్రపంచబ్యాంక్ తాజాగా ప్రకటించింది. అదే ఏడాది మెక్సికోకు వెళ్లిన 66 బిలియన్ డాలర్ల రెమిటెన్స్‌లతో పోలిస్తే భారత్‌కు రెట్టింపు వచ్చినట్టు తెలిపింది. ఆ తర్వాత చైనాకు 50 బిలియన్ డాలర్లు, ఫిలిప్పీన్స్‌కు 39 బిలియన్ డాలర్లు, పాకిస్థాన్‌కు 27 బిలియన్



డాలర్ల రెమెటెన్స్‌లు వెళ్లాయి. భారత్‌కు 2023లో అత్యధికంగా అమెరికా, యూఏఈ నుంచే రెమిటెన్స్‌లు వచ్చాయి. సీమాంతర చెల్లింపులకు దీర్ఘామ్-రూపీలను అనుమతించడంతో అధికారిక ఛానళ్ల ద్వారా వచ్చే రెమిటెన్స్‌లు పెరిగినట్టు ప్రపంచబ్యాంక్ తెలిపింది. ఇక 2024 సంవత్సరంలో భారత్‌కు 3.7 శాతం అధికంగా 124 బిలియన్ డాలర్ల రెమిటెన్స్‌లు రావచ్చని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. 2025లో మరో 4 శాతం పెరిగి 129 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొంది. భారత్ తన యూపీఐని యూఏఈ, సింగపూర్‌తో అనుసంధానించేందుకు చేపడుతున్న చర్యలు వ్యయాలను తగ్గిస్తుందని, ఇది రెమిటెన్స్‌లను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపింది. వలస పోవడం, వారి ద్వారా స్వదేశానికి నిధుల తరలింపు అన్నది ఆర్థిక, మానవాభివృద్ధికి అత్యవసరమని ప్రపంచబ్యాంక్‌లో సామాజిక పరిరక్షణ విభాగం గ్లోబల్ డైరెక్టర్ ఇఫత్ షరీఫ్ పేర్కొన్నారు.

వేదాంతా ప్రమోటర్‌కు రూ. 4,184 కోట్లు

2.6 శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం వేదాంతా రిసోర్సెస్ తాజాగా దేశీ మైనింగ్ కంపెనీ వేదాంతా లిమిటెడ్‌లో 2.63% వాటాను విక్రయించింది. షేరుకి రూ. 427.21 సగటు ధరలో 9,79,45,940 షేర్లను అమ్మడం ద్వారా రూ. 4,184 కోట్లు సమీకరించింది. బల్క్ డీల్ ద్వారా అనుబంధ సంస్థ ఫిన్‌సైడర్ ఇంటర్నేషనల్ ఈ లావాదేవీని చేపట్టింది. దీంతో వేదాంతాలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ సంయుక్త వాటా 61.95 శాతం నుంచి 59.32 శాతానికి తగ్గింది.

బీఎస్‌ఈలో వేదాంతా షేరు దాదాపు 3 శాతం క్షీణించి రూ. 442 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐపీఈ, విశాఖపట్నంలో బీటెక్ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 165.
» **సీట్ల వివరాలు:** పెట్రోలియం ఇంజనీరింగ్-62, కెమికల్ ఇంజనీరింగ్-63, మెకానికల్ ఇంజనీరింగ్-40.
» **అర్హత:** కనీసం 75 శాతం మార్కులతో 12వ తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ అడ్వాన్స్‌డ్-2024లో అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ-అడ్వాన్స్‌డ్ 2024 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**05.07.2024
» **వెబ్‌సైట్:** https://iipe.ac.in

ఐఐపీఈ, విశాఖపట్నంలో ఎంటెక్ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** వెబ్ బేస్డ్ ఎంటెక్(డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) ప్రోగ్రామ్.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 30 సీట్లు.
» **అర్హత:**కనీసం 55శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ లేదా మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.07.2024
» **రాతపరీక్ష/ఇంటర్వ్యూ తేదీలు:** 22.07.2024, 23.07.2024.
» **తరగతుల ప్రారంభం:** 12.08.2024.
» **వెబ్‌సైట్:** https://iipe.ac.in

ఆర్ఎంఎల్‌హెచ్, న్యూఢిల్లీలో 140 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఆర్ఎంఎల్‌హెచ్), డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్.. రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 140.
» **విభాగాలు:** ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాక్ అనెస్తీషియా, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఓ-జీ, మెడిసిన్, మైక్రోబయాలజీ, నియోనాటాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, పీఎంఆర్, రేడియాలజీ, సర్జరీ, అనెస్తీషియా, అనాటమీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజియాలజీ, ఫార్మకాలజీ.
» **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి 2,08,700.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్/రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెంట్రల్ డైరీ అండ్ డిస్పాచ్ సెక్షన్,గేట్ నెం.3,ఏబీవీఐఎంఎస్ అండ్ డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్,న్యూఢిల్లీ-110001చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.06.2024.
» **రాతపరీక్ష తేది:** 28.07.2024.
» **వెబ్‌సైట్:** https://rmlh.nic.in

ఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్ష-2024

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్) పరీక్ష-2024కు సంబంధించి వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17,727.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్ /జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, ఆడిటర్, అకౌంటెంట్, అకౌంటెంట్/జూనియర్ అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియంట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, టాక్స్ అసిస్టెంట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** టైర్-1, టైర్-2 తదితర పరీక్షల ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.07.2024
» **వెబ్‌సైట్:** https://ssc.gov.in

కోర్సు, కాలేజీ.. ఎంపిక ఎలా!

బీటెక్.. ఇంజనీరింగ్ కోర్సుతో ఉజ్వల కెరీర్ అందుకోవచ్చనే అభిలాష! మెడిసిన్.. ఎంబీబీఎస్, బీడీఎస్‌లతో వైద్య రంగంలో స్థిరపడొచ్చనే ఆశయం! ఇందుకోసం సంబంధిత ఎంట్రన్స్‌లకు లక్షల మంది విద్యార్థులు హాజరై.. ఉత్తీర్ణత సాధించిన పరిస్థితి! అదే సమయంలో తాము సాధించిన ర్యాంకుకు.. నచ్చిన కోర్సులో, కాలేజీలో సీటు వస్తుందో లేదో అనే సందేహం! ముఖ్యంగా ఇంజనీరింగ్‌లో ఎన్నో బ్రాంచ్‌లు, వందల సంఖ్యలో కాలేజీలు!! ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల్లో చేరే విద్యార్థులు కోర్సు, కాలేజ్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

» ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల సమయం
» కోర్సు, కాలేజ్‌లలో దేనికి ప్రాధాన్యం అనే సందిగ్ధత
» ఆసక్తికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలంటున్న నిపుణులు

కోర్సు, కాలేజ్ ఎంపికలో ముందుగా కోర్సు/బ్రాంచ్‌కే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బ్రాంచ్ ఎంపికలో విద్యార్థులు తమ ఆసక్తిని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. కేవలం క్రేజ్ కోణంలోనే బ్రాంచ్‌లను ఎంపిక చేసుకుంటే.. అకడమిక్‌గా రాణించలేకపోవచ్చు. ఇది భవిష్యత్తు గమ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ఆస్కారముంది. కాబట్టి బ్రాంచ్ ఎంపికలో అందుబాటులో ఉన్న బ్రాంచ్‌ల సిలబస్,కరిక్యులం స్వరూపాన్ని పరిశీలించి తమ సహజ ఆసక్తికి అనుగుణంగా ఉండే బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి.

ఇన్‌స్టిట్యూట్ కీలకమే

ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు ఇన్‌స్టిట్యూట్ ఎంపిక కూడా ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ఈఏపీసెట్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఇంజనీరింగ్ కోర్సుల్లో దాదాపు అందరికీ సీట్లు లభిస్తాయి. కానీ.. పేరున్న కాలేజీలో చేరితే నాణ్యమైన బోధనతోపాటు మెరుగైన ప్లేస్‌మెంట్స్ అవకాశాలు అందుకునే వీలుంటుంది.

నిబంధనలు పాటిస్తున్నాయా

ఇన్‌స్టిట్యూట్ ఎంపికలో విద్యార్థులు.. సదరు ఇన్‌స్టిట్యూట్స్ ఏఐసీటీఈ నిబంధనలను పాటిస్తున్నాయా.. లేదా.. అనే విషయాన్ని పరిశీలించాలి. కరిక్యులం, ఫ్యాకల్టీ, ల్యాబ్ సౌకర్యం వంటి కీలక అంశాలు మొదలు.. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వరకూ.. అన్నీ నిబంధనల మేరకు ఉన్నాయా లేదో గమనించాలి. ఈ సమాచారం ఏఐసీటీఈ వెబ్‌సైట్‌లో లభిస్తుంది. ఒకవేళ అందులో సమాచారం లేకపోతే ప్రత్యక్షంగా కళాశాలలను పరిశీలించి సదరు సమాచారం తెలుసుకోవాలి.

ఎన్‌బీఏ గుర్తింపు

ఆసక్తి ఉన్న బ్రాంచ్ విషయంలో సదరు ఇన్‌స్టిట్యూట్‌కు ఎన్‌బీఏ గుర్తింపు ఉందా? లేదా? అనే విషయం కూడా పరిగణించాలి. కారణం.. ఎన్‌బీఏ గుర్తింపు బ్రాంచ్ వారీగా ఉంటుంది. కొన్ని కళాశాలలు మొత్తం బ్రాంచ్‌లలో ఒకట్రెండు బ్రాంచ్‌లకే ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నా.. ఎన్‌బీఏ అక్రెడిటెడ్ అని వెబ్‌సైట్లలో ఆకర్షణీయంగా ప్రకటనలిస్తున్నాయి. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కాలేజ్.. ఇమేజ్

విద్యార్థులు కాలేజ్ ఎంపికలో పరిగణించాల్సిన మరో విషయం.. కాలేజ్‌కు ఉన్న గుర్తింపు. ఇండస్ట్రీ వర్గాల్లో ఇన్‌స్టిట్యూట్‌కు ఎలాంటి గుర్తింపు ఉందో తెలుసుకోవడం మేలు చేస్తుంది. ఇందుకోసం విద్యార్థులకు ఉపకరించే సాధనం గత ఏడాది సదరు కాలేజ్‌లో సీట్ల భర్తీలో ఓపెనింగ్-క్లోజింగ్ ర్యాంకుల వివరాలు. ఉదాహరణకు ఓయూసీఈ, ఏయూసీఈ వంటి యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, అదే విధంగా కొన్ని ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లో ఈసీఈ, సీఎస్ఈ, ట్రిపుల్ఈ వంటి బ్రాంచ్‌లలో లాస్ట్ ర్యాంకు 1500 నుంచి 2000 లోపే ఉంటోంది. అంటే.. ఆ కళాశాలలు అనుసరిస్తున్న ప్రమాణాలు, ఇండస్ట్రీలో ఉన్న పేరు, ప్లేస్‌మెంట్స్ ఆధారంగా టాప్ ర్యాంకర్ల ఆదరణ పొందుతున్నాయని చెప్పొచ్చు.

బోధన విధానాలు

విద్యార్థులు కాలేజ్ ఎంపికలో బోధన పద్ధతుల విషయంలోనూ దృష్టి పెట్టాలి. ఒక కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ.. టీచింగ్ విధానంలో లోపాలు ఉండొచ్చు. ఈ విషయాన్ని కూడా ప్రత్యక్షంగా పరిశీలించాలి. టీచింగ్ పరంగా అనుసరిస్తున్న విధానం,ప్రాక్టికల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, అందులో విద్యార్థులను మమేకం చేస్తున్న తీరుతెన్నులపై సునిశిత పరిశీలన చేయాలి. కొన్ని కళాశాలలు ఏఐసీటీఈ నిబంధనల మేరకు తమ కళాశాలలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీ ఉన్నారని ప్రకటనలిస్తుంటాయి. ఫ్యాకల్టీ అర్హతలతోపాటు క్లాస్ రూంలో స్టూడెంట్స్‌తో ఇంటరాక్షన్, సందేహాల నివృత్తి వంటివి కూడా తెలుసుకోవాలి.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

బీటెక్ కోర్సులో చేరే లక్ష్యం.. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అనేది నిస్సందేహం. నాలుగేళ్ల బీటెక్ కోర్సులో



చేరే ప్రతి విద్యార్థి ప్రధాన ఉద్దేశం భవిష్యత్తులో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోవడం. కాబట్టి కళాశాలను ఎంపిక చేసుకునేటప్పుడు ఆ ఇన్‌స్టిట్యూట్‌లో గత నాలుగేళ్ల ప్లేస్‌మెంట్ రికార్డ్స్.. ఎలాంటి కంపెనీలు వస్తున్నాయి. వచ్చిన కంపెనీలు ఎలాంటి ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయో తెలుసుకోవాలి.

నచ్చిన కాలేజీలో సీటు రాకుంటే

నచ్చిన కాలేజ్‌లో సీటు రాకుంటే ఏం చేయాలి? అనే ప్రశ్న ఎక్కువ మంది విద్యార్థులకు ఎదురవుతుంది. కొన్నిసార్లు కౌన్సెలింగ్‌లో విద్యార్థి ఎంపిక చేసుకున్న కళాశాలలో ప్రవేశం దక్కకపోవచ్చు. అందుకు విద్యార్థులు ముందుగానే మానసికంగా సిద్ధంగా ఉండాలి. మెచ్చిన కాలేజ్‌లో సీటు రాకపోయినా.. అకడమిక్‌గా రాణించేందుకు స్వయం కృషి చేయాలి. ఫ్యాకల్టీ లేరనో లేదా సదుపాయాలు లేవనో అభ్యసనాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. సెల్ఫ్ లెర్నింగ్ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెట్ ఆధారంగా అనంతమైన సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఈ-లెర్నింగ్ పోర్టల్స్ ఆవిష్కృతమవుతున్నాయి. ఆన్‌లైన్ లెక్చర్స్, వర్చువల్ క్లాస్‌రూమ్స్, వర్చువల్ లేబొరేటరీ వంటి సదుపాయాలు సైతం లభిస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని తమను తాము తీర్చిదిద్దుకోవాలి.

మెడిసిన్‌లోనూ.. అప్రమత్తంగా

ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడిసిన్ కోర్సుల అభ్యర్థులు సైతం కాలేజీ, కోర్సు ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రస్తుతం తమకు వచ్చిన ర్యాంకు.. గత ఏడాది అదే ర్యాంకుకు సీట్లు ఖరారైన ఇన్‌స్టిట్యూట్‌లను గుర్తించాలి. అలా గుర్తించిన ఇన్‌స్టిట్యూట్స్‌లో.. పేరున్న ఇన్‌స్టిట్యూట్‌ల జాబితా సిద్ధం చేసుకోవాలి. ఇందుకోసం.. హెల్త్ యూనివర్సిటీలు విడుదల చేసే ల్యాస్ట్ ర్యాంక్స్ గణాంకాలను పరిశీలించాలి. తాము ప్రస్తుతం పొందిన ర్యాంకు.. గత ఏడాది ఆయా ఇన్‌స్టిట్యూట్స్, కోర్సులలో సీట్లు లభించిన లాస్ట్ ర్యాంక్‌లను గుర్తించి.. కళాశాలలు, కోర్సుల ఎంపిక కసరత్తు చేయాలి.

ఆల్ ఇండియా కోటా

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆల్ ఇండియా కోటా విధానం అమల్లో ఉంది. దీని ద్వారా నీట్ ఉత్తీర్ణులు ఇతర రాష్ట్రాల్లోని మెడికల్ కళాశాలల్లో 15 శాతం సీట్లకు పోటీ పడే అవకాశం ఉంది. ఈ కోటాలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు.. ఈ ప్రక్రియలో పాల్గొంటున్న ఇన్‌స్టిట్యూట్స్, వాటి ప్రామాణికతను పరిశీలించాలి. దాని ఆధారంగా..ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో ప్రాథమ్యాలను పేర్కొనాలి. ఒకవేళ తొలి దశలో తమకు నచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో సీటు రాకున్నా.. మలి దశ కౌన్సెలింగ్‌లో అవకాశం దక్కించుకునేలా ప్రయత్నించాలి.

ప్రత్యామ్నాయాలకు సిద్ధంగా

బీటెక్, ఎంబీబీఎస్, బీడీఎస్, అగ్రికల్చర్ విద్యార్థులు కోరుకున్న కోర్సులో సీటు రాకుంటే.. ప్రత్యామ్నాయ కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉండాలి. ఉదాహరణకు..బీటెక్ విద్యార్థుల్లో అధిక శాతం మంది సీఎస్ఈకి తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఈ బ్రాంచ్‌లో సీటు రాకపోతే.. ఎలాంటి ఆందోళన చెందక్కర్లేదు. ఎందుకంటే.. ఇప్పుడు పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో సీఎస్ఈలోనే ఏఐ-ఎంఎల్ బ్రాంచ్‌ను ప్రత్యేకంగా అందిస్తున్నారు. కాబట్టి సీఎస్ఈ రాకపోయినా.. ఏఐ-ఎంఎల్ కోర్సుల్లో చేరొచ్చు. అదేవిధంగా మెడిసిన్‌కు సంబంధించి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ లభించకుంటే.. బీడీఎస్‌లో చేరొచ్చు. ఒకవేళ ఈ రెండు కోర్సుల్లోనూ సీటు లభించకపోతే.. ప్రత్యామ్నాయంగా ఉన్న ఆయుష్ కోర్సులపై దృష్టి సారించొచ్చు. బైపీసీ విద్యార్థులకు అగ్రికల్చర్ కోర్సులు కూడా చక్కటి ప్రత్యామ్నాయాలుగా నిలుస్తున్నాయి. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా ప్రత్యామ్నాయ కోర్సులను ఎంచుకోవచ్చు.

ఆసక్తికి ప్రాధాన్యం

వందల సంఖ్యలో ఇన్‌స్టిట్యూట్స్, కోర్సులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ముందుగా తమ ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలనేది నిపుణుల అభిప్రాయం. ఆసక్తికి భిన్నంగా ఇతరుల ఒత్తిడితో ఇష్టంలేని కోర్సులో చేరితే.. అది భవిష్యత్తులో ప్రతికూల ప్రభావం చూపుతుందని అంటున్నారు. ఏఐసీటీఈ నిబంధనల మేరకు.. బోధన పద్ధతులు పాటించే ఇన్‌స్టిట్యూట్‌లో తమకు నచ్చిన బ్రాంచ్‌లో చేరడం మేలంటున్నారు. ఆ తర్వాత స్వీయ అభ్యసనానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా...

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: పద్మ అవార్డులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ప్రద్యుమ్న బుధవారం తెలిపారు. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకటించే పద్మ అవార్డులకు అర్హులైన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1లోగా www.padmaawards.gov.in వెబ్‌సైట్‌తో పాటు sportsinap@gmail.com, incentives.schemes@gmail. com మెయిల్స్‌కు కూడా దరఖాస్తులు పంపించాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో చాతుర్య స్టేట్ ఫస్ట్



ఒంగోలు: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ప్రకాశం జిల్లా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్య రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ గ్రూపులో 500 మార్కులకు గాను 490 మార్కులు సాధించింది. సబ్జెక్టుల వారీగా ఇంగ్లిష్ 96, హిందీ 99, ఎకనామిక్స్ 97, హిస్టరీ 99, సివిక్స్ 99 మార్కులు పొందింది. ప్రతిభ చూపిన విద్యార్థిని చాతుర్యను ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ప్రాంతీయ మండలి పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ అభినందించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో తిరుమల జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470కి 468 మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారని చెప్పారు. 465పైన 262 మంది, 460పైన మార్కులు 1,459 మంది కైవసం చేసుకున్నారని తెలిపారు. బైపీసీ విభాగంలో షేక్ ఫాతిమున్నీసా బేగం 440కి 438 మార్కులు, 435పైన 41మంది, 430పైగా 192 మంది, 400పైగా మార్కులు 424 మంది సాధించారని వివరించారు.

క్రైం..కామెడీతో 'సంక్రాంతికి వస్తున్నాం'

సినీ దర్శకుడు అనిల్ రావిపూడి

సింహాచలం: విక్టరీ వెంకటేష్ హీరోగా క్రైమ్, కామెడీ కలయికతో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని తీస్తున్నట్లు ఆ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఆయన దర్శించుకున్నారు. సినిమా స్క్రిప్టును స్వామి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో సంక్రాంతికి విడుదలైన ఎఫ్–2, సరిలేరు నీకెవ్వరు సినిమాలను చూసి ప్రేక్షకులు ఎంత ఎంజాయ్ చేశారో అలాగే ఈ చిత్రం కూడా అలాగే ఉంటుందని తెలిపారు. వైజాగ్ అంటే తనకు ఎంతో సెంటిమెంట్ అని, అన్ని సినిమాల కథలను వైజాగ్ వచ్చి రాసుకోవడం, ఆ కథలను సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చెంత ఉంచి పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీలో రాజకీయ బదిలీలు

కేవలం రెండు వారాల్లో 102 మందికి పైగా స్థానచలనం

- వీరిలో 38 మంది ప్రొఫెసర్లు, 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- 16 మంది డీన్స్ కూడా బదిలీ
- కనీస నిబంధనలు పాటించకుండా బదిలీ ఉత్తర్వులు
- దూరప్రాంతాలకు బదిలీలతో వర్సిటీ సిబ్బందిలో ఆందోళన
- లోకేశ్ సిఫార్సులతోనే వర్సిటీలో ఈ బది'లీలలు'
- ఈ స్థాయిలో బదిలీలు ఆంగ్రూ చరిత్రలో ఇదే తొలిసారి
- ఓ సామాజిక వర్గం లక్ష్యంగా చర్యలు
- ఆ స్థానాల్లో నేతలకు నచ్చిన వారికి పోస్టింగులు



సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే కక్షసాధింపు చర్యలకు తెగబడుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. చివరికి చదువుల నిలయాలైన విశ్వవిద్యాలయాల పైనా పడింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే అధ్యాపకులు, జాతి గర్వించేలా పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలను కూడా రాజకీయాలకు బలి చేస్తోంది. విశ్వవిద్యాలయాలపై పెత్తనం చెలాయించేందుకు, కక్ష సాధింపు చర్యలకు అధికార కూటమి నేతలు బదిలీలకు తెరతీశారు. మరీ ముఖ్యంగా గడిచిన ఐదేళ్లుగా పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయం (ఆంగ్రూ)లో కక్ష సాధింపు బదిలీలకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా ఏటా 3 నుంచి 5 సంవత్సరాలు ఒక చోట పని చేసిన వారిని బదిలీ చేస్తుంటారు. ఇప్పుడు ఆంగ్రూలో సంబంధిత శాఖామంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు అధికార టీడీపీ కీలక నేతల సిఫార్సులతో అడ్డగోలుగా బదిలీ చేస్తుండటం వివాదాస్పదమవుతోంది. ముఖ్యంగా ఒక సామాజిక వర్గం సిబ్బందే లక్ష్యంగా బదిలీలు జరుగుతున్నాయని, ఆ స్థానాల్లో కూటమి నేతలకు నచ్చిన వారికి పోస్టింగులు ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆంగ్రూ చరిత్రలోనే తొలిసారి

యూనివర్సిటీలో హెచ్‌వోడీలనే కాదు.. బోధన, బోధనేతర సిబ్బందిని కూడా నిబంధనలకు పాతరేసి మరీ ఇష్టానుసారం బదిలీ చేస్తుండటంపై సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. చివరికి పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలను కూడా వదిలి పెట్టలేదు. ఆఘమేఘాల మీద ఉత్తర్వులు జారీ చేసి రెండు వారాల్లోనే 102 మందిని బదిలీ చేశారు. ఇంత మందిని ఒకేసారి బదిలీ చేయడం ఆంగ్రూ చరిత్రలో ఇదే తొలిసారి అని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు 38 మంది ప్రొఫెసర్లు, 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 16 మంది అసోసియేట్ డీన్స్, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఐదుగురు యూనివర్సిటీ ఆఫీసర్లు, ముగ్గురేసి చొప్పున అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లతో పాటు అసిస్టెంట్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్లను కూడా బదిలీ చేశారు. మరికొంత మందిని బదిలీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నిబంధనలకు పాతరేసి..

సర్వీస్ రూల్స్‌ను సైతం బేఖాతరు చేస్తూ కేవలం రాజకీయ ఒత్తిళ్లతోనే బదిలీలు చేస్తున్నారని అధ్యాపకులు వాపోతున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఉన్నఫళంగా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా శాస్త్రవేత్తలు, అధికారుల కుటుంబ, ఆరోగ్య పరిస్థితులను సైతం పట్టించుకోకుండా బదిలీ చేస్తున్నారని వాపోతున్నారు. తిరుపతి ఎస్వీ అగ్రి కల్చరల్ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న 15 మంది అధ్యాపకులు, శాస్త్రవేత్తలను 300 నుంచి 500 కిలోమీటర్ల దూరం ఉన్న పరిశోధన కేంద్రాలు, కళాశాలలకు బదిలీ చేశారని, పైగా వెంటనే విధుల నుంచి రిలీవ్ చేసి బదిలీ చేసిన స్థానాలలో చేరాలని ఆదేశించారని తెలిపారు. గతంలో బదిలీ చేయాలని బతిమిలాడినా పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు ఇప్పుడు ఎడాపెడా బదిలీలు చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. అధికార పార్టీ నేతలు వారికి అనుకూలమైన వారికి పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు మౌఖికంగా ఆదేశించిన వెంటనే బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ బదిలీలు చేస్తున్నారని, ఆ స్థానాల్లో నేతలకు అనుకూలమైన వారికి పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. శాస్త్రవేత్తలను ఇష్టానుసారం బదిలీ చేయడం వలన ఆ ప్రభావం పరిశోధనలపై పడుతుందని చెబుతున్నారు. పవిత్రమైన విద్యాలయాల్లో మితిమీరిన రాజకీయజోక్యం సరికాదని విద్యా నిపుణులు హితవు పలుకుతున్నారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- 63,548 మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం విడుదల చేశారు. ఈ నెల 18న రెండో సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. మొదటి ఏడాది పరీక్షలకు 1,46,750 మంది (43 శాతం) విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 63,548 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో జనరల్ విభాగంలో 56,836 మంది ఉండగా, ఒకేషనల్‌లో 6,712 మంది విద్యార్థులు ఉన్నారు. ఉత్తీర్ణులైన వారిలో 32,500 మంది బాలురు(41 శాతం) కాగా, 31,048 మంది బాలికలు(46 శాతం) ఉన్నారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ మార్కులను పెంచుకునేందుకు కూడా ఈ ఏడాది అత్యధిక మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 2,10,820 మంది ఇంప్రూవ్‌మెంట్ రాయగా, 1,64,716 మంది (78 శాతం) విజయం సాధించారు. కాగా, ఇంటర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,99,756 మంది హాజరు కాగా, 3,97,604 మంది విజయం సాధించారు. సప్లిమెంటరీలో మార్కులు తగ్గిన విద్యార్థులు రీ వెరిఫికేషన్ కోసం శుక్రవారం నుంచి జూలై 4వ తేదీ వరకు రూ.1000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం కంట్రోలర్ వీవీ సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు షార్ట్ మార్కుల మెమో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి https://bieap.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

చిరుధాన్యాల పరిశోధనపై నేడు అఖిల భారత సదస్సు

ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐఐఎమ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి

తిరుపతి సిటీ: రైతు సంక్షేమమే లక్ష్యంగా చిరుధాన్యాల పరిశోధనపై గురువారం నుంచి రెండు రోజుల పాటు అఖిల భారత జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. చిరుధాన్యాల పంటలపై విశ్లేషణాత్మక పరిశోధనలు చేసి రాబోవు సంవత్సరానికి ఎటువంటి పంటలు రైతులకు లాభదాయకంగా ఉంటాయో ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్), ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో తిరుపతి ఆర్ఏఆర్ఎస్ సహకారంతో వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. అధిక దిగుబడి నిచ్చే చిరుధాన్యాల వంగడాలను ఎంపిక చేసి, అధిక పోషకాలు కలిగిన రకాలను ప్రోత్సహించేందుకు ఈ సదస్సులో చర్చించి రైతులకు సూచిస్తామన్నారు. చిరుధాన్యాల పంటలలో దేశవ్యాప్తంగా విడుదలైన రకాలు, అభివృద్ధి పరచిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై సమగ్రంగా శాస్త్రవేత్తలతో చర్చిస్తామన్నారు. సజ్జ పంటకు 59వ, జొన్నకు 54వ, చిరుధాన్యాల పంటలకు 35వ వార్షిక సమావేశంగా సదస్సును పేర్కొనవచ్చన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వ్యవసాయ వర్సిటీలు, పరిశోదనా సంస్థల నుంచి డైరెక్టర్లు, ప్రధాన శాస్త్రవేత్తలు సుమారు 220 మందికి పైగా ఈ సదస్సుకు హాజరవుతారని చెప్పారు.

ఉద్యాన వర్సిటీలో కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్

ప్రారంభించిన వీసీ డాక్టర్ జానకీ రామ్



సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పశ్చిమ గోదావరి జిల్లాలో, వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. జాతీయ వ్యవసాయ ఉన్నత విద్య ప్రాజెక్ట్ (ఎన్ఏహెచ్ఈపీ) కింద జాతీయ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం), భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక కేంద్రాన్ని విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీ రామ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సమర్థమైన కమ్యూనికేషన్, టీం వర్క్, క్రిటికల్ థింకింగ్, భావోద్వేగ మేధస్సు వంటి నైపుణ్యాలను అలవర్చుకొని, తాము ఎంచుకున్న ఔత్సాహిక రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి.ఆర్. సలోమి సునీత మాట్లాడుతూ ఎన్ఏహెచ్ఈపీ మార్గదర్శకాల ప్రకారం కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్, పూర్వ విద్యార్థుల కో–ఆర్డినేషన్, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేషన్, ఐడియా ఫిట్టింగ్ ప్రోగ్రాం అనే ఐదు లక్ష్యాలతో ఈ కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ పనిచేస్తుందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా బలమైన వ్యక్తిత్వ లక్షణాలు, నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. ఏయూ డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం సాల్మన్ రాజు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎస్.సూర్య కుమారి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్. నారం నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విస్తారంగా వానలు!

- అక్కడక్కడ భారీ వర్షాలు
- గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురుగాలులు
- ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే ప్రమాదం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో గురువారం, శుక్రవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని బుధవారం భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని తెలిపింది. గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా ప్రస్తుతం మధ్య గుజరాత్ ప్రాంతంలో ఆవర్తనం కొనసాగుతోంది. తూర్పు విదర్భ వరకు ద్రోణి విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో వచ్చే ఐదు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, గురువారం, శుక్రవారం కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. గురు, శుక్రవారాల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కృష్ణా జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే గురువారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని వెల్లడించింది. కాగా బుధవారం అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో 7.4 సెం.మీ, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో 7.01 సెం.మీ, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో 6.08 సెం.మీ వర్షం కురిసింది.

'పది' సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

- రాష్ట్రవ్యాప్తంగా 62.21 శాతం ఉత్తీర్ణత
- ఒకటో తేదీ వరకు రీ కౌంటింగ్‌కు అవకాశం

సాక్షి, అమరావతి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సచివాలయంలోని కార్యాలయంలో విడుదల చేసి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మే 24 నుంచి జూన్ 10వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు మొత్తం 1,07,833 మంది విద్యార్థులు హాజరు కాగా, 67,115 మంది (62.21 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 40,638 (59.99 శాతం), బాలికలు 26,477 (65.96 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీలో 96.15 శాతం అత్యధిక ఉత్తీర్ణతతో ప్రకాశం జిల్లా ముందుండగా, కర్నూలు జిల్లాలో అత్యల్పంగా 30.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మార్కులిస్టులను విద్యార్థులు నేరుగా www.resul ts.bse.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. గురువారం నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్ణీత ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రీ–కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు స్వీకరించగా, ఈ ఏడాది నుంచి కమిషనరేట్ వెబ్‌సైట్ www.bse.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

డి ఉంటేనే ఢీ!

ఆరోగ్యం కావాలంటే విటమిన్ డి తప్పనిసరి



- లోపిస్తే శరీరం రోగాలమయం
- సూర్యరశ్మి శరీరానికి తాకకపోవడంతో ఇబ్బందులు
- తగ్గుతున్న వ్యాధి నిరోధకశక్తి
- వైద్య పరీక్షల్లో వెలుగు చూస్తున్న వైనం
- కాస్త ఎండన పడండి.. అంటున్న వైద్యులు


లబ్బీపేట(విజయవాడతూర్పు): మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్ డి చాలా అవసరం. సూర్యకిరణాల నుంచి సహజంగా లభించే 'విటమిన్ డి'కి దూరమైతే మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. అందుకే బద్ధకం వీడి ఉదయాన్నే లేవండి. కాస్త ఎండన పడండి, ఆరోగ్యంతో జీవించండి అంటూ వైద్యులు సూచిస్తున్నారు.

మారిన లైఫ్‌స్టైల్..

మారుతున్న కాలానుగుణంగా చదువు, ఉద్యోగాలు, వ్యాపారాలతో మనిషి జీవితం నిరంతరం బిజీ బిజీగా మారుతోంది. ఉదయం 8 గంటలైనా లేవక పోవడం, రాత్రి 12 దాటినా మేల్కొని ఉండటం, నగర వాసులకు నిత్యకృత్యమైంది. చాలా మంది నగర వాసులకు సూర్యోదయమే తెలియకుండా పోతోంది. తద్వారా డి విటమిన్‌కు దూరమై అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు తెల్లవారు జామున 5 గంటలకే నిద్రలేచి దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యే వారు. కానీ రోజులు మారాయి. సిటీ జనులు మాత్రం చాలా మంది ఉదయం 8 గంటల తర్వాతనే నిద్రలేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు చక్కబెట్టుకుని రోడ్డు మీదకు వచ్చేటప్పటికీ ఎండ మండుతోంది. దీంతో ఉదయపు వేళల్లో సూర్యరశ్మి కారణంగా శరీరానికి అందే విటమిన్ డి పొందలేక పోతున్నారు. ఇటీవల కాలంలో వైద్యుల వద్దకు విటమిన్ డి లోపం సమస్యలతో వస్తున్న వారి సంఖ్య పెరిగింది. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి అన్ని రకాల విటమిన్‌లు అందాలి. ఏ ఒక్క విటమిన్ తక్కువైనా శరీరం అనారోగ్యానికి గురవుతుంది. అందులో విటమిన్ డి చాలా ప్రధానమైంది. కండరాలు, ఎముకలు, ప్రతి ఒక్క భాగం ఆరోగ్యంగా ఉండాలంటే డి విటమిన్ తప్పనిసరి.

విటమిన్ డి తక్కువైతే..

శరీరంలో విటమిన్ డి తక్కువైతే తీవ్రమైన అలసట, బలహీనత, నీరసం, నడుం నొప్పి, బలహీనమైన కండరాలు, ఆలోచన శక్తి తగ్గిపోవడం, డిప్రెషన్, మానసిక స్థితిలో తేడా కనిపిస్తుంది. తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడతారు. తరచుగా ఎముకలు విరగడం, పగుళ్ల రావడంతో పాటు, జుట్టు రాలడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మెదడు పనితీరుపైనా తీవ్ర ప్రభావం ఉంటుంది. వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. పిల్లల్లో రికెట్స్, పెద్దల్లో కీళ్ల వ్యాధులు వస్తాయి. ఇన్సులిన్‌పై ప్రభావం చూపుతుంది. దీంతో రక్తంలోని గ్లూకోజ్ త్వరగా ఖర్చుకాకపోవడంతో సుగర్ వస్తుంది. మహిళల్లో మోనోపాజ్ తర్వాత సహజంగా కాల్షియం తగ్గుతుంది. కాల్షియం తగ్గితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ.



నవజాత శిశువులకు అవసరమే..

ఒకప్పుడు పుట్టిన బిడ్డని కాసేపు ఎండలో ఉంచేవారు. తద్వారా చిన్నారులకు డి విటమిన్ సమృద్ధిగా లభించేది. కానీ ప్రస్తుతం పిల్లలను ఎండలో తిప్పితే నల్లబడి పోతారని, ఇంటి నుంచి బయటకు తీసుకురావడమే లేదు. దీంతో చిన్నారులకు నేరుగా సూర్యరశ్మి అందే అవకాశం లేకుండా పోతోంది. విటమిన్ డి చిన్నారులకు సమృద్ధిగా అందితే బరువు పెరగడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

నీడపట్టున ఉద్యోగం అనుకుంటే..

నీడపట్టున కూర్చుని పనిచేసే ఉద్యోగం అంటే చాలా లగ్జరీగా భావిస్తారు. కానీ ఇదే వారి అనారోగ్యానికి కారణం అవుతోంది. ఎండ బారిన పడకుండా హాయిగా ఏసీ గదిలో కూర్చుని పని చేసే వారికి విటమిన్ డి లోపం అధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆఫీస్ గదుల్లోనే ఉండే ఉద్యోగులు, షిఫ్ట్ ఉద్యోగులు, హెల్త్ కేర్ వర్కర్స్‌కు విటమిన్ డి లోపం ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

విటమిన్ డి అవసరం..



శరీరానికి డి విటమిన్ ఎంతో అవసరం. విటమిన్ డి లోపంతో కండరాలు, ఎముకలు బలహీన పడతాయి. ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధకశక్తిని పెంచుకునేందుకు విటమిన్ డి అవసరం. ఇది సహజంగా సూర్యరశ్మి ద్వారా లభిస్తుంది. ఎండలో కొద్దిసేపు గడపడంతో పాటు వైద్యుల సూచనలు పాటిస్తే డి విటమిన్ లోపాన్ని అధిగమించవచ్చు. ఇటీవల కాలంలో విటమిన్ డి లోపం ఉన్న వారిని ఎక్కువగా చూస్తున్నాం.

– డాక్టర్ కె. సుధాకర్, ఆర్థోపెడిక్ నిపుణుడు, జీజీహెచ్

వీటిల్లో విటమిన్ డి పుష్కలం..



చేపలు, లివర్, కాడ్‌లివర్ ఆయిల్, కోడిగుడ్లు, ఆర్గాన్ మీట్స్, పాలు, పన్నీరు, నెయ్యి, వెన్న, పుట్టగొడుగుల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆహారంలో ఈ పదార్థాలను తప్పక చేర్చుకోవాలి. తరచూ వీటిని తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఆహారం కంటే ముఖ్యంగా పైసా ఖర్చులేకుండా ఉదయం ఎండలో కాసేపు గడిపితే విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది.

– గర్రే హరిత, న్యూట్రీషియన్

ఆధ్యాత్మిక, భక్తి ప్రసారాల కోసం ప్రభుత్వ చానల్

- అధికారులకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం
- హైదరాబాద్ బోనాల జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ పరిధిలో ఆధ్యాత్మిక, భక్తి సంబంధిత ప్రసారాల కోసం ప్రత్యేకంగా ఒక చానల్‌ను తెచ్చే ప్రయత్నాలు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ఆషాఢ బోనాల జాతరను గ్రంథస్తం చేయడంతోపాటు డాక్యుమెంటరీని రూపొందించాలని సూచించారు. సినిమా థియేటర్లలో బోనాల జాతరపై యాడ్స్ ప్రసారం చేసేదిశగా సినీ పరిశ్రమతో చర్చించాలన్నారు. ఆషాఢ బోనాల జాతర నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. బోనాల సందర్భంగా అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, వచ్చే నెల 5 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర ద్వారాల వద్ద వలంటీర్లను పెట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయగలిగేలా ఆలయాల వద్ద పనిచేసే సిబ్బందికి ఆరోగ్య శాఖ శిక్షణ ఇవ్వాలని సూచించారు. బోనాల నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో అదనపు సర్వీసులను నడపడంతోపాటు సమయాన్ని పొడిగించాలని కోరారు.

రూపవతి ఏనుగుపై ఆరా

అమ్మవారి ఘట్టం ఊరేగింపు నిమిత్తం కర్ణాటక నుంచి తెప్పిస్తున్న ఏనుగు (రూపవతి) గురించి మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. జాతరలో ఏనుగు ప్రశాంతంగా ఉండేలా చూడాలని, తగిన విశ్రాంతి ఇవ్వాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. జాతరలో చేపట్టే సాంస్కృతిక ప్రదర్శనల్లో జానపద కళాకారులకు తగిన అవకాశం ఇచ్చి ప్రోత్సహించాలన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

సేవకులకు గుర్తింపు హర్షణీయం


నిర్మలను సన్మానిస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: వివిధ రంగాల్లో సేవలందించిన సమాజ సేవకులను గుర్తించడం హర్షణీయమని రాష్ట్ర స్థాయి కవయిత్రి నిర్మల పేర్కొన్నారు. ఈ నెల 23న బెంగళూరులో అక్కమహాదేవి సభాంగణంలో రాయచూరు బెళకు సంస్థ ఏర్పాటు చేసిన 117వ సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో మరిచి పోతున్న పాత సంప్రదాయాలను మననం చేసుకోవడానికి బెళకు సంస్థ చేస్తున్న సేవలు మరువరానివన్నారు. కవితలు, నాట్యం, కళలు, ఇతర అంశాలపై సంస్థ అధ్యక్షుడు అణ్ణప్ప మేటి అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో గౌరీ శంకర్, రజనీ రాజ్, రమేష్, లత, మహేంద్ర, బసమ్మ, దేవరాజ్, మాలతీ గౌడ, ఉమా, జయప్ప, సిద్దరామ, శంభోజీ, భీమరావ్‌లున్నారు.

పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి


మాట్లాడుతున్న లక్ష్మిరెడ్డి

రాయచూరు రూరల్: నగరంలోని జిల్లా పరిశ్రమల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీస్, అగ్నిమాపక కేంద్రాలను ప్రారంభించడానికి అనుమతి లభించిందన్నారు. సిరిధాన్యాల పరిశ్రమల స్థాపనకు సర్కార్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఆటోమొబైల్స్, సర్వీస్, రిపేరింగ్‌లకు ప్రోత్సాహ ధనం ఇవ్వాలన్నారు. మహిళలు స్వయం ఉద్యోగం, పరిశ్రమల ఏర్పాటుకు రుణ సౌకర్యాలు కేటాయించాలని, సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు.

కమిటీ సభ్యుడిగా చిదానంద




రాయచూరు రూరల్: రాష్ట్ర విద్యా హక్కు కమిటీ టాస్క్‌ఫోర్సు సభ్యుడిగా ఉపాధ్యాయుడు చిదానందను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విశ్వవిద్యాలయం మాజీ అధ్యక్షుడు సుఖదేవ్ థోరట్ ఆదేశాల మేరకు 13 అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి మూడు నెలల్లో నివేదిక అందించాల్సి ఉంటుంది.

మాదక ద్రవ్యాలపై జాగృతి జాతా


జాతాను ప్రారంభించిన జడ్జి తదితరులు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ గంజాయి, మాదక ద్రవ్యాలపై జాగృతి కల్పించాలని న్యాయ సేవా ప్రాధికార సభ్యుడు, న్యాయమూర్తి సిద్దరామప్ప పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన జాగృతి జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత గంజాయి, హఫీం వంటి వాటిని సేవించి ఆరోగ్యాలను నాశనం చేసుకోవడాన్ని నియంత్రించడానికి వాటి వల్ల కలిగే నష్టాలపై ఇంటింటికెళ్లి యువత మాదక ద్రవ్యాలను సేవించకుండా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రజలకు వివరించాలన్నారు. జాతాలో డీఎంఅండ్‌హెచ్‌ఓ సురేంద్రబాబు, ఏఎస్పీ శివకుమార్, రిమ్స్ అధికారులు విజయ శంకర్, రమేష్, మనోహర్ పత్తార్, యశోద, గణేష్, ప్రజ్వల్‌లున్నారు. కాగా రిమ్స్ కళాశాల విద్యార్థులు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై నాటకాన్ని ప్రదర్శించారు.

పంట ధ్వంసకులపై చర్యలేవీ?


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో రైతుల పొలంలో వేసిన పత్తి పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు ముదుకప్ప మాట్లాడారు. జిల్లాలో మాన్వి తాలూకా వ్యాప్తంగా పత్తి విత్తనాలు వేసుకున్న రైతుల పొలంలో పంటలను నాశనం చేశారని, వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.


ఇనుప చువ్వలు తేలిన ప్రభుత్వ పాఠశాల పైకప్పు


దుస్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల గది తలుపు


ప్రభుత్వ పాఠశాల గదిలో పెచ్చులూడిన పైకప్పు


పేరుకున్న దుమ్ము, లోపించిన శుభ్రత

అధ్వానంగా సర్కారీ బడులు

- వానకు కారుతున్న పాఠశాల గదులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సాక్షి బళ్లారి: జిల్లాలో చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా మారినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య ఏటేటా గణనీయంగా తగ్గిపోతోంది. జిల్లా వ్యాప్తంగా ఐదు తాలూకాల్లో దాదాపు 625 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 110 ప్రాథమికోన్నత పాఠశాలలు కలిపి మొత్తం 730కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో దాదాపు చాలా ప్రభుత్వ పాఠశాలల్లో 6 వేలకు పైగా గదులు అధ్వానంగా ఉన్నాయంటే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 730 ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10 శాతం కూడా సక్రమంగా గదులు లేకపోవడంతో విద్యార్థులకు శాపంగా మారింది. 6 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల గదుల్లో దాదాపు 4 వేల గదులు మాత్రమే అంతో ఇంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ మిగిలిన గదులు అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠశాల గదుల్లో చదువుకుంటున్నారు.

అభివృద్ధి లోపమే శాపం

ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తున్నారే కానీ పాఠశాలల్లో అభివృద్ధి కనిపించకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాలల పైకప్పులు పెచ్చులూడటం, పలు పాఠశాల గదులకు కిటికీలు లేకపోవడం సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి. నగరంలోని శ్రీరాంపుర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల అధ్వానంగా మారడంతో విద్యార్థులు భయపడుతూ పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మురికివాడల్లో నివసిస్తున్న పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యను అభ్యసించాలంటే తరగతి గదుల వాతావరణం చూసి వచ్చే రెండు అక్షరాలు కూడా రాకుండా పోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాలూకాలోని 140 ప్రాథమిక పాఠశాలలు, 35 ఉన్నత పాఠశాలల్లో చాలావరకు గదులు అధ్వానంగా కనిపిస్తున్నాయి.

నిధులున్నా చర్యలు సున్నా

జిల్లాలో డీఎంఎఫ్, కేఎంఆర్‌సీ, కేకేఆర్‌డీబీ నిధులు వేల కోట్లు మూలుగుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. జిల్లాలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1,36,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలను ప్రారంభించే ముందు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫాం అందజేసి చేతులు దులుపుకుంటున్నారే కానీ విద్యార్థులు ఏడాది పాటు ఏ విధంగా పాఠశాలలకు వస్తారన్న ఆలోచన చేయకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లాలో గదులతో పాటు మరుగుదొడ్లు, మంచి నీరు, క్రీడా మైదానం, స్కూల్ కాంపౌండ్ తదితర అనేక సమస్యలతో చదువుకునే విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు పాఠశాలలను బాగుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మనీ డబ్లింగ్ స్కీం పేరిట వంచన

- 6 వేల మందికి రూ.210 కోట్ల మేర టోపీ

హుబ్లీ: మీ డబ్బులు రెట్టింపు చేస్తామంటు ప్రజలను మోసం చేసే వారు ఎందరో అయితే ఇక్కడ ఒకే ఒక్కడు సుమారు వేలాది మందికి ఆన్‌లైన్‌లో టోకరా ఇచ్చి కోట్లాది రూపాయల మేర దండుకొని ప్రస్తుతం కటకటాల పాలయ్యాడు. వివరాలు.. టోపీ వేసిన వ్యక్తి పేరు కోడే రమణయ్య. స్వస్థలం ఆంధ్రప్రదేశ్. గత నాలుగైదేళ్లుగా కర్ణాటకలోనే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రజలకు శఠగోపం పెట్టడంలో ఇతడు ఘనాపాటి. మీ డబ్బులను రెట్టింపు చేస్తామని చెప్పి క్రౌండ్ క్లబ్ ఇంటర్ నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున ఆన్‌లైన్‌లో ప్రజలను మోసం చేయడమే ఇతడి వృత్తి. ఈ క్రమంలో మూడు నాలుగు నెలల క్రితం చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా చిక్కజాజూరు రైల్వే శాఖ ఉద్యోగి రమేష్‌కు రూ.4.79 కోట్లను తీసుకొని వంచించారు. అయితే తక్షణమే జాగ్రత్త పడిన రమేష్ న్యాయం కోసం చిత్రదుర్గ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు ఈ ఘరానా వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో నిందితుడి ఒక్కొక్క బండారం బయట పడింది. రమణయ్య సుమారు 6 వేల మందికి పైగా రూ.210 కోట్ల మేరకు మోసగించినట్లుగా పోలీసుల దర్యాప్తులో తెలిసింది. మొత్తానికి ఎట్టకేలకు ఈ ఘరానా దొంగ ఆట కట్టించడంలో చిత్రదుర్గ సైబర్ క్రైం పోలీసులు సఫలీకృతులయ్యారు. ప్రజలకు శఠగోపం పెట్టి ఎక్కడో దాక్కున్న నిందితుడిని చిత్రదుర్గకు తరలించి జుడీషియల్ కస్టడీకి అప్పగించారు. ఈ కేసును సీఐడీకి అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఈ ఘటనతో చిత్రదుర్గ ప్రజల్లో ఆందోళన నెలకొంది. నేటి హైటెక్ యుగంలోను ఇలాంటి మోసాలు జరుగుతూనే ఉన్నాయని భయపడుతున్నారు. కాగా దోచుకున్న డబ్బునంతా ఎక్కడ దాచి పెట్టాడో, అలాగే బాధితులు కూడా కోట్ల మేర ఎలా గడించారో నిగ్గు తేల్చాల్సి ఉంది. మనీ డబ్లింగ్ కేసులో నిందితుడు కటకటాలను లెక్కిస్తున్నాడు. ఇప్పటికైనా ప్రజలు ఆన్‌లైన్ కేటుగాళ్లకు బలి కారాదని పోలీసులు కోరుతున్నారు.

ఫ్యాటీ లివర్‌పై అవగాహన అవసరం

- ఆ వ్యాధి ప్రమాదకరం, సైలెంట్ కిల్లర్
- ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవికిరణ్ వెల్లడి


మాట్లాడుతున్న డాక్టర్ రవికిరణ్, చిత్రంలో కాలేయ మార్పిడి చేయించుకొన్న సత్యనారాయణ దంపతులు

సాక్షి బళ్లారి: కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, విపరీతంగా మద్యానికి అలవాటు కావడం తదితర కారణాలతో ఫ్యాటీ లివర్ సమస్య సర్వసాధారణమైందని బెంగళూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవికిరణ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో లివర్(కాలేయం) వ్యాధి ఏవిధంగా వస్తుంది, దానిని ఎలా నివారించుకోవాలి అనే విషయాలపై వివరించారు. లివర్ పూర్తిగా పాడైనప్పటికీ ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లివర్ మార్పిడికి అధునాతనమైన వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇటీవల కాలంలో దేశంలో నూటికి సగానికి పైగా 40–50 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారన్నారు. అయితే ప్రారంభంలోనే గుర్తిస్తే ఎలాంటి ఆపరేషన్ లేకుండా మందులతోనే సమస్యను నివారించుకోవచ్చన్నారు. అయితే ఇదొక సైలెంట్ కిల్లర్ అని, సమస్య తీవ్రమయ్యే వరకు బయటపడదన్నారు.

దురలవాట్లు లేకపోయినా..

మూడేళ్ల క్రితం జిల్లాలోని జిందాల్ కంపెనీలో పని చేస్తున్న 47 ఏళ్ల వయస్సుగల సత్యనారాయణ అనే వ్యక్తికి ఎలాంటి చెడు అలవాట్లు లేకపోగా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ కాలేయం పూర్తిగా దెబ్బతినే వరకు తెలియలేదన్నారు. మూడేళ్ల క్రితం ఆయన తమను సంప్రదించినప్పుడు కాలేయ మార్పిడి అనివార్యం కావడంతో అతని భార్య మాధవి కాలేయం తీసి సత్యనారాయణకు ఆపరేషన్ ద్వారా అమర్చామన్నారు. భార్య లివర్ దానం చేయడంతో నిండు ప్రాణాన్ని కాపాడామన్నారు. మూడేళ్ల నుంచి లివర్ మార్పిడి చేయడంతో ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తలేదన్నారు. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకే పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇందుకు ప్రధానంగా ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడమే కారణమన్నారు. కాలేయం బాగా పని చేస్తుందా లేదా అన్న విషయంపై ఏడాదికోసారి పరీక్ష చేయించుకోవాలన్నారు.

వ్యర్థాల నిర్వహణ లేకుంటే పశుపక్ష్యాదులకు నష్టం


మాట్లాడుతున్న డాక్టర్ డీవీ పరమశివమూర్తి

హొసపేటె: వ్యర్థాల నిర్వహణలో స్థానిక సంస్థలు, యువత పాత్ర, వ్యర్థాల నిర్వహణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో స్థానిక సంస్థలు, యువత పాత్రపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం హంపీ విశ్వవిద్యాలయం భువన విజయలో జరిగింది. హంపీలోని కన్నడ విశ్వవిద్యాలయం నేషనల్ సర్వీస్ ప్లానింగ్ యూనిట్ నిర్వహించిన జాతీయ సేవా ప్రణాళిక శిబిరంలో హాల్ అధ్యక్షత వహించిన కులపతి డాక్టర్ డీవీ పరమశివమూర్తి మాట్లాడుతూ నేటి కాలంలో సరైన వ్యర్థ పదార్థాల నిర్వహణ జరగకపోతే మానవాళితో పాటు యావత్ జంతుజాలం నష్టపోవాల్సి వస్తుందన్నారు. శక్తినగర్ క్యాఘటెక్ అభివృద్ధి కేంద్రం విజయనగర జిల్లా శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి శరణబసప్ప పట్టెద మాట్లాడుతూ చెత్త నిర్వహణలో స్థానిక సంస్థలు, యువత పాత్రపై ఉపన్యాసం చేస్తూ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ సవాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిధ్వనిస్తోందన్నారు. ఇప్పటికైనా మేల్కొనక పోతే రాబోయే తరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యర్థ పదార్థాల నిర్వహణలో నూతన సాంకేతికతలను అమలు చేయడంలో క్యాఘటెక్ ఇనిస్టిట్యూట్ ముందుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు పొందిందని తెలిపారు.

ఈసారి టెన్త్ ఫలితాలను మెరుగుపరుద్దాం


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: 2024వ సంవత్సరానికి గాను ఎస్ఎస్ఎల్‌సీ పరీక్ష ఫలితాలపై రివిజన్ వర్క్‌షాప్ బుధవారం హగరిబొమ్మనహళ్లిలోని గురుభవన్‌లో జరిగింది. హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని అన్ని ప్రభుత్వ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బీఆర్‌సీ కో–ఆర్డినేటర్లు, ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్లు, ఫీల్డ్ రిసోర్స్ పర్సన్లు హాజరైన వర్క్‌షాప్‌లో జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యల గురించి సుదీర్ఘంగా విశ్లేషించారు. వచ్చే ఎస్ఎస్ఎల్‌సీ పరీక్ష ఫలితాలను సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శాఖ సమష్టి కృషితో పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. జిల్లాలో ఎస్సెస్సెల్సీ ఫలితాలు మెరుగు పరిచేందుకు ఇది తొలి అడుగు అన్నారు. విద్యార్థులు చదువులో వెనుకబాటుకు గల కారణాలను గుర్తించి విద్యార్థుల్లోని న్యూన్యతాభావాన్ని తొలగించేందుకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో స్నేహపూర్వకంగా సంప్రదింపులు జరిపి ఫలితాలు పెంచేందుకు అదనపు అవకాశాలు కల్పించాలన్నారు. తరగతుల్లో విద్యార్థి సంఘాలను రూపొందించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సంభాషణ, పోటీ స్ఫూర్తిని సృష్టించడం, విద్యార్థులను నేర్చుకోవడంలో పాల్గొనేలా చేయడం, ఫలితాలను మెరుగు పరచడానికి మార్గాలను కనుగొనడం, నరేగ పథకం కింద గతేడాది విజయనగర జిల్లాకు 73 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ఆడుతూ యువకుడు మృత్యు ఒడికి

హుబ్లీ: స్నేహితులతో కలిసి స్నూకర్ ఆడుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన ధార్వాడలోని రజతగిరిలో బుధవారం చోటు చేసుకుంది. సుషాంత్ మల్లిగేరి అనే యువకుడు మిత్రులతో కలిసి ఆడుతుండగా ఉన్నఫళంగా గుండెపోటుకు గురై కూలి కింద పడ్డాడు. మొత్తానికి ఆడుతునే తమ తోటి స్నేహితుడు మృతి చెందడంతో మిత్రులు శోకసంద్రంలో మునిగి పోయారు. ఈ దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీలో నమోదు కావడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై విద్యాగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విమానాశ్రయ డైరెక్టర్‌కు బెదిరింపు

హుబ్లీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి హుబ్లీ విమానాశ్రయ డైరెక్టర్‌ను చంపుతామని ఈ–మెయిల్ ద్వారా సందేశం పంపించాడని సదరు డైరెక్టర్ రూపేష్‌కుమార్ తెలిపారు. డైరెక్టర్ కార్యాలయ మెయిల్ ఐడీకి ఈ బెదిరింపు సందేశం వచ్చిందని చెప్పారు. లాంగ్ లివ్ ఫాలిన్స్ అనే పేరున ఈ–మెయిల్ వచ్చింది. తాము మిమల్ని నాశనం చేస్తాం. మీరు చేసిన అన్ని చెడ్డ పనులకు సమాధానం లేదని భావిస్తున్నారా? నిప్పుల్లో పడేస్తాం. ఊపిరి పోయి చస్తారంటూ సందేశంలోని వివరాలను రూపేష్‌కుమార్ టర్మినల్ ఇన్‌చార్జి అధికారికి తెలియజేశారు.

రేపటి నుంచి హాస్య నాటక ప్రదర్శన

హుబ్లీ: పాత బస్టాండ్ సుజాత ప్యాటి పక్కన ఏర్పాటు చేసిన రంగ మందిరంలో ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు విజయపుర కమతగి శ్రీగురు హొళె హుచ్చేశ్వర నాటక సంఘం ఆధ్వర్యంలో గండనిగె తక్క హెండతి(భర్తకు తగ్గ భార్య) అనే హాస్య భరిత నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నామని కళాకారుడు, కవి బసవరాజ బెంగేరి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం హుబ్లీ మూరుసావిర మఠం జగద్గురు డాక్టర్ గురుసిద్ధ రాజ యోగీంద్ర స్వామి సాన్నిధ్యంలో జరగనుందన్నారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ, ప్రొఫెసర్ ఐజీ సనది, డాక్టర్ గోవింద్ మన్నూర, పాలికె కమిషనర్ డాక్టర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి, ఏసీపీలు శివప్రకాష్ నాయక్, వినోద్ ముక్తేదార, విశ్రాంత సీఐ శ్యామరాజ సజ్జన్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీకి బాదర్లి నామినేషన్

బనశంకరి: శాసనసభ నుంచి విధానపరిషత్‌కు ఎన్నుకునే ఒక ఎమ్మెల్సీ స్థానానికి 12వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా బసవనగౌడ బాదర్లి బుధవారం నామినేషన్ వేశారు. అసెంబ్లీ కార్యదర్శి విశాలాక్షికి నామినేషన్ పత్రాలు అందజేశారు. మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ రాజీనామా చేయడంలో ఆ ఎమ్మెల్సీ సీటు ఖాళీ అయింది. శాసనసభలో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ ఉండటంతో బాదర్లి గెలుపు సునాయాసం కానుంది.

భారీ వర్షం.. వీధులు జలమయం


రోడ్డుపై ప్రవహిస్తున్న వాన నీరు

రాయచూరు రూరల్: జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఎక్కడ చూసినా రోడ్లు బురద గుంటలుగా మారాయి. రాయచూరులో 2.6 మి.మీ., యరగేరలో 2.5 మి.మీ., లింగసూగూరులో 9.5 మి.మీ, మాన్విలో 6.2 మి.మీ., దేవదుర్గలో 2.5 మి.మీటర్ల వర్షం పడింది. షరాఫ్ బజార్, మున్నూరు వాడి, గాంధీ చౌక్, మహావీర్ చౌక్, కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చొరబడ్డాయి. వర్షంతో నగరవాసులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

చదువుతోనే చక్కని భవిష్యత్


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించిన దృశ్యం

కోలారు: లక్ష్యం, శ్రద్ధతో చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎప్సన్ కంపెనీ అధ్యక్షుడు ఎస్.సాంబమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లాలోని 42,480 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.3.5 కోట్ల విలువ చేసే 2.35 లక్షల నోటు పుస్తకాలు, 12 వేల బ్యాగులు, 77 పాఠశాలలకు రక్షిత తాగునీటి ఫిల్టర్లు, 50 పాఠశాలలకు స్మార్ట్ క్లాస్‌లను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు, కలలను నెరవేర్చాలన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి సత్ఫౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యాశాఖ డీడీపీఐ కృష్ణమూర్తి, ఎప్సన్ కంపెనీ అధికారి నవీన్‌శెట్టి, ఉపాధ్యాయ గెళెయర బళగ అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు వీరణ్ణగౌడ పాల్గొన్నారు.

ఎంత వెదికినా కన్య దొరకడం లేదు

- వయస్సు పెరిగిపోతోందని ఆవేదన
- పెళ్లి జరిపించాలని యువకుడి మొర
- జిల్లాధికారికి వినతిపత్రం అందజేత


జిల్లాధికారికి వినతిపత్రం అందిస్తున్న యువకుడు

సాక్షి,బళ్లారి: ఇటీవల గత కొన్నేళ్లుగా పెళ్లి వయస్సుకు వచ్చిన యువకులకు వధువులు దొరకడం కష్టతరంగా మారడంతో యువకులు వినూత్న తరహాలో ఏదో ఒక కార్యక్రమాలు చేస్తూ వార్తల్లోకి ఎక్కుతూ అందరినీ ఆకర్షిస్తున్న దృశ్యాలు చూస్తుంటాం. అదే తరహాలో కొప్పళ జిల్లాలో ఓ యువకుడు తాను ఎంత వెదికినా,ఎన్ని ప్రాంతాలకు వెళ్లి సంబంధాలు చూసినా కన్య దొరకడం లేదని జిల్లాధికారికి వినతిపత్రం అందజేస్తూ తనకు పెళ్లి జరిపించాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. రైతు కుటుంబాల్లో జన్మించిన వారికి, యువ రైతులకు అమ్మాయిలను ఇవ్వడం లేదని, దీనిని సీరియస్‌గా తీసుకోవాలని విన్నవించారు. దేశానికి వెన్నెముక, అన్నం పెట్టేది కూడా రైతులేనని, అలాంటి రైతు యువకులకు ఎవరూ పిల్లను ఇవ్వడం లేదని తన గోడును వెళ్లబోసుకున్నారు. బుధవారం కొప్పళ జిల్లా కనకగిరిలో జిల్లాధికారి నళిన్ అతుల్ ఆధ్వర్యంలో జరిగిన జనస్పందన కార్యక్రమంలో కనకగిరి పట్టణానికి చెందిన సంగప్ప శిరహట్టి అనే 30 ఏళ్ల యువకుడు తాను రైతును అనే కారణానికి కన్యను ఇవ్వడం లేదని, తనకు ఆరు ఎకరాల భూమి ఉందని, వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నానని, చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నానని, అయితే తనకు పిల్లను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఈ వినతిపత్రాన్ని అందుకున్న జిల్లాధికారి అవాక్కయ్యారు. పరిశీలిస్తామని జవాబు చెప్పడం గమనార్హం.

ఘనంగా సంస్థాపన దినోత్సవం


మాట్లాడుతున్న చెన్నబసవ

రాయచూరు రూరల్: నగరంలో ఏఐడీఎస్‌ఓ 59వ సంస్థాపన దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అధ్యక్షుడు చెన్నబసవ మాట్లాడారు. విద్యార్థులకు విద్యార్థి వేతనాలు, హాస్టల్ వసతులు, ప్రవేశ సమయంలో ఫీజుల్లో మినహాయింపులు, నూతన పింఛన్ పథకం –2020ని వాపస్ తీసుకోవాలని, పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని వివిధ అంశాలపై ఆందోళనలు చేపట్టిన విషయాలను గుర్తు చేశారు.

హెచ్‌ఎంని తొలగించాలని ధర్నా


ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా యలగట్ట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని తొలగించాలంటూ పాఠశాల ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. సంచాలకుడు రమేష్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి పాఠశాలలో విధులకు గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడు నాగనగౌడను సస్పెండ్ చేయాలని ఒత్తిడి చేశారు. గత వారం రోజుల నుంచి పాఠశాల వద్ద ఆందోళన చేపట్టిన అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు వేసుకున్న టెంట్‌ను పోలీసులు దౌర్జన్యంగా తొలగించడాన్ని ఖండించారు.

గురుశిష్యుల బంధం చిరస్మరణీయం

హుబ్లీ: భారతీయ సంస్కృతిలో గురుశిష్యుల మధ్య అవినాభావ సంబంధం జీవిత పర్యంతం ఉంటుంది. అందుకుగాను ఒకప్పుడు శిష్యులుగా నేర్చుకొని ఆ తర్వాత ఉన్నత స్థానాలను అధిరోహించినా కూడా శిష్యులు తమ గురువులపై అపారమైన గౌరవాన్ని కలిగి ఉంటారనేందుకు విజయనగర సిటీ హైస్కూల్ 1992–93వ సంవత్సరపు పూర్వ విద్యార్థులు నిర్వహించిన గురువందన కార్యక్రమమే నిదర్శనం. పూర్వ విద్యార్థులందరూ తమ గురువులకు పాదపూజ చేసి కృతజ్ఞతను చాటుకున్నారు. 70 మందికి పైగా విద్యార్థులు 20 మంది ఉపాధ్యాయులకు పూజలు చేయడం ద్వారా తమ గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివిధ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు కేఎస్.మిట్టిమణి, ఎంఈ మానె, మంజుల, వినూత, గీత కోనేరి, విద్యా జోషి తదితర ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముంగారు ఉత్సవాల రాయబారికి సన్మానం


పాపారెడ్డిని సన్మానిస్తున్న శ్రీపాదంగళ్

రాయచూరు రూరల్: ముంగారు ఉత్సవాల రాయబారి, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డిని మంత్రాలయంలో సన్మానించారు. బుధవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగళ్ ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు నగరంలో మున్నూరు కాపు ముంగారు ఉత్సవ వేడుకలను వందలాది మంది సమక్షంలో జరిపిన నేపథ్యంలో ఆయనను సుబుదేంద్ర తీర్థులు అభినందించారు.

పైకప్పు కూలి ఒకరి మృతి

హుబ్లీ: చిత్రదుర్గ జిల్లాలో ఓ ఇంటి పైకప్పు కూలిన ఫలితంగా ఓ వ్యక్తి మరణించాడు. పైకప్పు సరి చేస్తున్న వేళ ఈ వ్యక్తి కింద పడి మృతి చెందిన ఘటన చెళ్లకెరె తాలూకా రామజోగిహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మురళీధర్(45) ఇంటి పైకప్పు మరమ్మతుల కోసం పైకి ఎక్కారు. ఆ సమయంలో పైకప్పు కూలడంతో కిందపడి మురళీధర్ దుర్మరణం పాలయ్యారు. ఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.